A'lam-e-Barzakh (Telugu)

బర్జఖ్
(పితృలోకం)

మూలం

మౌలానా అస్లం జిరాజ్‌పూరి
మౌలానా సయ్యద్ సులేమాన్ నద్వీ
మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది

అనువాదం

అబుల్ ఫౌజాన్
M.A (Islamic Std.), M.A. (Urdu)

మౌలా
మౌలానా (ఉ
మౌలానా సలాదూది

విషయసూచిక

1. బర్‌జఖ్ (పితృలోకం) 05

- మౌలానా అస్లం జిరాజ్ పూరి

2. బర్‌జఖ్ 35

- మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది

3. బర్‌జఖ్- ఒక కోణం 59

- మౌలానా సయ్యద్ సులేమాన్ నద్వి

4. బర్‌జఖ్ - ఇంకో కోణం 75

-మౌలానా అస్లం జిరాజ్‌పూరి

5. బర్‌జఖ్‌పై వాదన 89

- మౌలానా అస్లం జేరాజ్‌పూరి

6. వాదనకు సమాధానం 108

- మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది

అనంత కరుణామయుడు అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

1. బర్‌జఖ్ లోకం (పితృలోకం)

(మౌలానా అస్లం జీరాజ్‌పూరి)

"తాలిమాతె ఖుర్‌ఆన్" అనే నా గ్రంథం నుండి, ఈ శీర్షికను ఎన్ను కొని, 'జామియ' అనే పత్రికలో ప్రచురించటం జరిగింది. కొందరు సోదరులు, ఆజంగడ్ నుండి వెలువడే "మఆరిఫ్" అనే పత్రికలో దీన్ని విమర్శిస్తూ, సమాధానాలు వ్రాశారు. అయితే వారు ఖుర్‌ఆన్ బోధనల వెలుగులో దీనిపై వాదించే బదులు, తమ అనుకరణ స్వభావాభిమానంతో దీన్ని ఖండించే ప్రయత్నం చేశారు. ఇది ఆశ్చర్యపడవలసిన విషయమేమీ కాదు, ఆచారంలో నున్న తమ పూర్వీకుల ఆలోచనా, ఆచరణల పంథాయే సరియైనదని భావించేవారు ప్రతికాలంలోనూ ఉంటూవచ్చారు.

దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

وَاِذَا قِيْلَ لَهُمُ اتَّبِعُوْا مَآ اَنْزَلَ اللّٰهُ قَالُوْا بَلْ نَتَّبِعُ مَا وَجَدْنَا عَلَيْهِ اٰبَآءَنَا

"అల్లాహ్ అవతరింపజేసినదాన్ని అనుసరించండి" అని వారితో అన్నప్పుడు, వారు 'మా పూర్వీకులు దేనిపై నడుస్తూ ఉండగా మేము చూశామో, దానినే మేము అనుసరిస్తాము' అని అంటారు"

(లుఖ్మాన్- 21)

కాని "తర్జుమానుల్ ఖుర్‌ఆన్" సంపాదకులైన మీరు, ఖుర్‌ఆన్ సమర్థన, అభిమానం మరియు దాని ప్రచారమే ధ్యేయమని చెప్పుకునే మీరు కూడా పైవారితో ఏకీభవించటం చూసి ఆశ్చర్యంవేసింది. మీరు కూడా వారి ప్రతిస్పందనను సమర్థిస్తున్నారు. అందుకని ఈ విషయానికి సంబంధించి దివ్యఖుర్‌ఆన్ బోధనల్ని మరోసారి సంక్షిప్తరూపంలో అధ్యయనం, పరిశీలన మరియు సముచితరీతిలో మీ పత్రికలో దీనిపై చర్చిస్తారని ఆశిస్తూ పంపిస్తున్నాను.

'మఆరిఫ్' పత్రికలోని ప్రతిస్పందనల తీరు- వాటిపట్ల మీరూ అసంతృప్తిని వ్యక్తపరిచారు- ప్రశంసించదగినదిగా లేనందువల్ల, వాటిపై ఖుర్‌ఆన్‌లాంటి దివ్యగ్రంథానికి సంబంధించి చర్చించటం సమంజసమని పించక, వాటికి ప్రత్యుత్తరాలు ఇవ్వటం జరుగలేదు.

"బర్జఖ్' గురించి దివ్యఖుర్‌ఆన్ తెలిపేదేమిటి? అనేది ఈ చర్చకు శీర్షిక కనుక ఖుర్‌ఆన్, కేవలం ఖుర్‌ఆన్ ఆధారంగానే దీనిపై వ్రాయటం జరుగుతుంది.

ఖుర్‌ఆన్‌లో 'బర్జఖ్' అనే పదం అడ్డు, తెర, చాటు లేక అవరోధం అనే అర్థంలో ఉపయోగించబడింది.

"రెండు సముద్రాలను కలిపి ఉంచినవాడు ఆయనే. ఒకటేమో రుచికరమైనది, మధురమైనదీను, రెండోది చేదైనది, ఉప్పైనదీను, ఆ రెంటి మధ్య ఒక తెర అడ్డంగా ఉన్నది. అది వాటిని కలిసిపోకుండా ఆపి ఉంచే అవరోధం."

(అల్ ఫుర్ఖాన్- 53)

وَجَعَلَ بَيْنَهُمَا بَرْزَخًا وَّ
حِجْرًا مَّحْجُورًا

రెండవచోట 'బర్జఖ్'కు బదులు 'హాజిజ్' అనే పదం ఉపయోగించబడింది.

"రెండు రకాల జలధుల మధ్య అడ్డు తెరలను పెట్టినవాడు ఎవడు?"
(అన్ నమ్ల్- 61)

وَجَعَلَ بَيْنَ الْبَحْرَيْنِ حَاجِزاً

ఫలితంగా అవి రెండు తమ తమ హద్దుల్ని అతిక్రమించలేవు.

"అయినా వాటి మధ్య ఒక తెర అడ్డంగా ఉంది." (అర్రహ్మాన్- 20)

بَيْنَهُمَا بَرْزَخٌ لَّا يَبْغِيَانِ

ఈక్రింది ఆయతులో కూడా బర్జఖ్‌కు ఇదే భావం తీసుకోవటం జరిగింది.

"ఇప్పుడు ఈ (మరణించేవారి) అందరి వెనుక ఒక గోడ అడ్డంగా ఉన్నది. అది మరొక జీవితం వచ్చే రోజు వరకు ఉంటుంది."
(అల్ మోమినూన్- 100)

وَمِن وَرَائِهِم بَرْزَخٌ إِلَىٰ يَوْمِ يُبْعَثُونَ ۝

అంటే మరణం మొదలుకొని ప్రళయం వరకు ఈ 'బర్జఖ్' వ్యవధి (కాలం) ఉంటుంది. ఈ కాలంలో వారు (మరణించినవారు) దైవ సమ క్షంలో కాకుండా చాటుగా (ఒకచోట) ఉంచబడతారు. ప్రళయం తరువాత వారు దైవసమక్షంలో ప్రవేశపెట్టబడతారు.

"అది భయంకరమైన ఒక ధ్వని మాత్రమే. దానితో అందరూ మా ముందు హాజరుపరచబడతారు."
(యాసీన్: 53)

إِن كَانَتْ إِلَّا صَيْحَةً وَاحِدَةً فَإِذَا هُمْ جَمِيعٌ لَّدَيْنَا مُحْضَرُونَ ۝

దైవమార్గంలో చంపబడినవారు (షహీద్), దివ్యఖుర్‌ఆన్‌లో వివరించినట్లు, వారు బర్‌జఖ్ అంటే చాటుగా కాకుండా, బాహాటంగా తమ ప్రభువు సమక్షంలో ఉంటారు. వారికి అక్కడ కొత్త జీవితం లభిస్తుంది. వారక్కడ భుక్తిని అనుభవిస్తారు.

"అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారిని మృతులుగా భావించకండి, వాస్తవానికి వారు సజీవులే. తమ ప్రభువు వద్ద జీవికను పొందుతున్నారు." (ఆలి ఇమ్రాన్- 169)

وَلَا تَحْسَبَنَّ الَّذِينَ قُتِلُوا فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتًا بَلْ أَحْيَاءٌ عِندَ رَبِّهِمْ يُرْزَقُونَ ○

షహీద్‌లు (దైవమార్గంలో చంపబడినవారు) కాకుండా, మిగిలిన మృతులు ఉంచబడే ప్రదేశమే 'బర్‌జఖ్'. ఖుర్‌ఆన్‌ను అనుసరించి ఇది సంపూర్ణంగా మృత్యులోకమే. అందులో జీవితానికి సంబంధించి ఎలాంటి చిహ్నాలు, సూచనలూ లేవు. అందుకని ముష్రికీన్ (బహుదైవారాధకులు) పూజించే వారి ధార్మిక పురుషులు, పూర్వీకుల గురించి ఖుర్‌ఆన్ ఇలా అంటున్నది.

"అల్లాహ్‌ను వదలి ప్రజలు వేడుకుంటున్న ఇతర శక్తులు ఏ వస్తువుకూ సృష్టికర్తలు కారు. వారు స్వయంగా సృష్టింపబడినవారు, నిర్జీవులే కాని సజీవులు కారు. వారు ఎప్పుడు (మళ్ళీ బ్రతికించబడి) లేపబడనున్నారో వారికెంత మాత్రం తెలియదు." (అన్‌నహ్ల్- 20, 21)

وَالَّذِينَ يَدْعُونَ مِن دُونِ اللَّهِ لَا يَخْلُقُونَ شَيْئًا وَهُمْ يُخْلَقُونَ ○ أَمْوَاتٌ غَيْرُ أَحْيَاءٍ وَمَا يَشْعُرُونَ أَيَّانَ يُبْعَثُونَ ○

ఈ ఆయతులో ఒకే దైవం తప్ప, ఇతరములు అనగా విగ్రహాలు,

చెట్లు, సూర్యచంద్రాదుల లాంటి ప్రాణంలేని విషయాల గురించి చెప్పబడ లేదు, ఎందుకంటే వీటికి మరణం, తిరిగి లేపబడటం లాంటి పదాలు వాడే అవకాశమే లేదు. ఇందులో వారు (బహుదైవారాధకులు) దైవసన్నిధిలో ప్రీతిపాత్రులు. ఏదైనా చేయగలిగే అధికారమున్నదనుకొని పూజించే వారి ధార్మిక పురుషుల గురించే చెప్పటం జరిగింది. ఇంకొక ఆయతులో ఈ విషయం ఇంకా వివరంగా పేర్కొనటం జరిగింది.

وَمَنْ اَضَلُّ مِمَّنْ يَدْعُوْا مِنْ دُوْنِ اللّٰهِ مَنْ لَّا يَسْتَجِيْبُ لَهٗ اِلٰى يَوْمِ الْقِيٰمَةِ وَهُمْ عَنْ دُعَآئِهِمْ غٰفِلُوْنَ ۝ وَاِذَا حُشِرَ النَّاسُ كَانُوْا لَهُمْ اَعْدَآءً وَّكَانُوْا بِعِبَادَتِهِمْ كٰفِرِيْنَ ۝

"అల్లాహ్ను కాదని, ప్రళయం వచ్చే వరకు అతనికి సమాధానమైనా ఇవ్వ లేని వారిని, మొరపెట్టుకొనేవారు తమకు మొరపెట్టుకుంటున్నా రనే విషయం కూడా ఎరుగనివారిని వేడుకునేవాడికంటే పరమ భ్రష్టుడైన మానవుడు ఎవడు ఉంటాడు? మాన వులందరినీ సమావేశపరిచినప్పుడు, వారు తమను వేడుకున్నవారికి విరో ధులై పోతారు, వారి ఆరాధనను తిరస్కరిస్తారు. (అల్ అహ్ఖాఫ్- 5, 6)

పై వివరణ ద్వారా రెండు విషయాలు తేటతెల్లమయ్యాయి. ఒకటి ఈ దైవేతరులు (ఎవరినయితే వీరు పిలుస్తున్నారో) బహుదైవారాధకుల పిలుపును, విన్నపాన్ని వినటంలేదు. రెండవది, వీరు పిలుస్తున్నది వారి ధార్మిక పురుషులు, దైవసాన్నిధ్యంలో ప్రీతిపాత్రులైన వారినే అనేది ఈ ఆయతు ద్వారా స్పష్టమవుతున్నది. వీరే ప్రళయం రోజు తమను ఆరాధిం చిన విషయాన్ని తిరస్కరిస్తారు. ప్రాణంలేని వాటిలో నిరాకరించే, తిరస్కరించే (మాట్లాడే) శక్తేలేదుగా!

ఇక మూడవ ఆయతును పరిశీలించండి. అందులో ఈ దైవేతర ధార్మిక పురుషుల వినిపించుకునే, లేక వినే స్థోమతను ఖండించటం జరిగింది.

وَالَّذِيْنَ تَدْعُوْنَ مِنْ دُوْنِهٖ مَا يَمْلِكُوْنَ مِنْ قِطْمِيْرٍ ۝ اِنْ تَدْعُوْهُمْ لَا يَسْمَعُوْا دُعَاۗءَكُمْ ۚ وَلَوْ سَمِعُوْا مَا اسْتَجَابُوْا لَكُمْ ۭ وَيَوْمَ الْقِيٰمَةِ يَكْفُرُوْنَ بِشِرْكِكُمْ

"ఆయనను కాదని మీరు పిలిచే ఇతరులు కనీసం ఒక గడ్డిపోచకు కూడా యజమానులు కారు. వారిని వేడుకుంటే, వారు మీ ప్రార్థనలను వినలేరు, ఒకవేళ విన్నా, వాటికి ఏ సమాధానమూ మీకు ఇవ్వలేరు. మీరు కల్పించిన దైవత్వపు భాగస్వామ్యాన్ని వారు ప్రళయంనాడు తిరస్కరిస్తారు."
(ఫాతిర్- 14)

ఈ తిరస్కరించే విషయాన్ని ఖుర్‌ఆన్ అనేకచోట్ల వివరించింది.

وَاِذَا رَاَ الَّذِيْنَ اَشْرَكُوْا شُرَكَاۗءَهُمْ قَالُوْا رَبَّنَا هٰٓؤُلَاۗءِ شُرَكَاۗؤُنَا الَّذِيْنَ كُنَّا نَدْعُوْا مِنْ دُوْنِكَ ۚ فَاَلْقَوْا اِلَيْهِمُ الْقَوْلَ اِنَّكُمْ لَكٰذِبُوْنَ

"ప్రపంచంలో షిర్క్ చేసినవారు, తాము అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టినవారిని (ప్రళయంరోజున) చూసినప్పుడు ఇలా అంటారు: 'ప్రభూ! మేము నిన్ను వదిలిపెట్టి వేడుకుంటూ ఉండిన భాగస్వాములు వీరే'. అప్పుడు వారు కల్పించిన ఈ దేవుళ్ళు 'మీరు అబద్ధం చెబుతున్నారు' అని స్పష్టంగా సమాధానం ఇస్తారు."

(అన్ నహ్ల్- 86)

వేరొకచోట ఇలా వచ్చింది.

وَيَوْمَ يَحْشُرُهُمْ جَمِيعًا ثُمَّ نَقُولُ لِلَّذِينَ أَشْرَكُوا مَكَانَكُمْ أَنْتُمْ وَشُرَكَاؤُكُمْ فَزَيَّلْنَا بَيْنَهُمْ وَقَالَ شُرَكَاؤُهُمْ مَا كُنْتُمْ إِيَّانَا تَعْبُدُونَ ۝ فَكَفَىٰ بِاللَّهِ شَهِيدًا بَيْنَنَا وَبَيْنَكُمْ إِنْ كُنَّا عَنْ عِبَادَتِكُمْ لَغَافِلِينَ ۝

"మేము వారందరినీ ఒకేసారి (మా న్యాయస్థానంలో) సమావేశపరిచే రోజున షిర్క్‌చేసిన వారితో ఇలా అంటాము. 'ఆగండి మీరూ, మాకు మీరు భాగస్వాములుగా కల్పించిన వారూ!' ఆ తరువాత మేము వారి మధ్య ఉన్నటువంటి అపరిచయపు తెరను తొలగిస్తాము. వారు కల్పించిన భాగస్వాములు ఇలా అంటారు: 'మీరు మమ్మల్ని ఆరాధించలేదు. మీకూ, మాకూ మధ్య అల్లాహ్ సాక్ష్యంచాలు. (ఒకవేళ మీరు మమ్మల్ని ఆరాధించి ఉండినా) మీరు చేసిన ఆ ఆరాధనను గురించి మాకు ఏమాత్రమూ తెలియదు."

(యూనుస్- 29)

పై ఆయతుల ద్వారా రెండు విషయాలు తెలిసివచ్చాయి. ఒకటి దైవసాన్నిధ్యంలో ప్రీతిపాత్రులని, ఏదైనా చేయగల శక్తిసామర్థ్యాలున్నాయని వీరు (బహుదైవారాధకులు) భావించి, పూజించేది వారి ధార్మిక పురుషులు, గతించిన పుణ్యపురుషులు మాత్రమే అనేది. ఒక రెండవ అంశం, గతించిన వారంతా బర్జఖ్‌లో ఉన్న వారందరిలోనూ జ్ఞానంగాని, అవగాహనగాని, తెలివి, ఎరుకగాని, వినే స్థోమతగాని ఏవీలేవు. వారికి ఇవేవీ తెలీకుండా, కేవలం ఊరికే పడిఉన్నారు. ఇంకా ప్రళయం రోజు వీరు, తమను పూజించిన వారిని, తమను (సహాయార్థం) పిలిచినవారిని, మీ ఆరాధన గురించి

గాని, మీ పిలుపు గురించి గాని మాకేమీ తెలియదని నిర్మోహ మాటంగా సమాధానం ఇస్తారు.

ఇంకొక విధంగా చూడండి. ఖుర్‌ఆన్‌ను అనుసరించి మానవునికి రెండు మరణాలు, రెండే జీవితాలున్నాయి. ఈ కారణంగానే దైవ తిరస్కారులు ప్రళయం రోజు ఇలా అంటారు.

"ప్రభూ! నిజంగానే నీవు మాకు రెండు సార్లు మరణాన్ని, రెండుసార్లు జీవితాన్ని ఇచ్చావు. ఇప్పుడు మేము మా తప్పులను ఒప్పుకుంటు న్నాము. కనుక ఇక్కడినుండి బయటపడే మార్గం కూడా ఏమైనా ఉందా?" (అల్ మూమిన్- 11)

أَمَتَّنَا اثْنَتَيْنِ وَأَحْيَيْتَنَا اثْنَتَيْنِ فَاعْتَرَفْنَا بِذُنُوبِنَا فَهَلْ إِلَىٰ خُرُوجٍ مِّن سَبِيلٍ

ఇవి దైవతిరస్కారుల పలుకులే అయినా, ఇది వాస్తవం. బఖర సూరాలో దైవం ఇలా సెలవిచ్చాడు:

"వాస్తవానికి ప్రాణంలేని మీకు ఆయన ప్రాణం పోశాడు. మళ్ళీ మీ ప్రాణాన్ని తీసేది ఆయనే. తిరిగి మిమ్మల్ని బ్రతికించేది ఆయనే. చివరకు మీరంతా ఆయన వద్దకే మరలిపోతారు" (అల్ బఖర- 28)

كُنتُمْ أَمْوَاتًا فَأَحْيَاكُمْ ثُمَّ يُمِيتُكُمْ ثُمَّ يُحْيِيكُمْ ثُمَّ إِلَيْهِ تُرْجَعُونَ ۝

ప్రపంచంలో జీవించిన ఈ జీవితానికి ముందున్న పరిస్థితిని మృత్యువుతో పోల్చటం జరిగింది. ఆ మృత్యువు పిదపనే ఈ (ప్రాపంచిక) జీవనం లభించింది. ఈ జీవనం తరువాత మృత్యువు వస్తుంది. ఆ తరువాత మరో సారి జీవనం ఇవ్వబడుతుంది. ఇక ఆ జీవనానికి చావనేది లేదు. ఇక ఈ

రెండవ జీవనం ఎప్పుడు లభిస్తుంది? సమాధిలోనా? లేక ప్రళయంరోజా? ఈ రెండవ జీవితం ప్రళయం రోజు లభిస్తుందని ఖుర్‌ఆన్ చెబుతుంది.

ثُمَّ إِنَّكُم بَعْدَ ذَٰلِكَ لَمَيِّتُونَ ۝ ثُمَّ إِنَّكُمْ يَوْمَ الْقِيَامَةِ تُبْعَثُونَ ۝

"దాని తరువాత మీరు తప్పనిసరిగా మరణిస్తారు. మళ్ళీ ప్రళయం నాడు నిస్పందేహంగా లేపబడతారు."
(అల్‌హజ్- 16)

ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల పేర్కొనబడిన 'పునరుక్తి' (పునరుత్థానం) లేక మానవునికి ఇవ్వబడే రెండవ జీవితం ప్రళయదినాన ఇవ్వబడుతుంది.

يَوْمَ نَطْوِي السَّمَاءَ كَطَيِّ السِّجِلِّ لِلْكُتُبِ ۚ كَمَا بَدَأْنَا أَوَّلَ خَلْقٍ نُّعِيدُهُ

"ఆ రోజున మేము ఆకాశాన్ని చిట్టా కాగితాలను చుట్టే విధంగా చుట్టి పడేస్తాము. మేము మొదట్లో సృష్టిని చేసినట్లే మళ్ళీ దానిని చేస్తాము."
(అల్ అంబియా- 104)

దైవతిరస్కారులు దీన్నే అసంభవమని భావించేవారు.

قَالَ مَن يُحْيِي الْعِظَامَ وَهِيَ رَمِيمٌ ۝ قُلْ يُحْيِيهَا الَّذِي أَنشَأَهَا أَوَّلَ مَرَّةٍ

"శిథిలమైపోయిన ఈ ఎముకలకు తిరిగి ఎవరు జీవం పోస్తారు? అని వాదిస్తాడు. అతడికి ఇలా చెప్పు: మొదట వాటిని సృష్టించినవాడే మళ్ళీ వాటికి జీవం పోస్తాడు"
(యాసీన్- 78, 79)

ఈక్రింది ఆయతులో ఈ విషయం ఇంకా వివరంగా పేర్కొనటం జరిగింది.

قُلْ كُونُوا حِجَارَةً أَوْ حَدِيدًا

"వారితో ఇలా అను: 'మీరు రాయిగా గాని, ఇనుముగా గాని మారిపోయినా

اَوْ خَلْقًا مِّمَّا يَكْبُرُ فِيْ صُدُوْرِكُمْ
فَسَيَقُوْلُوْنَ مَنْ يُّعِيْدُنَا قُلِ الَّذِيْ
فَطَرَكُمْ اَوَّلَ مَرَّةٍ فَسَيُنْغِضُوْنَ
اِلَيْكَ رُءُوْسَهُمْ وَيَقُوْلُوْنَ
مَتٰى هُوَ قُلْ عَسٰى اَنْ يَّكُوْنَ
قَرِيْبًا يَوْمَ يَدْعُوْكُمْ
فَتَسْتَجِيْبُوْنَ بِحَمْدِهٖ وَ
تَظُنُّوْنَ اِنْ لَّبِثْتُمْ اِلَّا
قَلِيْلًا

లేదా తిరిగి బ్రతికింపబడి లేపటానికి అసాధ్యమైనదని భావిస్తున్నటువంటి వాటికంటే కూడా ఎక్కువ కఠినమైన టువంటి వస్తువుగా మారిపోయినాసరే (మీరు లేచి తీరుతారు)' వారు తప్ప కుండా ఇలా అడుగుతారు. 'మమ్మల్ని మళ్ళీ బ్రతికించి లేపగల వాడు ఎవడు?' సమాధానంగా ఇలా అను: 'మిమ్మల్ని మొదటిసారి పుట్టించినవాడే'. వారు తలలు ఊపుతూ, 'సరే ఇది ఎప్పుడు జరుగు తుంది? అని అడుగుతారు. నీవు ఇలా చెప్పు. 'ఆ సమయం దగ్గరలోనే ఉందన్నా ఆశ్చర్యపడనక్కర్లేదు. ఆనాడు ఆయన మిమ్మల్ని పిలు స్తాడు. మీరు ఆయనను స్తుతిస్తూ ఆయన పిలుపునకు సమాధానంగా బయటకు వస్తారు.' అప్పుడు మీరు 'మేము కేవలం కొంతసేపు మాత్రమే ఈ స్థితిలో పడిఉన్నాము' అని అను కుంటారు. (బనీ ఇస్రాయీల్- 50,52)

ఏ దినమైతే మీరు పిలువబడతారో, ఆ పిలుపును మీరు శిరసా వహిస్తారు. ఇంకా ఏ దినమైతే ఉండదని మీరు అనుమానపడుతున్నారో, ఆ దినం తప్పకుండా ఉంటుంది. అదే ప్రళయదినం.

"పిలిచేవాడు దుర్భరమైన, భయం కరమైన ఒక విషయం వైపునకు పిలిచేరోజున, ప్రజలు బిక్కచచ్చిన చూపులతో తమ సమాధులనుండి, చెల్లాచెదురై పోయిన మిడుతల మాదిరిగా బయల్పడుతారు."

(అల్ ఖమర్- 7)

يَوْمَ يَدْعُ الدَّاعِ إِلَىٰ شَيْءٍ نُّكُرٍ خُشَّعًا أَبْصَارُهُمْ يَخْرُجُونَ مِنَ الْأَجْدَاثِ كَأَنَّهُمْ جَرَادٌ مُّنتَشِرٌ

"అల్లాహ్ వారిని సమావేశపరిచే రోజున (ఇహలోక జీవితం వారికి ఎలా అనిపిస్తుందంటే, వారు కేవలం ఒక గడియ కాలం వరకు ఒకరినొకరు గుర్తుపట్టటానికి మాత్రమే ఆగారా అన్నట్లు."

(యూనుస్- 45)

وَيَوْمَ يَحْشُرُهُمْ كَأَن لَّمْ يَلْبَثُوا إِلَّا سَاعَةً مِّنَ النَّهَارِ

అందుకని మానవునికి లభించబోయే రెండవ జీవితం ప్రళయం రోజున లభిస్తుందేకాని సమాధిలో కాదు అనేది సుస్పష్టమైంది. ఈ ప్రపంచ జీవితం సమాప్తమైన తరువాత, 'బర్‌జఖ్' లో ఉంటున్న వారిలో జీవనానికి సంబంధించి ఎలాంటి చిహ్నాలు, సూచనలుండవు. కాలం అనేది అనుభవిస్తున్న వానికే తెలుస్తుంది. బర్‌జఖ్‌లో ఉంటున్న వారిలో గ్రాహ్య శక్తి, తెలివి, ఎరుక లాంటి ఏ విషయం ఉండదు. కనుక వారికి కాలం కూడా తెలియదు. అందుకనే ప్రళయం రోజు వారిని ఎప్పుడైతే తిరిగి లేపటం జరుగుతుందో, ఆ సమయంలో వారు, తామిప్పుడిప్పుడే మృతి చెందినట్లు భావిస్తారు. మృత్యువు తరువాత ఎంతోకాలం గడిచినట్లు వారికసలు తెలియదు. అందుకే వారిలా అంటారు.

"భయాందోళనలతో వారు 'అరే, మనల్ని మన పడకల నుండి లేపి ఎవరు నిలబెట్టారు?' అని అంటారు. (యాసీన్- 52)

يَا وَيْلَنَا مَنْ بَعَثَنَا مِنْ مَّرْقَدِنَا

అంటే ప్రళయం సంభవించినప్పుడు వారు తాము మరణించే ముందు ఏ ప్రదేశంలోనైతే ఉన్నారో, అక్కడ్నే ఉన్నట్లు భావిస్తారు. వారికి తాము పాతిపెట్టబడినట్లుగాని, కాలబెట్ట బడినట్లుగాని తెలియనే తెలియదు. సామాన్యంగా ఉర్దూ కవులు వాడుతున్నట్లు 'మర్ఖద్' అనే పదానికిక్కడ అర్థం సమాధికాదు. పరుండే పరుపు. ఎందుకంటే, 'రఖాద్' కు సరియైన అర్థం నిదుర. ఖుర్‌ఆన్‌లో కహఫ్ సూరాలోని గుహవాసుల కథలో ఈ పదం వచ్చింది.

"వారిని నీవు చూచి, వారు మేల్కొనే ఉన్నారని అనుకుంటావు. వాస్తవానికి వారు నిద్రపోతున్నారు." (అల్ కహఫ్- 18)

وَتَحْسَبُهُمْ أَيْقَاظًا وَّهُمْ رُقُودٌ

క్లుప్తంగా చెప్పబోయేదేమంటే ఖుర్‌ఆన్‌లోని స్పష్టమైన ఆయతుల ద్వారా తేటతెల్లమైనదేమంటే మరణం మరియు ప్రళయం మధ్యకాలం అనగా, బర్‌జఖ్ గురించి మృతులకు అవగాహనే ఉండదు. వారీస్థితిలో ఉండి ఎంతకాలం గడిపారో, తెలియనే తెలియదు. ఇక ప్రళయం సంభవించినప్పుడు, అది తాము మరణించినప్పటి కాలంగానే, ఇప్పుడిప్పుడే తాము మరణించినట్లుగానే వారు భావిస్తుంటారు. ఇంకొక ఆయతులో 'బర్‌జఖ్' వ్యవధిని ఒక క్షణంగా పేర్కొనటం జరిగింది.

"అల్లాహ్ వారిని సమావేశపరిచిన రోజున (ఇహలోక జీవితం వారికి ఎలా అనిపిస్తుందంటే) వారు

وَيَوْمَ يَحْشُرُهُمْ كَأَن لَّمْ يَلْبَثُوا إِلَّا سَاعَةً مِّنَ النَّهَارِ

يَتَعَارَفُونَ بَيْنَهُمْ

కేవలం ఒక గడియకాలం వరకు ఒకరి నొకరు గుర్తుపట్టటానికి మాత్రమే ఆగారా అన్నట్లు."
(యూనుస్- 45)

كَأَنَّهُمْ يَوْمَ يَرَوْنَ مَا يُوعَدُونَ لَمْ يَلْبَثُوا إِلَّا سَاعَةً مِّن نَّهَارٍ

"దేనిని గురించి వారిని ఇప్పుడు భయపెట్టటం జరుగుతుందో, దానిని వారు చూసినరోజున, వారికి ప్రపంచంలో దినంలోని ఒక గడియకంటే ఎక్కువ కాలం ఉండలేదు అనిపిస్తుంది." (అల్ అహ్ఖాఫ్- 35)

వారు ఇలా భావించటానికి కారణం ఏమిటి? కేవలం పరిస్థితి మారటం వల్ల! మరణించింది మాత్రమే వారికి తెలిసుంటుంది. ఆ తరువాత వెంటనే లేపబడ్డామని భ్రమపడతారు. ఈ ఆయత్, అరే, మనల్ని పడకల నుండి లేపి ఎవరు నిలబెట్టారు అనే వాక్యం ద్వారా ఇది నిరూపితమైంది. పై ఆయతులో 'కఅన్న' అనే పదం పోలిక కోసం ఉపయోగించబడింది. వారి దృష్టికోణంతో, వారి ఆలోచన ప్రకారం బహుశా 'బర్జఖ్'లో తాము ఒక్క క్షణం గడిపామేమోనని భావిస్తారు. వారి పరిస్థితి మారిపోవటం వల్ల వారు ఈ అపోహకు గురవుతారు.

'బర్జఖ్'లో నేరస్తులు (తిరస్కారులు) రాత్రింబవళ్ళు శిక్ష అనుభవిస్తుంటారని, అగ్నిలో కాలుతుంటారని, నరకయాతనలు అనుభవించే ఈ కాలం కోటానుకోట్ల సంవత్సరాల పర్యంతం ఉంటుందనేది కొందరి భావన. అలాంటి వారు దీన్ని గమనించాలి.

وَيَوْمَ تَقُومُ السَّاعَةُ يُقْسِمُ الْمُجْرِمُونَ مَا لَبِثُوا غَيْرَ

"ఆ గడియ (ప్రళయం) సంభవించినప్పుడు, నేరస్తులు ప్రమాణాలు చేసి, మేము ఒక గంటసేపుకంటే ఎక్కువ

سَاعَةٍ كَذَٰلِكَ كَانُوا يُؤْفَكُونَ
وَقَالَ الَّذِينَ أُوتُوا الْعِلْمَ وَ
الْإِيمَانَ لَقَدْ لَبِثْتُمْ فِي كِتَابِ
اللَّهِ إِلَىٰ يَوْمِ الْبَعْثِ فَهَٰذَا
يَوْمُ الْبَعْثِ وَلَٰكِنَّكُمْ كُنتُمْ
لَا تَعْلَمُونَ ۝

కాలం ఉండలేదు అని అంటారు. ఈవిధంగానే వారు ప్రపంచ జీవితంలో మోసపోతూ ఉండేవారు. కాని జ్ఞానమూ, విశ్వాసమూ అనుగ్రహింపడినవారు ఇలా అంటారు. 'దైవ లేఖనం ప్రకారం మీరు ప్రళయదినం వరకు పడి ఉన్నారు. కనుక ఇదే ఆ ప్రళయదినం, కాని మీకు తెలియదు." (అర్‌రూమ్- 56)

నేరస్తులు తాము ఒక్క గడియకు మించి (బర్‌జఖ్‌లో) లేమని ప్రళయం రోజు ప్రమాణంచేసి చెబుతారు. అయితే జ్ఞానం, విశ్వాసం గలవారు 'మీరు దైవలిఖితాన్ని అనుసరించి, ప్రళయం వరకు ఉన్నారని, అయితే ఈ విషయం మీరేరుగరు' అని చెబుతారు. కాలం (సమయం) గురించి వారికి ధ్యాసే ఉండదనే దానికి పైవివరాలు దృష్టాంతాలు. పై ఆయతులలో మేము చూపించినట్లు, విశ్వాసులకు సైతం ఈ కాలానికి సంబంధించిన జ్ఞానం ఉండదు. కాని తిరిగి పుట్టించబడడంపై వారికి విశ్వాసముండటం వలన, వారు ప్రళయదినాన్ని గుర్తుపట్టగలుగుతారు. అందుకనే 'బరజఖ్‌కు సంబంధించిన ఓ సుదీర్ఘకాలం మీపై గడిచింది. కాని దీని గురించి మీకు తెలియదని' వారికి సమాధానమిస్తారు.

ఈ చర్చ అంతా కూడా మేము కేవలం 'ఆత్మ' గురించే చేస్తున్నామనే విషయం మరువరాదు. ఎందుకంటే మానవ శరీరం కుళ్ళి, కృషించి, నశించి, పంచభూతాల్లో కలిసిపోతుంది. బర్‌జఖ్ లోకంలో 'ఆత్మ' జీవనానికి సంబంధించి ఖుర్‌ఆన్‌లో వివరించిన విషయం ఏమిటంటే దీని జ్ఞానం దైవలిఖితంలో ఉంది. పై ఆయతులో విశ్వాసుల సమాధానం ద్వారా ఇది రూఢి అవుతుంది.

قَالَ فَمَا بَالُ الْقُرُونِ الْأُولَىٰ قَالَ عِلْمُهَا عِندَ رَبِّي فِي كِتَابٍ

"అప్పుడు ఫిర్ఔను 'అయితే పూర్వం గతించిన తరాలవారి స్థితి ఏమిటి? అన్నాడు. మూసా 'దానికి సంబంధించిన జ్ఞానం నా ప్రభువు వద్ద ఒక గ్రంథంలో సురక్షితంగా ఉంది' అని చెప్పారు." (తాహా- 52)

దీని వివరణ పారాయె అమ్మలో ఇలా వచ్చింది.

إِنَّ كِتَابَ الْفُجَّارِ لَفِي سِجِّينٍ وَمَا أَدْرَاكَ مَا سِجِّينٌ كِتَابٌ مَّرْقُومٌ

"నిశ్చయంగా దుర్జనుల కర్మల పత్రం చెరసాల గ్రంథంలో ఉంటుంది. చెరసాల గ్రంథం అంటే ఏమిటో నీకు తెలుసా? అదొక వ్రాయబడిన గ్రంథం. (అల్ ముతఫ్ఫిఫ్ఫీన్- 7,8)

إِنَّ كِتَابَ الْأَبْرَارِ لَفِي عِلِّيِّينَ وَمَا أَدْرَاكَ مَا عِلِّيُّونَ كِتَابٌ مَّرْقُومٌ

"ఉన్నతస్థాయి వ్యక్తులకు సంబంధించిన గ్రంథం అంటే ఏమిటో నీకు తెలుసా? అదొక వ్రాయబడిన గ్రంథం." (అల్ ముతఫ్ఫిఫీన్- 18, 20)

ఈ విషయాన్నే గడిచిన ఆయతులలో 'లబిస- కితాబిల్లాహ్' అని పిలవటం జరిగింది. అనగా 'బర్జఖ్‌లో గడిపిన వ్యవధి'. రెండవ పదం 'లబిస ఫిల్ అర్జ్' అనగా 'భూమిపై గడిపిన వ్యవధి'. అంటే ప్రపంచ జీవితం. దీనిగురించి కూడా ప్రళయం రోజు ప్రశ్నించటం జరుగుతుంది. ఈ విషయంలో ప్రజలు ఒక గడియ అని, కాదు ఒక రోజు అని సమాధానమిస్తారు.

قَالَ كَمْ لَبِثْتُمْ فِي الْأَرْضِ

"అల్లాహ్ వారిని ఇలా అడుగుతాడు: 'చెప్పండి, భూలోకంలో మీరు ఎన్ని

عَدَدَ سِنِيْنَ قَالُوا لَبِثْنَا يَوْمًا اَوْ بَعْضَ يَوْمٍ فَاسْئَلِ الْعَادِّيْنَ ٥

సంవత్సరాలున్నారు?' వారు, 'మేము ఒకరోజు లేక (ఒక)రోజులో కొంత భాగమే అక్కడ ఉన్నాము. లెక్క పెట్టే వారిని అడగండి."

(అల్ మోమినూన్-112)

ఇంకొక ఆయతులో పదిరోజులని కూడా పేర్కొనటం జరిగింది.

يَتَخَافَتُوْنَ بَيْنَهُمْ اِنْ لَّبِثْتُمْ اِلَّا عَشْرًا نَحْنُ اَعْلَمُ بِمَا يَقُوْلُوْنَ اِذْ يَقُوْلُ اَمْثَلُهُمْ طَرِيْقَةً اِنْ لَّبِثْتُمْ اِلَّا يَوْمًا

'ప్రపంచంలో మహా అయితే మీరు పదిరోజులు గడిపారేమో' అని పరస్పరం గుసగుసలాడుకుంటారు. వారు మాట్లాడుకుంటూ ఉండేది ఏమిటో మాకు బాగా తెలుసు. (ఇది కూడా మాకు తెలుసు) అప్పుడు వారిలో అతిజాగ్రత్తగా అంచనా వేసేవాడు సైతం 'కాదు, ప్రపంచంలో మీ జీవితం కేవలం ఒకరోజు జీవితం మాత్రమే అని అంటాడు.

(తాహా- 103)

పై వివరణల తరువాత, ఖుర్ఆన్ ద్వారా స్పష్టంగా నిరూపితమైన దృష్ట్యా, ఈ క్రింది ఫలితాలను అంగీకరించాల్సి ఉంది.

1. బర్జఖ్ లోకం సంపూర్ణంగా మృత్యులోకం, అందుకని అక్కడి మృత్యులకు ఎలాంటి జ్ఞానంగాని, ఎరుకగాని, అవగాహనగాని, వినటం గాని, ఇంకా జీవనానికి సంబంధమున్న ఏ చిహ్నామూ, ఆనవాలూ ఉండవు.

2. మానవునికి రెండే జీవితాలు, మరింకా రెండే మరణాలున్నాయి. ఆ రెండు జీవితాల్లో మొదటిది, ఈ ప్రపంచంలో లభించింది. రెండవది ప్రళయం రోజు లభించబోయేది. బర్జఖ్లో ఎలాంటి జీవితం లేదు.

3. బర్‌జఖ్‌లో ఉంటున్నవారికి కాలం గురించిన జ్ఞానం అసలే లేదు. అందుకని చనిపోయేవానికి చచ్చినరోజు, ఆ తరువాత ప్రళయం రోజు మాత్రమే తెలుసు. ఈ వివరాల ద్వారా బర్‌జఖ్‌లో శిక్షగాని, పుణ్యఫలం గురించి గాని ఆలోచించే ఆస్కారమే లేదు. అందుకని ఖుర్ఆన్‌లో పాప, పుణ్యాల గురించి వచ్చిందంతా ఈ ప్రపంచంలోనో లేక ప్రళయానంతరం పరలోకం లోనో సంభవించేది మాత్రమే. బర్‌జఖ్ పేరు కూడా అందులో ఉచ్చరించ బడలేదు.

"ఇటువంటి సజ్జనులకు ఈ ప్రపంచంలోనూ మేలు జరుగుతుంది. ఇక పరలోక గృహం కూడా తప్పనిసరిగా వారికి ఎంతో మేలైనదిగా ఉంటుంది" (అన్‌నహ్ల్- 30)

لِلَّذِيْنَ اَحْسَنُوْا فِيْ هٰذِهِ
الدُّنْيَا حَسَنَةٌ ۚ وَلَدَارُ الْاٰخِرَةِ
خَيْرٌ ۚ

"దౌర్జన్యాన్ని అనుభవించిన తరువాత అల్లాహ్ కోసం వలసపోయిన వారికి మేము ప్రపంచంలో తప్పకుండా మంచి నివాసాన్ని ఇస్తాము. పరలోక ప్రతిఫలమైతే ఇంతకంటే గొప్పగా ఉంటుంది." (అన్‌నహ్ల్- 41)

وَالَّذِيْنَ هَاجَرُوْا فِي اللّٰهِ
مِنْ بَعْدِ مَا ظُلِمُوْا لَنُبَوِّئَنَّهُمْ
فِي الدُّنْيَا حَسَنَةً ۚ وَلَاَجْرُ
الْاٰخِرَةِ اَكْبَرُ ۘ

"ప్రజలలో ఒకడు 'విశ్వాసం' అంచులపై నిలబడి అల్లాహ్‌కు దాస్యం చేసేవాడు ఉన్నాడు, ఒకవేళ లాభం కలిగితే తృప్తి పొందుతాడు, కాని ఏదైనా ఆపద సంభవిస్తే విముఖుడవుతాడు. ఇతనికి ఇహమూ దక్కదు, పరమూ దక్కదు." (అల్ హజ్- 11)

وَمِنَ النَّاسِ مَنْ يَّعْبُدُ
اللّٰهَ عَلٰى حَرْفٍ ۚ فَاِنْ اَصَابَهٗ خَيْرُ
ۨ اطْمَاَنَّ بِهٖ ۚ وَاِنْ اَصَابَتْهُ فِتْنَةُ
ۨ انْقَلَبَ عَلٰى وَجْهِهٖ ۚ خَسِرَ
الدُّنْيَا وَالْاٰخِرَةَ

وَمِنَ النَّاسِ مَنْ يُّجَادِلُ
فِى اللّٰهِ بِغَيْرِ عِلْمٍ وَّلَا هُدًى
وَّلَا كِتٰبٍ مُّنِيْرٍ ثَانِىَ عِطْفِهٖ
لِيُضِلَّ عَنْ سَبِيْلِ اللّٰهِ لَهٗ
فِى الدُّنْيَا خِزْىٌ وَّنُذِيْقُهٗ
يَوْمَ الْقِيٰمَةِ عَذَابَ
الْحَرِيْقِ ۝

"మానవులలో ఇంకా కొందరు ఏ జ్ఞానమూ లేకపోయినా, ఏ మార్గదర్శకత్వమూ లేకపోయినా, జ్యోతిని ప్రసాదించే ఏ గ్రంథమూ లేకుండానే, తలబిరుసుతనంతో అల్లాహ్‌ను గురించి తగవులాడుతారు. తద్వారా వారు ప్రజలను అల్లాహ్ మార్గం నుండి తప్పింపజూస్తారు. అటువంటి వ్యక్తి ప్రపంచంలో అవమానం పాలవుతాడు, ప్రళయం నాడు మేమతనికి అగ్ని బాధను రుచి చూపిస్తాము." (అల్ హజ్- 8,9)

اَفَتُؤْمِنُوْنَ بِبَعْضِ الْكِتٰبِ
وَتَكْفُرُوْنَ بِبَعْضٍ فَمَا جَزَآءُ
مَنْ يَّفْعَلُ ذٰلِكَ مِنْكُمْ اِلَّا خِزْىٌ
فِى الْحَيٰوةِ الدُّنْيَا وَيَوْمَ الْقِيٰمَةِ
يُرَدُّوْنَ اِلٰٓى اَشَدِّ الْعَذَابِ

"మీరు దైవగ్రంథంలోని ఒక భాగాన్ని విశ్వసించి, మరొక భాగాన్ని తిరస్కరిస్తారా? మీలో ఇలా చేసేవారిని ఇహలోక జీవితంలో ఘోర అవమానానికి, పరలోకంలో తీవ్రమైన బాధకూ గురిచెయ్యటం తప్ప మరొక శిక్ష ఏముంటుంది?" (అల్ బఖర- 85)

وَمَنْ اَظْلَمُ مِمَّنْ مَّنَعَ
مَسٰجِدَ اللّٰهِ اَنْ يُّذْكَرَ فِيْهَا

"అల్లాహ్ ఆరాధనాలయాలలో ఆయన నామసంస్మరణను నిషేధించి, వాటి వినాశనానికి ఒడిగట్టేవానికంటే పరమ దుర్మార్గుడెవడు? అటువంటివారు ఆ ఆరాధనాలయాలలో అడుగు పెట్టడానికి

اسْمُهُ وَسَعَىٰ فِي خَرَابِهَا أُولَٰئِكَ مَا كَانَ لَهُمْ أَن يَدْخُلُوهَا إِلَّا خَائِفِينَ لَهُمْ فِي الدُّنْيَا خِزْيٌ وَلَهُمْ فِي الْآخِرَةِ عَذَابٌ عَظِيمٌ

అర్హు లు కారు. ఒకవేళ వారు వాటిలో ప్రవేశించినా భయపడుతూ ప్రవేశించాలి. కాని వారికి ప్రపంచంలో తీవ్ర పరాభవమూ, పరలోకంలో ఘోరశిక్ష తప్పవు." (అల్ బఖర- 114)

وَمَن يُضْلِلِ اللَّهُ فَمَا لَهُ مِنْ هَادٍ لَهُمْ عَذَابٌ فِي الْحَيَاةِ الدُّنْيَا وَلَعَذَابُ الْآخِرَةِ أَشَقُّ

"అల్లాహ్ మార్గభ్రష్టత్వంలోకి విసిరి వేసిన వాడికి మార్గం చూపే వాడెవడూ లేడు. అటువంటివారికి ప్రాపంచిక జీవితంలోనే శిక్ష పడుతుంది. పరలోక శిక్ష దీనికంటే కూడా ఎంతో కఠినంగా ఉంటుంది."

(అర్ రఅద్- 34)

పై ఆయతులన్నిటిలోనూ వివిధ రకాల నేరస్తులకు ఇవ్వబడే శిక్ష గురించి చర్చించటం జరిగింది. అయితే ఈ శిక్షలు ప్రపంచంలోనో, లేక మరణానంతరమో లభిస్తాయే తప్ప, బర్‌జఖ్‌లో ఎదుర్కొనబోయే శిక్షల గురించి అసలు ప్రస్తావనే లేదు. బర్‌జఖ్‌లో జీవనానికి సంబంధించిన ఎలాంటి ఆనవాలే లేవు. కాలమేమిటో తెలియనే తెలియదు. అందులో జీవితమే లేనప్పుడు శిక్ష లేక బహుమానానికి సంబంధించి దుఃఖంగాని, ఆనందంగాని అనుభవించే ఆస్కారమే లేదు. కొన్ని వ్యక్తిగత మరియు సామూహిక ఆచరణలవల్ల అనివార్యమైన శిక్ష లేక బహుమానాలు, ఈ భువిలో, ఈ జీవితంలో కూడా లభిస్తాయని మాత్రమే తెలుస్తుంది. పై ఆయతులలోను, ఖుర్ఆన్‌లోని ఇతర ఆయతులలోను దీన్ని వివరించటం జరిగింది. ప్రతిఫలం లభించే అసలు చోటు పరలోకమే అనే విషయాన్ని ఖుర్ఆన్ తేటతెల్లంగా వివరించింది.

وَلَوْ يُؤَاخِذُ اللّٰهُ النَّاسَ بِظُلْمِهِمْ مَا تَرَكَ عَلَيْهَا مِنْ دَابَّةٍ وَّلٰكِنْ يُّؤَخِّرُهُمْ إِلٰى أَجَلٍ مُّسَمًّى

"ఒకవేళ అల్లాహ్ ప్రజలను వారి మితిమీరిన ప్రవర్తనకు వెంటనే పట్టుకోదలిస్తే, భూమిపై ఏ ప్రాణినీ వదిలిపెట్టడు. కాని ఆయన అందరికీ ఒక నిర్ణీత కాలం వరకు గడువు ఇస్తాడు." (అన్ నహ్ల్- 61)

"ఒక నిర్ణీత గడువు" లేక "నిర్ణీత దినం" అంటే ఏది? దీన్ని ఖుర్అన్ అనేకచోట్ల విశదీకరించింది.

لِأَيِّ يَوْمٍ أُجِّلَتْ لِيَوْمِ الْفَصْلِ

"ఏ రోజుకై ఈ పనులన్నీ ఆపి ఉంచబడ్డాయి? తీర్పు దినానికై.
(అల్ ముర్సలాత్- 12, 13)

ఈ తీర్పు దినమంటే ప్రళయం రోజు.

وَقَالُوْا يَا وَيْلَنَا هٰذَا يَوْمُ الدِّيْنِ ۝ هٰذَا يَوْمُ الْفَصْلِ الَّذِيْ كُنْتُمْ بِهٖ تُكَذِّبُوْنَ

"అప్పుడు వారు (అవిశ్వాసులు) 'మేమెంత దౌర్భాగ్యులం. ఇది తీర్పు దినం కదా!' అని అంటారు. మీరు తిరస్కరిస్తూ ఉండే తీర్పు దినమే ఇది." (అస్ సాఫ్ఫాత్- 20)

అందుకని పరిశీలించే రోజు, శిక్షా బహుమానాలు ప్రతిపాదించబడే రోజు, ప్రళయం రోజే అనేది సువిదితం. బర్‌జఖ్‌లో ఎంత మాత్రం కాదు. ఉదాహరణకు హజ్రత్ నూహ్ (అలై)ను తిరస్కరించినవాడు ఐదువేల సంవత్సరాల ముందు నుండి బర్‌జఖ్‌లో శిక్ష అనుభవించటం, హజ్రత్ ముహమ్మద్(స)ను తిరస్కరించినవాడు ఐదు లేక పదివేల సంవత్సరాల పిదప శిక్షను ఎదుర్కోవటం న్యాయమనిపిస్తుందా? ఖుర్ఆన్‌ను అనుసరించి వీరిద్దరి కోసం తీర్పుదినం ఒక్కటే. ఆ రోజే వీరి కర్మల చిట్టా విప్పబడు

తుంది. దాని పరిశీలన తరువాత, శిక్షో, బహుమానమో ఇవ్వబడు తుంది. బర్జఖ్ కాలానికి సంబంధించి, ఈ ఇద్దరికీ ఎలాంటి విషయ జ్ఞాన ముండదు.

ఖుర్ఆన్‌లోని కొన్ని ఆయతులను అర్థం చేసుకోవటంలో పొరపడ్డం వల్ల, కొందరు బర్జఖ్ శిక్షగా భావించిన ఆయతులను ఉదహరిస్తారు.

"వారి పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ 'మీకు శాంతి కలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి' అని అంటారు."

الَّذِينَ تَتَوَفّٰهُمُ الْمَلٰٓئِكَةُ طَيِّبِينَ يَقُولُونَ سَلٰمٌ عَلَيْكُمُ ادْخُلُوا الْجَنَّةَ بِمَا كُنْتُمْ تَعْمَلُونَ ٥

(అన్ నహ్ల్- 32)

బర్జఖ్‌లో లభించే పుణ్యఫలానికి సాక్ష్యంగా, నా వాదనకు జవాబుగా, అమృత్‌సర్ నుండి వెలువడే పత్రిక "అహ్లెహదీస్" సంపాదకులు మౌల్వీ అబుల్ వఫా సనావుల్లాగారు పై ఆయతును చూపించారు. ఈయనగారు ఖుర్ఆన్‌కు రెండు వ్యాఖ్యానాలు కూడా వ్రాశారు. కాని ఈ ఆయతు ప్రత్యేకంగా పరలోకానికి సంబంధించిందేనని, బర్జఖ్‌తో దీనికి ఎలాంటి పొంతన లేదనే విషయాన్ని ఆయనగారు గమనించలేకపోయారు. ఖుర్ఆన్ ఇతివృత్తం ఇలా సాగుతున్నది.

"ఇక పరలోక గృహం కూడా తప్పనిసరిగా వారికి ఎంతో మేలైనదిగా ఉంటుంది. భయభక్తులు కలవారి ఇల్లు ఎంతో మంచి ఇల్లు. శాశ్వత నివాసంగా ఉండే ఉద్యానవనాలు- వాటిలో వారు ప్రవేశిస్తారు. క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి.

وَلَدَارُ الْاٰخِرَةِ خَيْرٌ وَلَنِعْمَ دَارُ الْمُتَّقِينَ ٥ جَنّٰتُ عَدْنٍ يَّدْخُلُونَهَا تَجْرِي مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ لَهُمْ فِيهَا مَا يَشَاءُونَ كَذٰلِكَ يَجْزِي اللّٰهُ الْمُتَّقِينَ ٥

اَلَّذِيْنَ تَتَوَفّٰهُمُ الْمَلٰٓئِكَةُ طَيِّبِيْنَ يَقُوْلُوْنَ سَلٰمٌ عَلَيْكُمُ ادْخُلُوا الْجَنَّةَ بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ٥

అక్కడ అంతా వారి అభిమతానికి అనుగుణంగానే జరుగుతుంది. భయభక్తులు కలవారికి అల్లాహ్ ఇటువంటి ప్రతిఫలాన్ని ఇస్తాడు. వారు పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ "మీకు శాంతి కలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి" అని అంటారు."

(అన్ నహ్ల్- 32)

ఇక బర్జఖ్అని అపోహపడటానికి దోహదపడిన రెండవ ఆయతు ఇలా ఉంది.

وَحَاقَ بِاٰلِ فِرْعَوْنَ سُوْٓءُ الْعَذَابِ اَلنَّارُ يُعْرَضُوْنَ عَلَيْهَا غُدُوًّا وَّعَشِيًّا وَّيَوْمَ تَقُوْمُ السَّاعَةُ اَدْخِلُوْٓا اٰلَ فِرْعَوْنَ اَشَدَّ الْعَذَابِ

"ఫిర్ఔన్ అనుచరులే ఒక భయంకరమైన శిక్షలో చిక్కుకున్నారు. వారు ఉదయం సాయంత్రం నరకాగ్ని ముందు ఉంచబడుతూ ఉంటారు. ప్రళయ గడియ వచ్చినప్పుడు, 'ఫిర్ఔన్ ప్రజలను తీవ్రమైన శిక్షలోకి ప్రవేశింపజెయ్యండి' అని ఆజ్ఞాపించబడుతుంది." (అల్ మోమిన్- 46)

పిర్ఔను, అతని అనుచరగణం నీటిలో మునిగి చనిపోయిన ప్రతి రోజు ఉదయం సాయంత్రం అగ్ని శిక్షకు గురిచేయబడతారని, ఇదే బర్జఖ్ శిక్ష అని, ఇక ప్రళయం రోజు, వీరిని కఠినాతి కఠినమైన శిక్షకు గురిచేయండని, దైవదూతల్ని ఆజ్ఞాపించటం జరుగుతుందని పై ఆయతు ద్వారా అర్థం చేసుకోవటం జరిగింది.

ఇంతకు క్రితం మేము సూచించిన 'ఖుర్ఆన్ ఆయతులన్నింటిలో వచ్చిన భావనకు, అంటే ఖుర్ఆన్ బోధనలకు ఇది విరుద్ధం. ఒకవేళ బర్జఖ్ లో ఫిర్ఔను, అతని అనుచరగణం ప్రతిరోజు ఉదయం సాయంకాలం అగ్ని శిక్షకు గురిచేయబడుతున్నారంటే, వారిలో జీవనానికి సంబంధించిన అంశాలు అనగా గ్రాహ్యశక్తి, విషయజ్ఞానం, సుఖదుఃఖాలతో ప్రభావిత మవటంలాంటి జీవిత చిహ్నాలుండాలి. కాని ఖుర్ఆన్ దీన్ని సవివరంగా ఖండిస్తున్నది. అంతేకాక ఖుర్ఆన్ బోధనల్లో వైరుధ్యం ఉండదు. కనుక 'యూరజూన్' అనే పదాన్ని అర్థం చేసుకోవటంలో పొరబడటం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. దీన్ని 'వర్తమానం'లో తీసుకోవడం జరిగింది. అంటే వారు అగ్నిశిక్షకు గురిచేయబడుతున్నారు అని, వాస్తవంలో ఇక్కడ దీని అర్థం భవిష్యత్తులో, రాబోయే కాలంలో సంభవించే పరిస్థితిని తెలుపటం జరిగింది. ఫిర్ఔన్ అనుచరగణం ఇంకా ఇతర దైవతిరస్కారులందరూ ప్రళయంరోజునే ఈ అగ్ని శిక్షకు గురిచేయ బడతారు.

وَيَوْمَ يُعْرَضُ الَّذِيْنَ
كَفَرُوْا عَلَى النَّارِ اَذْهَبْتُمْ
طَيِّبٰتِكُمْ فِيْ حَيٰوتِكُمُ الدُّنْيَا

తరువాత- ఈ అవిశ్వాసులను అగ్ని ముందు తీసుకువచ్చి నిలబెట్టి నప్పుడు, వారితో ఇలా అనటం జరుగుతుంది; మీరు మీ వంతు సుఖాలను మీ ప్రాపంచిక జీవితంలో పొందారు. వాటి ద్వారా ఆనందాన్ని మీరు అక్కడే అనుభవించారు."

(అల్ అహ్ఖాఫ్- 20)

పై ఆయతు ద్వారా అగ్నికి గురిచేయటమనేది రెండవ జీవితంలో, అంటే ప్రళయం రోజు లభించే జీవితంలోనే అనేది స్పష్టమయిపోయింది. ఇంకా హూద్ సూరాలో ఫిర్ఔన్ పరిస్థితి ఇలా వివరించడం జరిగింది.

يَقْدُمُ قَوْمَهُ يَوْمَ الْقِيٰمَةِ فَأَوْرَدَهُمُ النَّارَ ۔

"ప్రళయం నాడు అతడు తన జాతి వారికి ముందు నడుస్తాడు. తన నాయకత్వంలో వారిని నరకం వైపు నకు తీసుకుపోతాడు." (హూద్- 98)

బర్‌జఖ్‌లో కాలమనేది లేదని, ఉదయం సాయంకాలాల ప్రసక్తే లేదని మేమింతకు ముందే రుజువు పర్చాము. ఈ ఆయతు అనగా "గదువ్వన్ వ్వఅషియ్యా" అనే పదం ఉపయోగించటం జరిగింది. స్వర్గం కోసం "బుక్‌రతన్ వ్వ అషియ్యా" అనే పదం ఉపయోగించినట్లే ఇక్కడ ఆ పదం వాడబడింది. దీన్ని వ్యాఖ్యానకర్తలు, నిఘంటుకర్తలు 'శాశ్వతం' అనే అర్థాన్నే ఇచ్చారు.

وَلَهُمْ رِزْقُهُمْ فِيهَا بُكْرَةً وَعَشِيًّا ۔

"వారి ఆహారం వారికి ఉదయం, సాయంత్రం నియమం తప్పకుండా లభిస్తూ ఉంటుంది."

(మర్‌యమ్- 62)

ఉదయ, సాయంకాలాలు స్వర్గంలో ఎలా ఉంటాయో, నరకం లోను అలాగే ఉంటాయి. దాన్ని మీరు శాశ్వితం అనే అర్థంలో తీసుకోండి, లేక ఇంకేదైనా సరే. ఇక ఈ ఆయతులోని రెండవ భాగం, మొదటి భాగాన్ని విపులీకరిస్తుంది. అంటే ఫిర్‌ఔను అనుచరగణానికి, శాశ్వత అగ్ని శిక్షలో పడేయటం ఎలా జరుగుతుందంటే, వారిని కఠినశిక్షకు గురిచేయండని దైవదూతలకు ఆదేశమివ్వబడుతుంది.

وَأَتْبَعْنَاهُمْ فِي هٰذِهِ الدُّنْيَا لَعْنَةً وَيَوْمَ الْقِيَامَةِ هُمْ مِنَ الْمَقْبُوحِينَ

మేము ఈ ప్రపంచంలో, అభిశాపం వారిని (ఫిర్‌ఔను జాతివారిని) వెంటాడేలా చేశాము. ప్రళయం నాడు వారు ఘోరదురవస్థలకు గురి అవుతారు. (అల్ ఖసస్- 42)

ఇహంలో వారిని దూషించటం జరిగింది, పరలోకంలో శిక్షింప బడతారని వివరించటం జరిగిందే తప్ప 'బర్‌జఖ్' పేరెత్తటం జరుగులేదు.

ఖుర్‌ఆన్‌లో ప్రతిచోట మరణం తరువాత, శిక్ష పుణ్యఫలం అని దేన్నైతే సూచించటం జరిగిందో, అది ప్రళయం తరువాత విషయమే. బర్‌జఖ్‌కు సంబంధించింది ఎంతమాత్రం కాదు, మరణించినవారికి సంబంధించినంతవరకు, మరణం తరువాత ప్రళయం వరకు వారికి ఎలాంటి అవగాహన ఉండదు. కాలమెలా నడుస్తున్నదనే జ్ఞానమే వారికుండదు. ప్రజలదృష్టి ఈ అంశం మీద పడనేలేదు కనుక వారు సామాన్య విశ్వాసాలను అనుసరించి, ఈ శిక్షల్ని, పుణ్యఫలాన్ని మరణానంతరం 'బర్‌జఖ్'లో లభించేవిగా భావించారు.

ఫిర్‌ఔను అనుచరగణానికి పట్టిన గతే, ప్రళయం రోజునే నూహ్ (అలై) జాతివారికీ పడుతుంది. అంటే అగ్నికి ఆహుతి చేయబడతారు.

أُغْرِقُوا فَأُدْخِلُوا نَارًا

"వారు (తమ పాపాల మూలంగానే) ముంచబడ్డారు, నరకాగ్నిలోకి తోసివేయబడ్డారు." (నూహ్- 25)

దివ్యఖుర్‌ఆన్‌లోని ఇబ్రాహీం సూరాలో నూహ్, అద్, సమూద్ జాతులను పేర్కొంటూ, వారేవిధంగా దైవప్రవక్తల్ని తిరస్కరించారో, దాని ఫలితంగా వారికేవిధమైన శిక్షలు పడతాయో, ఇలా వివరించటం జరిగింది.

وَخَابَ كُلُّ جَبَّارٍ عَنِيدٍ
مِنْ وَرَائِهِ جَهَنَّمُ وَيُسْقَىٰ مِنْ
مَاءٍ صَدِيدٍ يَتَجَرَّعُهُ وَلَا يَكَادُ

"బలమదాంధుడైన ప్రతి సత్యవిరోధి అవమానం పాలయ్యాడు. దాని తరువాత మున్ముందు అతడికి నరకం ఉంది. అక్కడ అతడికి త్రాగటానికి చీము, నెత్తురు లాంటి

يُسِيغُهُ وَيَأْتِيهِ الْمَوْتُ مِنْ كُلِّ مَكَانٍ وَمَا هُوَ بِمَيِّتٍ

చెడునీరు ఇవ్వబడుతుంది. దానిని అతడు బలవంతంగా గొంతులోకి దించటానికి ప్రయత్నిస్తాడు, అతి కష్టంతో దించగలుగుతాడు, మరణం అతన్ని నలువైపుల నుండి చుట్టుముట్టి ఉంటుంది. కాని అతను మరణించలేడు." (ఇబ్రాహీమ్- 16)

అంటే ప్రళయం రోజు మాత్రమే ముందుకు తీసుకురాబడే నరకంలో, ఈ జాతులన్నీ పడేయబడతాయి. 'వఅరజ్‌నా- జహన్నమ- యౌమయిజిల్ లిల్‌కాఫిరీన్' (ఈరోజే నరకాన్ని మేము మీ ముందుకు తెస్తాము. మరణమంటూ లేని జీవితం ఇదే."

ఖుర్‌ఆన్‌లో స్వర్గంలోని బహుమానాలుగాని లేక నరకంలోని యాతనలుగాని ప్రస్తావనకు వచ్చిన చోటల్లా అవి భూతకాలంగానే వర్ణించబడ్డాయి. దేవునికి సమయమంటూ లేదు, ఇవన్నీ ఆయన ముందున్నాయి. కనుక ఆవిధంగా వర్ణించటం జరిగింది. ఉదాహరణకు ప్రళయం గురించి ఇలా చెప్పబడింది.

وَبَرَزُوا لِلَّهِ جَمِيعًا فَقَالَ الضُّعَفَاءُ لِلَّذِينَ اسْتَكْبَرُوا

"ఈ ప్రజలందరినీ కలిపి అల్లాహ్ ముందు హాజరుపరిచినప్పుడు, వారిలో ప్రపంచంలో బలహీనులుగా ఉన్నవారు, ప్రపంచంలో పెద్ద మనుషులుగా చలామణి అయిన వారితో ఇలా అంటారు."

(ఇబ్రాహీం- 21)

లేదా నరకవాసుల గురించి ఇలా వచ్చింది.

"వారిలో అవిశ్వాసులైన వారికొరకు అగ్నివస్త్రాలు కత్తిరించబడి ఉన్నాయి." (అల్‌హజ్- 19)

فَالَّذِيْنَ كَفَرُوْا قُطِّعَتْ لَهُمْ ثِيَابٌ مِّنْ نَّارٍ

స్వర్గవాసులు ఇలా అనుకుంటారు:

"వారు ఒకరివైపునకొకరు తిరిగి పరిస్థితులను గురించి పరస్పరం అడిగి తెలుసుకుంటారు. వారిలో ఒకడు ఇలా అంటాడు. "ప్రపంచంలో నాకు ఒక మిత్రుడు ఉండేవాడు." (సాఫ్ఫాత్- 51)

فَاَقْبَلَ بَعْضُهُمْ عَلٰى بَعْضٍ يَّتَسَآءَلُوْنَ قَالَ قَآئِلٌ مِّنْهُمْ اِنِّىْ كَانَ لِىْ قَرِيْنٌ

అందుకని నూహ్‌జాతి గురించి 'ఖుత్తియత్ లహుం సియాబ్' వారికోసం అగ్నితో తయారు చేయబడ్డ వస్త్రాలు సిద్ధంగా ఉన్నాయి'లో ఉపయోగింపబడిన భూతకాల వచనం, ప్రళయదినాన్నే సూచిస్తుంది. వేరే ఇతర సందర్భాల్లో పరిశీలన, తీర్పు, శిక్ష లేక బహుమానాలు మొదలైనవన్నీ ప్రళయదినానికి సంబంధించినవేనని విశదీకరించటం జరిగింది. అందుకని భూతకాల వచనంతో వాదన సరియైంది కాదు.

బర్‌జఖ్‌లో ఇవ్వబడే శిక్షగురించి, దృష్టాంతంగా పేర్కొనబడిన మూడవ ఆయతు ఇలా ఉంది.

"ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగితేలుతూ ఉండగా దైవదూతలు తమ హస్తాలను చాచి 'ఇటుతెండి! బయటకు తీయండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అపనిందను మోపి అన్యాయంగా కూసిన కూత

وَلَوْ تَرٰٓى اِذِ الظّٰلِمُوْنَ فِىْ غَمَرٰتِ الْمَوْتِ وَالْمَلٰٓئِكَةُ بَاسِطُوْٓا اَيْدِيْهِمْ اَخْرِجُوْٓا اَنْفُسَكُمُ اَلْيَوْمَ تُجْزَوْنَ عَذَابَ

الْهُونِ بِمَا كُنتُمْ تَقُولُونَ عَلَى
اللَّهِ غَيْرَ الْحَقِّ وَكُنتُمْ عَنْ آيَاتِهِ
تَسْتَكْبِرُونَ وَلَقَدْ جِئْتُمُونَا
فُرَادَىٰ كَمَا خَلَقْنَاكُمْ أَوَّلَ
مَرَّةٍ وَتَرَكْتُم مَّا خَوَّلْنَاكُمْ
وَرَاءَ ظُهُورِكُمْ وَمَا نَرَىٰ مَعَكُمْ
شُفَعَاءَكُمُ الَّذِينَ زَعَمْتُمْ
أَنَّهُمْ فِيكُمْ شُرَكَاءُ

లకూ, ఆయన ఆయతులపట్ల తలబిరుసుతనం ప్రదర్శించినందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది' అని అంటూ ఉండగా ఆ దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుంటుంది! (అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు): "మేము మొదటిసారి మిమ్మల్ని ఒంటరిగా సృష్టించినట్లే ఇప్పుడు ఇదిగో మీరు ఒంటరిగా మా ముందు హాజరయ్యారు. మేము ప్రపంచంలో మీకు ఇచ్చినదంతా, మీరు అక్కడే వదిలి పెట్టి వచ్చారు. ఇప్పుడు మీవెంట మీ పనులు నెరవేరటంలో కొంత పాత్ర ఉందని మీరు భావించిన మీ సిఫారసు దారులను కూడా మేము చూడటం లేదు."

(అల్ అన్ఆమ్- 94)

ఈ ఆయతులో 'అల్‌యౌమ్' (ఈ దినం, ఈ రోజు) అనే పదంతో ఇది 'బర్‌జఖ్' శిక్ష అనుకొని వీరు పొరబడ్డారు. కాని బర్‌జఖ్‌కు కాలమనేది లేదని, మరణం రోజునుండి ప్రళయం రోజు వరకు గల మధ్యకాలం వారికి తెలియనే తెలియదని కనుక మరణంరోజే వారికి ప్రళయం రోజుగా గుర్తించబడుతుందని ఇంతకుముందే నిరూపితమయింది. అందువల్ల 'ఈరోజు' అంటే మరణించిన రోజే, ప్రళయం రోజు అని అర్థం. కావున

ఆయతు 'అవ్వల మఱ్రతిన్' (ఏ విధంగానైతే మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించామో) అనే వాక్యం, ఇది పరలోక జీవితానికి సంబంధించినదేనని వివరిస్తున్నది. ఇంకొకచోట, ఇదే ఆయతు ద్వారా, ప్రళయం గురించి వివరించటం జరిగింది.

وَحَشَرْنَاهُمْ فَلَمْ نُغَادِرْ مِنْهُمْ أَحَدًا وَعُرِضُوا عَلَىٰ رَبِّكَ صَفًّا لَقَدْ جِئْتُمُونَا فُرَادَىٰ كَمَا خَلَقْنَاكُمْ أَوَّلَ مَرَّةٍ

"(ఆది మానవులలో, అంత్య మానవులలో) ఒక్కరూ కూడా మిగిలి పోకుండా మేము మానవులందరినీ చుట్టుముట్టి సమావేశ పరుస్తాము. వారంతా నీ ప్రభువు సాన్నిధ్యంలో వరుసలు, వరుసలుగా ప్రవేశపెట్టబడతారు. ఇదిగో చూడండి. మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించిన స్థితిలోనే మీరు మా వద్దకు వచ్చేశారు కదా!" (అల్ కహఫ్- 48)

ఇందులో వాడబడిన పదాలన్నీ కూడా భూతకాలానికి సంబంధించినవే అయినప్పటికీ ఈ ప్రశ్నోత్తరాలన్నీ ప్రళయదినం నాడు జరిగేవని వివరించబడింది.

'మఆరిఫ్' పత్రిక గౌరవ సంపాదకులు, నా వ్యాసంపై వ్రాసిన సమాధానంలో పై ఆయతును ఉటంకిస్తూ ఇలా వ్రాశారు:

'ఈ ప్రశ్న మృత్యువు సమయంలో అడగబడుతుందని, ప్రళయ దినం పేరెత్తబడలేదని పై ఆయతు విశదీకరిస్తున్నది. ఏవిధంగానైతే ప్రజలు ఒక్కొక్కరుగా పుట్టారో, అదేవిధంగా ఒక్కొక్కరుగా దైవం ముందుకు హాజరయ్యే పరిస్థితి ఇది. ప్రళయం రోజు ప్రజలు గుంపుగా దైవం ముందుకు పోతారు. అందుకని ఏ పరిస్థితి అయితే ఇక్కడ వర్ణించబడిందో, అది మరణ

సమయానికి సంబంధించిందే తప్ప, ప్రళయం రోజుకు సంబంధించింది కాదు.' (రిసాల మఆరిఫ్, ఆజంగడ్, మే 1964, పే. 356)

మఆరిఫ్ సంపాదకులవారి వాదనకు పునాది 'ఫురాదా' (ఒంటరిగా) అనే పదంగా కనబడుతుంది. వారు భావించేదేమంటే ఒక్కొక్కరుగా ప్రజలు 'బర్జఖ్'లోకైతే వెళతారు, ఇక ఒక్కొక్కరుగా కాక గుంపులు, గుంపులుగా వెళ్ళేది ప్రళయం రోజున. అందుకని ఈ పదం ద్వారా అది 'బర్జఖ్' యాతన (శిక్ష) అనేది ధృవపడుతుందని చెప్పుకొచ్చారు. దివ్యఖుర్ఆన్‌లో ప్రళయం రోజు గురించి 'ఫతఅతూన అఫ్వాజా' అంటే "మీరు గుంపులు గుంపులుగా వస్తారు" అనే దానిపై మాత్రమే వారి దృష్టి పడింది. కాని "కుల్లుహుం ఆతీహి యౌమల్ ఖియామతి ఫర్దా"

كُلُّهُمْ اٰتِيْهِ يَوْمَ الْقِيٰمَةِ فَرْدًا

వీరిలో నుండి ప్రతి ఒక్కరూ ప్రళయం రోజు దైవం ముందు ఒంటరిగా వస్తాడు, (మర్యమ్- 96)

అనే ఆయతుపై వారి దృష్టి పడనట్లుంది.

'ఫరాదా' (ఒంటరిగా)అనే పదానికి అర్థం వారి ధనకనక వస్తు వాహనాదులు, సంతానం, అభిమానులు- అనుచరులు లేకుండా వారు ఒంటరిగా వస్తారని భావం. దీన్నే ఇంకా వివరంగా మా పుస్తకం 'తాలీమాతె ఖుర్ఆన్''లో తెలిపాము. ఇక 'అఫ్వాజా' అంటే అందరూ కలిసి వస్తారని అర్థం.

2. బర్‌జఖ్

(మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది)

'బర్‌జఖ్' అనే శీర్షికపై మౌలానా అస్లం జిరాజ్‌పూరిగారు వ్రాసిన సుదీర్ఘ వ్యాసం ప్రచురింపబడింది. ఆయనగారి గ్రంథం 'తాలీమాతె ఖుర్‌ఆన్' లోని 'బర్‌జఖ్' అనే శీర్షికపై నేను ఉద్దేశపూర్వకంగానే ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. 'మఆరిఫ్' పత్రికలో దీనిపై సవివరమైన వ్యాసాలు ప్రచురింపబడటమే దీనికి కారణం. వాటినిచూసి బహుశా మౌలానా అస్లంగారు తమ అభిప్రాయాలను మార్చుకొని ఉంటారేమోనని భావించాను. కాని ఇటీవలె ఆయన వ్రాసిన వ్యాసాన్ని చదివి, మౌలానా గారు తమ అభిప్రాయాన్ని మార్చుకోలేదని తెలిసింది. అంతేకాక, ఖుర్‌ఆన్ అభిమాని, సమర్థకుని, దాని ప్రచారమే ధ్యేయమని 'చెప్పుకొనే' నేను కూడా "మఆరిఫ్"లో మౌలానాగారి దృక్పథాన్ని ఖండిస్తూ వ్రాసిన వారి అభిప్రాయాలతో ఏకీభవించటం ఆయన్ను ఆశ్చర్యచకితుల్ని చేసిందని కూడా ఆయన పేర్కొన్నారు. ఏ అభిప్రాయాలనైతే ఇంతటి బలీయమైన దృష్టాంతాలతో ఖండించటం జరిగిందో, వాటినే మౌలానాగారు ఇంకను పట్టుకొని వేలాడటం పట్ల నాకాశ్చర్యం వేస్తుంది. బర్‌జఖ్ జీవనం, బర్‌జఖ్‌లో లభించే శిక్షా, ప్రతిఫలాన్ని బలపరిచే సర్వవిషయాలు ఇంతకు క్రితమే చర్చించబడ్డాయి. నేనింకేమి చెప్పేది? అయినా అన్నిరకాల ఘాటైన, తీవ్రమైన పదజాలాన్ని ఉపయోగించకుండా ఖుర్‌ఆన్ ఆయతులను అర్థం చేసుకో

వటంలో ఎక్కడెక్కడైతే మౌలానాగారు పొరబడ్డారో వాటిని సాధ్యమైనంత వరకు హృదయరంజకంగా విశ్లేషించటానికి ప్రయత్నిస్తాను. గడిచిన (మఆరిఫ్‌లోని) వ్యాసాల్లో జరిగిన తప్పిదం ఏమిటంటే వాటి శైలిలో తీవ్రత చోటుచేసుకుంది. దాని ఫలితంగా సంభోదితునిలో ఉగ్రత ఏర్పడి సత్యస్వీకరణలో అవరోధం కలిగిస్తుంది.

బర్‌జఖ్‌కు అర్థం

మొట్టమొదట నిఘంటువు క్రమం 'బర్‌జఖ్' అనే పదానికి అర్థం ఏమిటో తెలుసుకుందాం. రెండు వస్తువుల మధ్య ఏ అవరోధమైతే ఉందో, ఈ రెండింటిని పరస్పరం కలువకుండా ఆపేది, లేదా ఈ రెండింటిని పరస్పరం వేరుచేసే దాన్ని అరబీ భాషలో 'బర్‌జఖ్' అంటారు. అది తెర కానివ్వండి, అడ్డంకి కానివ్వండి, కాలం కానివ్వండి, లేక ఇంకేదైనా కానివ్వండి. "బైనహూమా- బర్‌జఖుల్- లాయబ్‌గియాన్' మరియు "జఅలబైనహుమా బర్‌జఖన్ వ్వ హిజ్‌రమ్ మహ్‌జూరా" అనే ఆయతులలో రెండు సముద్రాలను కలువకుండా ఆపేదాన్ని 'బర్‌జఖ్' అనటం జరిగింది. ఒక హదీసులో ఇలా ఉల్లేఖించడం జరిగింది. "ఇన్నహు సల్లా బి ఖౌమి ఫస్‌రా బర్‌జఖా" అనగా ఆయన(స)గారు ఒక సమూహానికి నమాజ్ చేయిస్తున్నారు. ఖుర్‌ఆన్ పారాయణం చేస్తూ, మధ్యలో దాని క్రమాన్ని తెంచేస్తూ, వేరొక చోటినుండి పారాయణం ప్రారంభించారు. ఏ భాగాన్నైతే ఇక్కడ విడిచిపెట్టడం జరిగిందో, దాన్ని 'బర్‌జఖ్' అని పిలువడం జరిగింది. ఇంకొక హదీసులో శంకల్ని 'బరాజఖుల్ ఈమాన్' అంటే, అపనమ్మకం మరియు విశ్వాసం మధ్య స్థితి.

భాషాపరమైన అర్థం

మానవుని మరణం మొదలుకొని ప్రళయం రోజువరకు గల

మధ్యకాలాన్ని లేక వ్యవధి కోసం ఖుర్ఆన్ ఈ పదాన్ని ఉపయోగించింది. ఖుర్ఆన్‌లోని ఏ ఆయతులోనైతే ఈ పదం అవతరించిందో, స్వయంగా ఆ పదమే దాని భాషాపరమైన అర్థాన్ని విశదీకరిస్తున్నది.

చివరకు వారిలో ఎవడికైనా మరణం వస్తే వాడు ఇలా అనటం ప్రారంభిస్తాడు. "ఓ నా ప్రభూ! నేను వదిలి పెట్టి వచ్చిన లోకానికే నన్ను తిరిగి పంపెయ్యి, ఇక నేను మంచి పనులు చేస్తానని ఆశిస్తున్నాను." ఇది ఎంతమాత్రమూ జరిగేది కాదు, అతడు పలికేది కేవలం ఒక మాట మాత్రమే. ఇప్పుడు ఈ (మరణించేవారి) అందరి వెనుక ఒక గోడ అడ్డంగా ఉన్నది. ఇది మరొక జీవితం వచ్చే రోజువరకు ఉంటుంది. (అల్‌మోమినూన్- 100)

حَتّٰٓى اِذَا جَآءَ اَحَدَهُمُ
الْمَوْتُ قَالَ رَبِّ ارْجِعُوْنِ
لَعَلِّيْٓ اَعْمَلُ صَالِحًا فِيْمَا
تَرَكْتُ كَلَّا اِنَّهَا كَلِمَةٌ هُوَ
قَآئِلُهَا وَمِنْ وَّرَآئِهِمْ بَرْزَخٌ
اِلٰى يَوْمِ يُبْعَثُوْنَ ۝

దీనిద్వారా మరణ సమయం నుండి ప్రళయం రోజువరకు గల కాలమంతా 'బర్జఖ్' అనబడుతుందని అర్థమవుతున్నది. మీరు దీన్ని అడ్డంకి, ఆపుదల, లేక చాటు అని పిలిచినా ఫర్వాలేదు. కాని ఈ అడ్డంకి లేక చాటు అనేది మృతునికి మరియు ప్రపంచానికి మధ్యనే లేదా మృతునికి మరియు ప్రళయానికి మధ్యనే. దైవం మరియు అతని దాసుని (మానవుని) మధ్య ఎంతమాత్రం కాదు. బర్జఖ్ స్థితిలో మృతులు దైవసన్నిధి నుండి చాటుగా ఉంచబడతారనే అర్థం వచ్చే ఏ చిన్న దృష్టాంతం (సూచన) కూడా ఖుర్ఆన్‌లో మనకు లభించదు. ఇది కేవలం నిరాధారమైన ఆలోచన మాత్రమే.

బర్‌జఖ్ పరిస్థితి

మరి బర్‌జఖ్ పరిస్థితి ఏమిటి? ఇందులో మానవునికి (మృతునికి) ఏదైనా జీవితం ఉందా? లేదా? సజ్జనుల కోసం సుఖం, దుర్మార్గుల కోసం వ్యధలాంటిది ఏదైనా అక్కడుందా? లేదా? ఇంకా బర్‌జఖ్‌లో మానవ ఆత్మ ఏ పరిస్థితిలో ఉంటుంది.

మౌలానా అస్లం జేరాజ్‌పూరి గారి వాదన ఏమంటే:

1. చనిపోయినవారు బర్‌జఖ్‌లో తమ ప్రభువు సన్నిధి నుండి దూరంగా (చాటుగా) ఉంచబడతారు. కేవలం ప్రళయం రోజే వారు హాజరు పరచబడతారు.

2. 'బర్‌జఖ్' అనేది సంపూర్ణంగా మృతజీవనం. (సంపూర్ణ మృత స్థితి) అందులో జీవనం, జ్ఞానం, గ్రాహ్యం, అనుభూతి అనుభవం, ప్రభావితం కావటం లాంటివేమీ ఉండవు. అందుకని పాపపుణ్యాలుగాని, సుఖదుఃఖాలుగాని అక్కడ లేవు.

3. 'బర్‌జఖ్'లో ఉండటమంటే దేవుని గ్రంథం (లెక్క)లో ఉండటం మాత్రమే. అంటే మానవుడు ఈ భూమిపై చివరి శ్వాస పీల్చిన తరువాత సమాప్తమై (నశించి)పోతాడు. కేవలం అతని గురించిన వివరాలు మాత్రమే దైవగ్రంథంలో నమోదై ఉంటాయి. ఇక ఎప్పుడయితే ప్రళయం సంభవిస్తుందో, ఈ దైవగ్రంథంలో నమోదైన వారందరిని తిరిగి పుట్టించటం జరుగుతుంది. కనుక మరణం మొదలుకొని ప్రళయదినం వరకు ఆత్మ కేవలం నశ్వరస్థితిలో, ఉనికిలేని స్థితిలో ఉంటుంది. దాని ఉనికి ఎక్కడైనా ఉందా అంటే అది కేవలం దైవగ్రంథంలోనే.

4. కేవలం దైవం కోసం, దైవమార్గంలో చంపబడ్డవారే, దీన్నుండి మినహాయింపబడతారు. వారు చనిపోయిన తరువాత కూడా బ్రతికే ఉంటారు. తమ ప్రభువు సన్నిధినుండి వారు చాటుగా (దూరంగా)

ఉంచబడరు. అంతేకాదు, వెంటనే వారు హాజరుపరచబడతారు. ఇంకా వారికి భుక్తినివ్వటం జరుగుతుంది.

పై వాదన ఖుర్ఆన్ ద్వారా నిరూపితమవుతుందా?లేదా? అనేది మనం పరిశీలించాల్సి ఉంది. ఇంకా పై ప్రశ్నలకు ఖుర్ఆన్ ప్రకారం సరియైన సమాధానాలేవి?

జీవన్మరణాలకు అర్థం

ఈ వాద ప్రతివాదాల్లో అసలు, మొట్టమొదటగా పరిష్కరించబడవలసిన ప్రశ్న, 'జీవితం మరియు మరణం' ఏమిటో అన్నది దివ్య ఖుర్ఆన్‌లో ఇలా పేర్కొనటం జరిగింది.

كُنتُمْ أَمْوَاتًا فَأَحْيَاكُمْ ثُمَّ يُمِيتُكُمْ ثُمَّ يُحْيِيكُمْ

వాస్తవానికి ప్రాణంలేని మీకు ఆయన ప్రాణం పోశాడు, మళ్ళీ మీ ప్రాణం తీసేది ఆయనే. తిరిగి మిమ్మల్ని బ్రతికించేదీ ఆయనే.

(అల్ బఖర- 28)

పై ఆయతులో రెండు మరణాలు, రెండు జీవితాల గురించి చెప్పటం జరిగింది.

1. భౌతిక శరీరంలో ఆత్మ ప్రవేశించకముందున్న పరిస్థితిని 'మొదటి మరణం'గా పేర్కొనటం జరిగింది. ఉదాహరణకు:

وَبَدَأَ خَلْقَ الْإِنسَانِ مِن طِينٍ ۝ ثُمَّ سَوَّاهُ وَنَفَخَ فِيهِ مِن رُّوحِهِ وَجَعَلَ لَكُمُ السَّمْعَ وَالْأَبْصَارَ وَالْأَفْئِدَةَ (٣٢:٧)

ఆయన మానవ సృష్టి ప్రారంభాన్ని మట్టితో చేశాడు.... ఆ తరువాత అతనిని నఖశిఖ పర్యంతం తీర్చిదిద్దాడు. అతనిలోనికి తన ఆత్మను ఊదాడు, మీకు చెవులిచ్చాడు, కళ్ళిచ్చాడు, హృదయాలిచ్చాడు. (అస్ సజ్దా- 7&9)

పై ఆయతుల ద్వారా ఇది విధితమవుతున్నది.

2. శరీరంలో ఆత్మను ప్రవేశపెట్టిన తరువాత పరిస్థితిని మొదటి జీవితంగా వర్ణించటం జరిగింది. దీనిలో మానవుడు తన శారీరక చెవులతో వింటాడు, శారీరక కళ్ళతో చూస్తాడు, శారీరక మనోమస్తిష్కాలతో ఆలోచిస్తాడు. ఈ విషయమై కూడా పై ఆయతు సూచిస్తుంది.

3. భౌతిక శరీరం నుండి ఆత్మను తీసేసుకున్నప్పటి పరిస్థితిని రెండవ మరణంగా పేర్కొనటం జరిగింది.

اَللّٰهُ يَتَوَفَّى الْاَنْفُسَ حِيْنَ مَوْتِهَا

మరణ సమయంలో ఆత్మలను వశ పరుచుకునేవాడు అల్లాహ్‌యే.

(అజ్ జుమర్- 42)

وَلَوْ تَرٰۤى اِذِ الظّٰلِمُوْنَ فِىْ غَمَرٰتِ الْمَوْتِ وَالْمَلٰۤئِكَةُ بَاسِطُوْۤا اَيْدِيْهِمْ اَخْرِجُوْۤا اَنْفُسَكُمْ

ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగితేలుతూ ఉండగా, దైవ దూతలు తమ హస్తాలను చాచి 'ఇటు తెండి! బయటకు తియ్యండి మీ ప్రాణాలను....." (అల్ అన్ఆమ్- 92)

పై ఆయతులు దీనికి దృష్టాంతములు

4. మరణం రోజు శరీరంనుండి తీసేసుకున్న ఆత్మనే, ప్రళయం రోజు తిరిగి శరీరంలోకి పంపించటం జరుగుతుంది. దీన్నే రెండవ జీవితంగా పేర్కొనటం జరిగింది. దీన్ని:

وَاِذَا النُّفُوْسُ زُوِّجَتْ

ప్రాణాలు (శరీరాలలో) తిరిగి కలప బడినప్పుడు- (అత్ తక్‌వీర్- 7)

మేము మొదట్లో సృష్టిని చేసినట్లే మళ్ళీ దానిని చేస్తాము.

كَمَا بَدَأْنَا أَوَّلَ خَلْقٍ نُعِيدُهُ

(అల్ అంబియా- 104)

పై ఆయతులు, ఇంకా ఇలాంటి అనేక ఆయతులు సమర్థిస్తాయి.

శారీరక (భౌతిక) మరణం తరువాత ఆధ్యాత్మిక జీవితం

సామాన్యంగా శరీరం మరియు ఆత్మల కలయికను జీవితంగాను, శరీరం మరియు ఆత్మల ఎడబాటును (విడిపోవటాన్ని) మరణంగాను ఖుర్ఆన్ పేర్కొంటుందనేది తెలిసిపోయింది. కాని, ఖుర్ఆన్ మరణమని దేన్నైతే పేర్కొంటుందో దాని అర్థం నశ్వరం, ఉనికి హీనత కాదు, ఆ స్థితిలో కూడా ఒక రకమైన జీవితం ఉంది. ఆ జీవితంలో ఆత్మ వినగలుగుతుంది, చెప్పగలుగుతుంది, దానికి విషయ అవగాహన ఉంటుంది. ఖుద్దుగా ఖుర్ఆన్‌లోనే దీనికి అనేక దృష్టాంతాలున్నాయి. మొదటి మరణ స్థితిలో జరిగిన ఒక విషయాన్ని అదిలా వర్ణిస్తున్నది.

"ప్రవక్తా! ప్రజలకు ఆ సమయాన్ని జ్ఞాపకం చెయ్యి, అప్పుడు నీ ప్రభువు ఆదం సంతతి యొక్క వీపుల నుండి వారి సంతానాన్ని తీసి ఇంకా స్వయంగా వారిని వారికే సాక్షులుగా నిలబెట్టి అడిగాడు. "నేను మీ ప్రభువును కాదా?" అని. వార్లు ఇలా అన్నారు. "నిశ్చయంగా మీరే మా ప్రభువు. మేము దీనికి సాక్ష్యం ఇస్తున్నాం." (అల్ ఆరాఫ్- 172)

وَإِذْ أَخَذَ رَبُّكَ مِنْ بَنِي آدَمَ مِنْ ظُهُورِهِمْ ذُرِّيَّتَهُمْ وَأَشْهَدَهُمْ عَلَى أَنْفُسِهِمْ أَلَسْتُ بِرَبِّكُمْ قَالُوا بَلَى شَهِدْنَا (٧ : ١٧٢)

ఆత్మలు శరీరాల్లో ప్రవేశించకముందే, వారు మృతస్థితిలో ఉన్నప్పుడు కూడా, వాటికి వినగలిగే, చెప్పగలిగే, గ్రహించగలిగే యోగ్యత ఉన్న మృత్యువు అది అని అర్థం కావటం లేదా? దైవం వాటిని ప్రశ్నించాడు, అవి దాన్ని విన్నాయి, దానికి సమాధానమిచ్చాయి, ప్రశ్నను గ్రహించే అర్థం చేసుకునే సమాధానమిచ్చాయి. అందుకని శరీరాల్నుండి, ఆత్మలు వేరుబడి ఉండడం కారణంగానే ఆ పరిస్థితిని మరణంగా పరిగణించటం జరిగింది. వాస్తవానికి అది కూడా ఒకరకమైన జీవితమే. వినటం, పలకటం, గ్రహించటం అనేవి జీవిత లక్షణాలుగా పరిగణింపబడతాయి.

ఇక రెండవసారి మరణం సంభవించిన పరిస్థితిలో కూడా ఆత్మల్లో ఈ గుణాలు (జీవిత లక్షణాలు) ఉంటాయని ఖుర్‌ఆన్‌లోని అనేక ఆయతులు ధృవపరుస్తున్నాయి. ఉదాహరణకు:

"చివరకు వారిలో ఎవడికైనా మరణం వస్తే వాడు ఇలా అనటం ప్రారంభిస్తాడు. "ఓ నా ప్రభూ! నేను వదిలిపెట్టి వచ్చిన లోకానికే నన్ను తిరిగి పంపెయ్యి; ఇక నేను మంచి పనులు చేస్తానని ఆశిస్తున్నాను; ఇది ఎంతమాత్రమూ జరిగేది కాదు. అతడు పలికేది కేవలం ఒక మాట మాత్రమే. ఇప్పుడు ఈ (మరణించే వారి) అందరి వెనుక ఒక గోడ అడ్డంగా ఉన్నది. అది మరొక జీవితం వచ్చేరోజు వరకు ఉంటుంది."

(అల్ మోమినూన్- 100)

حَتّٰىٓ اِذَا جَآءَ اَحَدَهُمُ
الْمَوْتُ قَالَ رَبِّ ارْجِعُوْنِ لَعَلِّيْٓ
اَعْمَلُ صَالِحًا فِيْمَا تَرَكْتُ كَلَّا
اِنَّهَا كَلِمَةٌ هُوَ قَآئِلُهَا وَ
مِنْ وَّرَآئِهِمْ بَرْزَخٌ اِلٰى يَوْمِ
يُبْعَثُوْنَ ۝

పై ఆయతులో వచ్చిన 'ఇర్జివూన్' (నన్ను తిరిగి పంపెయ్యి) 'ఫీమా తరక్తు' (నేను వదిలిపెట్టివచ్చిన) మరియు మిన్ వ్వరాయిహిం బర్జఖున్ (ఈ అందరి వెనక ఒక గోడ అడ్డంగా ఉన్నది) అనే వాక్యాల ద్వారానే ఇది ప్రపంచం విడిచివెళ్ళిన తరువాత పరిస్థితి అని, అతనికి ప్రపంచానికి మధ్య 'బర్జఖ్' తెరపడిందని, ఇక ప్రపంచంలో ఉండడమనేది కాదు, తిరిగి ప్రపంచానికి వెళ్ళే సమస్య అని స్పష్టంగా అర్థమవుతున్నది. మరణించి ఉన్న ఈ స్థితిలో మృతుడు తన ప్రభువుతో మాట్లాడుతున్నాడు. తిరిగి ప్రపంచానికి పంపమని తన కోరికను వెల్లడిస్తున్నాడు. దీనిలో భయం, ఆశల భావాలు మిళితమై ఉన్నాయి. తను ప్రపంచంలో చేసివచ్చిన చేష్టలు అతనికి గుర్తున్నాయి. వాటిపై సిగ్గు, రాబోయే ప్రమాదాల అవగాహన ఉంది. తన ప్రభువును గుర్తిస్తున్నాడు. అతనిలో మాట్లాడే శక్తి ఉంది కనుకనే అతనిలా కోరుకుంటున్నాడు. దీన్ని జీవనానికి సంబంధించిన ఎలాంటి లక్షణాలు, చిహ్నాలు లేని సంపూర్ణ మృతస్థితి, మృతలోకం అని మీరెలా అనగలుగుతున్నారు?

ఈ క్రింది ఆయతులు కూడా పై విషయాన్నే ధృవీకరిస్తున్నాయి.

وَاَنْفِقُوْا مِمَّا رَزَقْنٰكُمْ مِّنْ قَبْلِ اَنْ يَّاْتِيَ اَحَدَكُمُ الْمَوْتُ فَيَقُوْلَ رَبِّ لَوْلَآ اَخَّرْتَنِيْٓ اِلٰٓى اَجَلٍ قَرِيْبٍ فَاَصَّدَّقَ وَاَكُنْ مِّنَ الصّٰلِحِيْنَ ۝

"మీలో ఎవరికైనా మరణ సమయం సమీపించి, అతను 'ఓ నా ప్రభూ! నీవు నాకు మరికొంత వ్యవధి ఎందుకివ్వలేదు. నేను దానధర్మాలు చేసి సజ్జనులలో కలిసిపోయేవాణ్ణి కదా?' అని వాపోయే పరిస్థితి రాక ముందే మేము మీకు ఇచ్చిన ఉపాధి నుండి ఖర్చుపెట్టండి"

(అల్ మునాఫిఖూన్- 10)

اِنَّ الَّذِيْنَ تَوَفّٰىهُمُ
الْمَلٰٓئِكَةُ ظَالِمِيْٓ اَنْفُسِهِمْ
قَالُوْا فِيْمَ كُنْتُمْ قَالُوْا كُنَّا
مُسْتَضْعَفِيْنَ فِي الْاَرْضِ
قَالُوْٓا اَلَمْ تَكُنْ اَرْضُ اللّٰهِ
وَاسِعَةً فَتُهَاجِرُوْا فِيْهَا

"తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి ప్రాణాలను తీసి, దైవదూతలు వారిని 'ఇదేమిటీ మీ స్థితి ఇలా ఉందీ' అని అడిగారు. అప్పుడు వారు ఇలా సమాధానం చెప్పారు. 'మేము భూమిపై బలహీనులుగా, నిస్సహాయులుగా ఉండే వారము" దైవదూతలు అల్లాహ్ భూమి విశాలంగా లేదా మీరు వలస పోవటానికి" అని అడిగారు.

(అన్‌నిసా- 97)

حَتّٰٓى اِذَا جَآءَتْهُمْ رُسُلُنَا
يَتَوَفَّوْنَهُمْ قَالُوْٓا اَيْنَمَا كُنْتُمْ
تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ
قَالُوْا ضَلُّوْا عَنَّا وَشَهِدُوْا
عَلٰٓى اَنْفُسِهِمْ اَنَّهُمْ كَانُوْا
كٰفِرِيْنَ ۝ قَالَ ادْخُلُوْا فِيْٓ
اُمَمٍ قَدْ خَلَتْ مِنْ قَبْلِكُمْ
مِّنَ الْجِنِّ وَالْاِنْسِ فِي النَّارِ

మేము పంపే దైవదూతలు వారి ఆత్మలను బంధించటానికి వచ్చే ఆ గడియవరకు. అప్పుడు ఆ దూతలు వారిని ఇలా అడుగుతారు. "చెప్పండి, మీరు అల్లాహ్‌కు బదులుగా వేడుకునే ఆ ఆరాధ్యదైవాలు ఇప్పుడెక్కడున్నారు? వారు ఇలా అంటారు. "వారంతా మా నుండి తప్పుకున్నారు. ఇంకా వారు "మేము నిజంగానే సత్యతిరస్కారులమే" అని తమకు వ్యతిరేకంగా తామే సాక్ష్యం ఇస్తారు. అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: 'పోండి, మీకు పూర్వం గతించిన జిన్నాతుల వర్గమూ, మానవుల వర్గమూ పోయి చేరిన ఆ నరకానికే మీరూ పోండి" (అల్ ఆరాఫ్- 37)

వారు పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ 'మీకు శాంతి కలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి' అని అంటారు. (అన్ నహ్ల్- 32)

اَلَّذِيْنَ تَتَوَفّٰهُمُ الْمَلٰٓئِكَةُ طَيِّبِيْنَ يَقُوْلُوْنَ سَلٰمٌ عَلَيْكُمُ اُدْخُلُوا الْجَنَّةَ بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ

తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉన్నప్పుడు దైవదూతలు ప్రాణాలు తీసే అవిశ్వాసులకు, అప్పుడు వారు (తలబిరుసుతనాన్ని విడిచిపెట్టి) వెంటనే పూర్తిగా లొంగిపోయి, 'మేము ఏ తప్పూ చేసి ఉండలేదు అని అంటారు. దానిపై దైవదూతలు ఇలా అంటారు. "ఎందుకు చేసి ఉండలేదు! అల్లాహ్ మీ చేష్టలను బాగా ఎరుగును. ఇక పోండి. నరక ద్వారాలలో దూరి పోండి. అక్కడనే మీరు శాశ్వతంగా ఉంటారు.' (అన్ నహ్ల్- 28, 29)

اَلَّذِيْنَ تَتَوَفّٰهُمُ الْمَلٰٓئِكَةُ ظَالِمِيْٓ اَنْفُسِهِمْ فَاَلْقَوُا السَّلَمَ مَا كُنَّا نَعْمَلُ مِنْ سُوْٓءٍ بَلٰٓى اِنَّ اللّٰهَ عَلِيْمٌ بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ۝ فَادْخُلُوْٓا اَبْوَابَ جَهَنَّمَ خٰلِدِيْنَ فِيْهَا

దైవదూతలు, హతులైన అవిశ్వాసుల ప్రాణాలను తీస్తున్నప్పటి స్థితిని నీవుగనక చూడగలిగితే ఎంత బాగుండేది! వారు వారి ముఖాలపైని, పిరుదులపైని కొట్టేవారు, ఇంకా ఇలా అనేవారు: "ఇదో కాల్చే శిక్షను అనుభవించండి" (అన్ఫాల్- 50)

وَلَوْ تَرٰٓى اِذْ يَتَوَفَّى الَّذِيْنَ كَفَرُوا الْمَلٰٓئِكَةُ يَضْرِبُوْنَ وُجُوْهَهُمْ وَاَدْبَارَهُمْ وَذُوْقُوْا عَذَابَ الْحَرِيْقِ

ఇవి, ఇంకా ఇలాంటి అనేక ఆయతులున్నాయి. వీటిద్వారా సర్వసామాన్యంగా శరీరం మరియు ఆత్మలు విడిపోవటాన్ని 'మృత్యువు'గా పేర్కొనటం అయితే జరుగుతుంది. కాని గ్రహించే, తెలుసుకొనే శక్తి సంపూర్ణంగాలేని, జీవనానికి సంబంధించి ఎలాంటి లక్షణంలేని మృత్యువు మాత్రం కాదు. దీనికి బదులు, ఈ స్థితిలోకూడా ఆత్మలో జీవనానికి సంబంధించి శారీరక జీవితంలో ఉన్న సర్వలక్షణాలూ, చిహ్నాలూ ఉంటాయి. అయితే వాటి పద్ధతి, పరిస్థితి, రూపమూ మారి ఉంటాయి. ఇంకా శారీరక జీవితానికి ఈ స్థితి భిన్నంగా ఉంటుంది.

శారీరక మృతి తరువాత లభించే జీవనం ఎలాంటిది?

సామాన్యంగా మానవులు జీవితమంటే శారీరక జీవితమని, మృత్యువంటే శారీరక మృత్యువు అని భావిస్తారు. ఈ అర్థంలోనే మానవ భాషలో జీవితం, మరణం అనే పదాలు ఉపయోగింపబడతాయి. ఈ కారణంగానే దైవంకూడా తన దివ్యవాణిలో జీవన్మరణాలను శారీరక జీవితం, శారీరక మరణం అనే అర్థాల్లోనే ఉపయోగించాడు. వాస్తవ జీవితం శారీరక జీవితం మాత్రమేనని, వాస్తవ మృత్యువు కూడా శారీరక మృత్యువేనని (జీవనానికి సంబంధించిన ఏ లక్షణంలేని) భావించే-మానవుల ఈ అజ్ఞానపు భావనను ఖండించే అవసరం కొన్ని సందర్భాల్లో ఏర్పడింది. ప్రత్యేకించి సత్యమార్గంలో, దైవమార్గంలో ప్రాణాలర్పించే సందర్భం వచ్చినప్పుడు ఈ అజ్ఞానపు భావన మనిషిని పిరికివానిగా చేసేస్తుంది. అతను ఆ సమయంలో తన ప్రాణాలర్పించటానికి వెనుకంజ వేస్తాడు. నేనొకవేళ చనిపోతే, జీవిత సౌఖ్యాలకు దూరమైపోతాను, శరీరం నుండి ఆత్మ విడిపోగానే, నేను శాశ్వతంగా నశించి, నామరూపాల్లేకుండా పోతానని అతను భయపడతాడు. ఈ సందర్భంలోనే దైవం, యదార్థంపై పడి ఉన్న తెరలేపేస్తాడు. దేన్నైతే నీవు మరణం అనుకుంటున్నావో, వాస్తవంలో అది మరణం కానేకాదు. మా కోసం నీవు ప్రాణాలర్పించి

'సంపూర్ణ శాశ్వత మృత్యులోకం'లోకి వెళ్ళవు. దానికి బదులు మరణించి కూడా నీవు బ్రతికేఉంటావు. మేము ప్రసాదించే ఆహారం రుచులు నీవు ఆస్వాదిస్తూనే ఉంటావు" అని పేర్కొంటున్నాడు.

وَلَا تَحْسَبَنَّ الَّذِيْنَ قُتِلُوْا فِيْ سَبِيْلِ اللّٰهِ اَمْوَاتًا ۭ بَلْ اَحْيَاۗءٌ عِنْدَ رَبِّهِمْ يُرْزَقُوْنَ ۝

"అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు సజీవులే. తమ ప్రభువు వద్ద జీవికను పొందుతున్నారు."
(ఆలి ఇమ్రాన్- 169)

وَلَا تَقُوْلُوْا لِمَنْ يُّقْتَلُ فِيْ سَبِيْلِ اللّٰهِ اَمْوَاتٌ ۭ بَلْ اَحْيَاۗءٌ وَّلٰكِنْ لَّا تَشْعُرُوْنَ ۝

అల్లాహ్ మార్గంలో చంపబడినవారిని 'మృతులు' అనకండి. వాస్తవానికి వారు సజీవులు. కాని మీరు వారి జీవితాన్ని గ్రహించలేరు.
(అల్‌బఖర- 154)

ఈ పరిస్థితుల్లో 'వాస్తవం'పై తెరపడి ఉండడం వల్ల, ఒక గొప్ప ఔచిత్యం దెబ్బతినే ప్రమాదముంది కనుక ఈ వాస్తవాన్ని బహిరంగపర్చటం జరిగింది. కాని ఒక్క నిమిషం ఆగి, దీన్ని పరిశీలించి చూడండి. ఎవరైతే దైవమార్గంలో చంపబడతారో, వారిని సామాన్య భాషలో ఉపయోగించే 'మరణం' వరించదని చెప్పబడటంలేదు. దానికి బదులు చెప్పబడిందేమిటంటే, వారి మరణాన్ని 'వాస్తవ మరణం'గా భావించకండి, చెప్పుకోకండి, వారు వధింపనయితే బడ్డారు, వారి శరీరాలను ఆత్మలు కూడా వీడిపోయాయి. వారు ప్రపంచం నుండి తప్పకుండా వెళ్ళిపోతారు. వారు ఖననం కూడా చేయబడతారు, వారి భార్యలు వితంతువులు, వారి పిల్లలు అనాథలు కూడా అవుతారు. వారి ఆస్తులు పంచుకోబడతాయి కూడా. ఈ అన్ని విషయాల్లో అన్ని కోణాల్లో వారు ప్రపంచం, ప్రపంచవాసుల దృష్టితో మరణించారనటంలో ఎలాంటి అనుమానం లేదు. అయితే ఈ శారీరక మృత్యువు తరువాత కూడా, వారికో జీవితం లభిస్తుంది. అందులో వారు

దైవం ప్రసాదించే ఆహారం, ఇంకా ఇతర దైవానుగ్రహాలను అనుభవిస్తూ ఉంటారు. కాకపోతే దీనిగురించిన జ్ఞానం మీకు లేదు.

ఈ అంశాన్నే మౌలానా అస్లం జెరాజ్‌పూరిగారు అర్థం చేసుకోలేక పోయారు. సామాన్య మరణం, వాస్తవ మరణంలో గల బేధాన్ని గుర్తించలేక పోయారు. ప్రత్యేకంగా దైవమార్గంలో ప్రాణాలర్పించే యోధుల విషయంలోనే దైవం ఈ రెండింటిలో గల బేధాన్ని ఎత్తిచూపటంలోగల ఔచిత్యమేమిటో ఆలోచించలేదాయన. అంతేకాదు, ఈ ఆయతులలోని భావాన్ని అర్థం చేసుకోవటంలోను ఆయన పొరపడ్డారు. ఈ బేధం కేవలం దైవమార్గంలో ప్రాణాలర్పించిన వారివరకే పరిమితం కాదని, చనిపోయే వారందరి కోసం సామాన్య మరణం తరువాత కూడా ఒక ఆధ్యాత్మిక జీవనం ఉందని, అందులో జ్ఞానం అనుభూతి వినే, పలికే మొదలుగు గల సామర్థ్యాలన్నీ యధాతథంగా ఉంటాయని ఈ ఆయతుల ద్వారా స్పష్టమవుతున్నది.

ఇక్కడ ఆయన చేసిన ప్రథమ మరియు మౌలికమైన పొరపాటు అదే. ఈ కారణంగానే చివరివరకూ ఆయన ఆలోచనలు క్రమం తప్పుతూ పోయాయి.

బర్జఖ్‌లో ఆత్మలుండే ప్రదేశాలు

భౌతిక (శారీరక) మరణం తరువాత ఆధ్యాత్మిక జీవిత సాక్ష్యం లభించిన పిదప, ఇకమరణించిన తరువాత మానవ ఆత్మలతో ఎలా వ్యవహరించబడుతుంది, వాటినెక్కడ ఉంచటం జరుగుతుందనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది.

మానవులు ప్రపంచ జీవితంలో ఏ కర్మలనైతే ఆచరించారో, బర్జఖ్‌లో వారి ఆత్మలకు దాని ప్రకారమే స్థానాలు కేటాయించబడతాయని ఖుర్ఆన్ తెలుపుతుంది. ప్రపంచంలో దైవభీతి, సత్కర్మలతో జీవితం గడిపినవారి ఆత్మలు, అత్యంత సూక్ష్మమై, మహోన్నత ప్రదేశాలవైపు ఎగిరి పోతుంటాయి. శరీరం నుండి బయటపడగానే, దైవదూతలు వారికి సఫలీకృత శుభవార్తను వినిపిస్తారు. వారి పేర్లు ఊర్ధ్వలోకపు రిజిష్టర్లలోవ్రాయ

బడతాయి. ప్రళయం (తీర్పుదినం) వరకు గల నిరీక్షణ వ్యవధిని అవి ఎలాంటి మహోన్నత స్థలాలలో గడుపుతాయంటే, స్వర్గ సువాసనలు వాటికి చేరుతూ ఉంటాయి. వాస్తవంలో అవి స్వర్గ ప్రారంభ దశలై ఉంటాయి.

اَلَّذِيْنَ تَتَوَفّٰهُمُ الْمَلٰٓئِكَةُ
طَيِّبِيْنَ يَقُوْلُوْنَ سَلٰمٌ عَلَيْكُمُ
ادْخُلُوا الْجَنَّةَ بِمَا كُنْتُمْ
تَعْمَلُوْنَ ۝

వారు పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ "మీకు శాంతి కలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి" అని అంటారు.

(అన్ నహ్ల్- 32)

وَالَّذِيْنَ هَاجَرُوْا فِيْ سَبِيْلِ
اللّٰهِ ثُمَّ قُتِلُوْٓا اَوْ مَاتُوْا
لَيَرْزُقَنَّهُمُ اللّٰهُ رِزْقًا حَسَنًا
وَّاِنَّ اللّٰهَ لَهُوَ خَيْرُ الرّٰزِقِيْنَ
لَيُدْخِلَنَّهُمْ مُّدْخَلًا يَّرْضَوْنَهٗ

"ఎవరు అల్లాహ్ మార్గంలో వలస పోయారో, తరువాత చంపబడ్డారో, లేక మరణించారో వారికి అల్లాహ్ మంచి ఉపాధిని ప్రసాదిస్తాడు." నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే ఉత్తమ ఉపాధి ప్రదాత. వారు తృప్తిపడే స్థలానికి ఆయన వారిని చేరుస్తాడు.

(అల్ హజ్- 58,59)

وَلَئِنْ قُتِلْتُمْ فِيْ سَبِيْلِ
اللّٰهِ اَوْ مُتُّمْ لَمَغْفِرَةٌ مِّنَ اللّٰهِ

మీరు అల్లాహ్ మార్గంలో చంపబడినా లేక చనిపోయినా మీ వంతుగా మీకు లభించే అల్లాహ్ కారుణ్యం, ఆయన క్షమాభిక్ష, వారు కూడబెట్టే సమస్త వస్తువులకంటే ఎంతో ఉత్తమమైనది. మీరు చని

وَرَحۡمَةٌ خَيۡرٌ مِّمَّا يَجۡمَعُوۡنَ
وَلَئِنۡ مُّتُّمۡ اَوۡ قُتِلۡتُمۡ لَا۟اِلَى اللّٰهِ تُحۡشَرُوۡنَ ۝

పోయినా లేక చంపబడినా, ఏ స్థితిలో అయినా సరే. మీరంతా అల్లాహ్ సమక్షంలో సమీకరించబడతారు.[1] (ఆలిఇమ్రాన్- 158)

وَجَآءَ مِنۡ اَقۡصَا الۡمَدِيۡنَةِ رَجُلٌ يَّسۡعٰى قَالَ يٰقَوۡمِ اتَّبِعُوا الۡمُرۡسَلِيۡنَ ....
اِنِّىۡۤ اٰمَنۡتُ بِرَبِّكُمۡ فَاسۡمَعُوۡنِ
قِيۡلَ ادۡخُلِ الۡجَـنَّةَ ؕ

"ఇంతలోనే పట్టణంలోని ఒక మారు మూల ప్రాంతం నుండి ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి ఇలా అన్నాడు. "నా జాతి ప్రజలారా! దైవ ప్రవక్తను అనుసరించండి......... నేను మీ ప్రభువును విశ్వసించాను. అందుకని మీరు కూడా నా మాటను వినండి........... (చివరకు వారు అతన్ని హత్య చేశారు) ఆ వ్యక్తితో స్వర్గంలో ప్రవేశించు" అని అనబడింది.[2] (యాసీన్- 20, 25,26)

---

1. ఈ ఆయతు మరియు పై ఆయతు ద్వారా దైవభీతిపరాయణులందరితోనూ ఒకేవిధంగా వ్యవహరించబడుతుందని, ఇందులో షహీద్ (దైవ మార్గంలో చంపబడినవారు) మరియు షహీద్కాని వారిలో ఎలాంటి బేధం ఉండదని తెలుస్తు న్నది. అంతేకాక షహీద్ ఆత్మలు కాక మిగిలిన ఆత్మలన్నీ బర్జఖ్లో తమ ప్రభువు నుండి చాటుగా ఉంచబడతాయనే మౌలానా అస్లం జేరాజ్పూరి ఆలోచనను కూడా ఇవి ఖండిస్తున్నాయి.
2. ఈ వ్యక్తి చంపబడ్డాడని ఖుర్ఆన్లో పేర్కొనబడలేదు. ఉల్లేఖనాలను అనుసరించి అతను చంపబడ్డాడని తెలుస్తున్నది. ఉల్లేఖనాన్ని మనః కల్పితం, నమ్మశక్యం కానిది అని ఎవరయితే అనుకుంటారో, వారు ఆ వ్యక్తికి స్వర్గంలో ప్రవేశించుమనే ఆదేశం, చనిపోయిన తరువాతనే ఇవ్వబడిందని ఒప్పుకోవాల్సి వస్తుంది.

عِلِّيِّيْنَ ۝ وَمَآ اَدْرٰىكَ مَا عِلِّيُّوْنَ ۝ كِتٰبٌ مَّرْقُوْمٌ ۝ يَّشْهَدُهُ الْمُقَرَّبُوْنَ

నిస్సందేహంగా సజ్జనుల కర్మల పత్రాలు ఉన్నతస్థాయి వ్యక్తులకు సంబంధించిన గ్రంథంలో ఉంటాయి. ఉన్నతస్థాయి వ్యక్తులకు సంబంధించిన గ్రంథం ఏమిటో నీకు తెలుసా? అదొక వ్రాయబడిన గ్రంథం. దేవునికి సన్నిహితులైన దైవదూతలు దాన్ని కాపలాకాస్తూ ఉంటారు.[1]

(అల్ ముతఫ్ఫిఫీన్- 18-20)

దీనికి భిన్నంగా ఎవరయితే పాపజీవితం గడుపుతారో వారి ఆత్మలు మైలపడిపోతాయి, వారి కోసం ఉన్నతస్థానాల ద్వారాలు తెరుచుకోవు. శరీరం నుండి బయటపడగానే వాటిపై మొదలవుతాయి. అవి నీచమైన, వ్యధా భరితమైన చెరసాలల్లో ఉంచబడతాయి. అక్కడ వారికి తమ భయంకరమైన పర్యవసానపు సూచనలు కనబడుతుంటాయి. ఇంకా ప్రపంచ జీవితంలో

1. మౌలానా అస్లం జేరాజ్‌పూరి ఈ ఆయతు మరియు దీని కోవకే చెందిన ఇంకొక ఆయతు భావాన్ని అర్థం చేసుకోలేదు. 'ఇల్లియ్యీన్' అనే పదానికి రెండర్థాలు తీయవచ్చు. ఒకటి మహోన్నత స్థానాలు, రెండవది అత్యంత గౌరవనీయులైనవారు. అదే విధంగా 'సిజ్జీన్' అంటే కారాగారం లేదా నేర స్తుల సమూహం. సజ్జనులు, దైవభీతిపరాయణుల పేర్లు "ఇల్లియ్యీన్"కు ప్రత్యేకించిన దఫ్తరాల్లో నమోదు చేయబడతాయి. దీనిద్వారా ఆత్మలు నశించిపోతాయి. కేవలం వారి పేర్లు మాత్రమే ఆ సంబంధిత రిజష్టర్లలో నమోదై ఉంటాయని అర్థం చేసుకోవటం సమంజసంకాదు. దానికి బదులు వారి వారి ఆత్మలు "ఇల్లియ్యీన్" లేక "సిజ్జీన్"లో ప్రవేశిస్తాయి. పాఠశాలలో అబ్బాయి పేరు నమోదైందంటే, అబ్బాయి మాయమై కేవలం అతని పేరు మాత్రం రిజష్టరులో ఉండిపోయిందని అర్థంకాదు.

తమ పాపకార్యాల మూలంగా కూడగట్టుకున్న మలినాలను చూసి వారు అశాంతి, అసహనాలతో బాధపడుతుంటారు.

إِنَّ الَّذِينَ كَذَّبُوا بِآيَاتِنَا
وَاسْتَكْبَرُوا عَنْهَا لَا تُفَتَّحُ
لَهُمْ أَبْوَابُ السَّمَاءِ

"నమ్మండి! మా ఆయతులను తిరస్కరించినవారి కొరకూ, వాటి పట్ల తలబిరుసుతనం ప్రదర్శించిన వారి కొరకూ ఆకాశ ద్వారాలు ఎంత మాత్రం తెరువబడవు."

(అల్ ఆరాఫ్- 40)

وَلَوْ تَرَىٰ إِذْ يَتَوَفَّى
الَّذِينَ كَفَرُوا الْمَلَائِكَةُ
يَضْرِبُونَ وُجُوهَهُمْ وَأَدْبَارَهُمْ
وَذُوقُوا عَذَابَ الْحَرِيقِ ۝

"దైవదూతలు, హతులైన అవిశ్వాసుల ప్రాణాలను తీస్తున్నప్పటి స్థితిని నీవుగనక చూడగలిగితే, ఎంత బాగుండేది! వారు వారి ముఖాలపైని, పిరుదులపైని కొట్టేవారు, ఇంకా ఇలా అనేవారు: "ఇదో, కాల్చే శిక్షను అనుభవించండి." (అన్ఫాల్- 50)

إِنَّ كِتَابَ الْفُجَّارِ لَفِي
سِجِّينٍ ۝ وَمَا أَدْرَاكَ مَا
سِجِّينٌ ۝ كِتَابٌ مَرْقُومٌ

"నిశ్చయంగా దుర్జనుల కర్మల పత్రం చెరసాల గ్రంథంలో ఉంటుంది. చెరసాల గ్రంథం అంటే ఏమిటో నీకు తెలుసా? అదొక వ్రాయబడిన గ్రంథం." (అల్ ముతఫ్ఫిఫీన్- 7-9)

ఇవిగాక, ఇతర అనేక ఆయతుల ద్వారా, దుర్మార్గులపై మరణించిన వెంటనే కాఠిన్యాలు, శిక్షలూ మొదలవుతాయని తెలుస్తున్నది. ఉదాహరణకు ఫిర్ఔన్ అనుచరుల గురించి ఇలా తెలుపటం జరిగింది.

وَحَاقَ بِآلِ فِرْعَوْنَ
سُوءُ الْعَذَابِ النَّارُ يُعْرَضُونَ

ఫిర్ఔను అనుచరులే ఒక భయంకరమైన శిక్షలో చిక్కుకున్నారు. వారు ఉదయం, సాయంత్రం నరకాగ్ని

عَلَيۡهَا غُدُوًّا وَّعَشِيًّا ۚ وَيَوۡمَ تَقُوۡمُ السَّاعَةُ ۚ اَدۡخِلُوۡۤا اٰلَ فِرۡعَوۡنَ اَشَدَّ الۡعَذَابِ

ముందు ఉంచబడుతూ ఉంటారు. ప్రళయం గడియం వచ్చినప్పుడు, "ఫిర్ఔను అనుచరులను తీవ్రమైన శిక్షలోకి ప్రవేశింపజెయ్యండి" అని ఆజ్ఞాపించబడుతుంది.

(అల్‌మోమిన్- 46)

పై ఆయతులోని వాక్యాలు ఎంత స్పష్టంగా ఉన్నాయంటే, వాటిని అర్థం చేసుకోవటంలో ఎలాంటి చిక్కులేదు. ఫిర్ఔను అనుచర వర్గం నీటిలో మునగగానే, చెడు శిక్ష వారిని చుట్టుముట్టిందని స్పష్టంగా అర్థమవుతూనే ఉంది. ఇప్పుడు వారు నిరంతరం అగ్నికి ఆహుతి చేయబడుతుంటారు. ఇక ప్రళయం సంభవించిన తరువాత, వారిని ఇంతకన్నా కఠినమైన శిక్ష విధించ బడుతుంది. కాని కష్టమేమిటంటే మౌలానా అస్లం జేరాజ్‌పూరిగారు ప్రారంభంలోనే దివ్యఖుర్ఆన్‌లోని కొన్ని ఆయతులను తప్పుగా అర్థం చేసుకొని వాటి ఆధారంగా కొన్ని సిద్ధాంతాలను రూపొందించుకున్నారు. ఇకిప్పుడు ఈ స్పష్టమైన, సవివరమైన ఆయతులను పరిశీలించిన తరువాత, తమ సిద్ధాంతాల్లో మార్పు చేసుకునే బదులు, తమ తప్పు సిద్ధాంతాలకను గుణంగా ఈ ఆయతుల అర్థాన్నే, భావాన్నే మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఖుర్ఆన్ నిజభావాన్ని అర్థం చేసుకోకుండా ఆపేది ఇలాంటి మనస్తత్వమే.

మదీనా చుట్టుపక్కల్లోని కపటులను ఉద్దేశించి అవతరించిన ఈ ఆయతులో కూడా మేమింతకు ముందు వివరించిన భావనకు సమీప భావనే కనబడుతుంది.

سَنُعَذِّبُهُمۡ مَّرَّتَيۡنِ ثُمَّ يُرَدُّوۡنَ اِلٰى عَذَابٍ عَظِيۡمٍ

"మేము వారికి రెట్టింపు శిక్షను విధించే సమయం సమీపంలోనే ఉంది. తరువాత వారు మరింత పెద్ద శిక్ష కొరకు తిరిగి తీసుకురాబడ తారు." (అత్ తౌబా- 101)

ఇక్కడ కూడా పదాలు వివరంగాను, భావం స్పష్టంగానూ ఉంది. శిక్షలకు సంబంధించి మూడు దశలు తెలుపబడ్డాయి. ముస్లింల ద్వారా వారు పరాభవించబడి, అవమానం పాలయ్యారు. వారి దుష్టపన్నాగాలన్నీ వీగిపోయాయి. ఫలితంగా వారు ఒక శిక్షను ఈ ప్రపంచంలోనే అనుభవించారు. రెండవది బర్‌జఖ్‌లో అనుభవించే శిక్ష, మూడవది ప్రళయం తరువాత అనుభవించబోయే భయంకర శిక్ష. కాని ఇక్కడ కూడా మౌలానా గారు ముందే ఏర్పర్చుకున్న సిద్ధాంతాల కారణంగా ఒక స్పష్టమైన విషయాన్ని అర్థం చేసుకోవటంలో పొరబడ్డారు.

కొన్ని తప్పు సిద్ధాంతాలు

'బర్‌జఖ్‌ను సంపూర్ణ మృతస్థితి' అనేది మౌలానాగారు రూపొందించుకున్న తప్పు సిద్ధాంతాలలో మొదటిది. అందులో జీవనానికి సంబంధించిన ఏ సూచనలూ, లక్షణాలూ లేవు. దీని ఆధారంగానే 'బర్‌జఖ్'లో సుఖదుఃఖాలకు తావులేదని ఆయన వాదిస్తారు. కాని ఈ వాదనను సమర్థించటానికి ఆయన ఏ ఆయతులనైతే ప్రదర్శించారో, అవి ఆయన వాదనను సమర్థించవు. కాస్సేపటి కోసం ఖుర్‌ఆన్‌లో దైవ తిరస్కారులు, బహుదైవారాధకులు తమకు ఆరాధ్యులుగా భావించుకునే గతించిన వారి ప్రవక్తలు, ధార్మిక గురువులు, సత్పురుషులు ఇతర మానవులే అనుకుందాం. అయినప్పటికి మౌలానాగారు ప్రదర్శించిన ఆయతుల ద్వారా, వారు మానవుల విన్నపాన్ని వినలేరని, వారి ప్రార్థనలను ఎరుగరని ఇంకా వారికి సమాధానమివ్వలేరని మాత్రమే తెలుస్తుంది. కాని వారు స్వయంగా జ్ఞానశూన్యులని, నిర్జీవులని నిశ్చలురని ఇంకా 'సంపూర్ణ ఏమరుపాటుతో జ్ఞానహీనంతో' ఉన్నారని ఎలా నిరూపితమవుతుంది? ఒకవేళ వారు ఈ ప్రపంచ విషయాలు వినలేరని, ఈ లోకవాసులకు సమాధానమివ్వలేరని తెలిసిపోయినప్పటికి ఏ లోకంలోనైతే వారున్నారో, అక్కడ కూడా వారికి వినే, మాట్లాడే,గ్రహించే స్థోమత లేదని ఎలా నిరూపితమవుతుంది? ప్రారంభంలో ఒక విషయానికి

సంబంధించిన ఆయతులపై సరియైన పరిశీలన, అధ్యయనం చేయకుండానే, ఒక తప్పు సిద్ధాంతాన్ని రూపొందించుకోవటం ఆ తరువాత ఆ సిద్ధాంతపు దృష్టితో ఇతర స్పష్టమైన ఆయతులను తప్పుగా అర్థం చేసుకోవడం, ఇంకా పదాలను వాటి స్పష్టమైన భావాలనుండి మళ్ళించటం- ఇలాంటి పద్ధతి ద్వారా ఒక మనిషి ఖుర్‌ఆన్ బోధనల నుండి లాభపడజాలడు. ఖుర్‌ఆన్ ఒకచోట "మీరు మృతులకు వినిపించలేరు, ఇంకా మృతులు మీ ప్రార్థనలకు సమాధానమివ్వలేరు" అని అంటుంది. ఈ ఖుర్‌ఆన్‌యే ఇంకొకచోట "దైవదూతలు మృతులతో మాట్లాడుతారు, మృతులు వారికి సమాధానమిస్తారు అని చెబుతుంది. ఈ రెండు విషయాల్లో ఏమైనా వైరుధ్యం ఉందా? ఒకవేళ లేదని మీ సమాధానమైతే, మొదటి విషయాన్ని ఎలా ఒప్పుకున్నారో, రెండవ విషయాన్ని కూడా స్వీకరించండి. లేదంటారా వైరుధ్యాన్ని నిరూపించండి. (మొదటిది మృతులకు, ఈ ప్రపంచ వాసులకు సంబంధించి, రెండవది మృతులకు, దైవదూతలకు సంబంధించిన బర్‌జఖ్ సంఘటన అని గుర్తించాలి).

ఖుర్‌ఆన్ దృష్టికోణంతో మానవునికి రెండే మరణాలు, రెండే జీవితాలు ఉన్నాయనేది ఆయనగారి రెండవ సిద్ధాంతం. దీని ప్రకారం ప్రపంచ జీవితం తరువాత 'రెండవ జీవితం' సమాధిలో కాకుండా, ప్రళయం రోజు మాత్రమే లభిస్తుంది. అందుకని ఈ ప్రపంచ జీవితంతో తెగదెంపులు అయిన తరువాత 'బర్‌జఖ్' వాసుల్లో జీవితానికి సంబంధిం చిన ఎలాంటి సూచనలూ, లక్షణాలూ ఏమాత్రం ఉండవు. ఇదీ రెండవ సిద్ధాంతంలోని సారాంశం. జీవన్మరణాల భావాన్ని అర్థం చేసుకోవటంలో ఇక్కడ మౌలానా గారు పప్పులో కాలేశారు. శరీరం మరియు ఆత్మల ఎడబాటును, లేక వేరుపడటాన్ని 'మరణం'గా పరిగణించటం జరుగుతుంది. ఈ మరణానికి సంబంధించి, అందులో జీవితానికి సంబంధించిన ఎలాంటి సూచనలూ, లక్షణాలూ బొత్తిగా ఉండవు. కేవలం శరీరం మరియు ఆత్మల కలయిక మాత్రమే జీవితంగా పిలువ బడుతుందని మౌలానాగారు భావించుకున్నారు.

కాని ఖుర్‌ఆన్‌లోని పై ఆయతుల ద్వారా ఈ సిద్ధాంతం తప్పని నిరూపిం చటం జరిగింది.

ఇక ఆయనగారి మూడవ సిద్ధాంతం కూడా ఇలాగే విచిత్రంగా ఉంది. ప్రళయం రోజు మృతులు లేపబడినప్పుడు, వారు "ఓహ్! మేము పరుండే చోటినుండి మమ్మల్ని ఎవరు లేపారు అని అంటారు." అని ఖుర్‌ఆన్‌లోని ఒక ఆయతును పేర్కొన్నారు. ప్రపంచ జీవితం మరియు ప్రళయదినం మధ్యకాలాన్ని వారు అధికంగా ఒక గడియ కాలమని వారు అంచనా వేస్తారని ఖుర్‌ఆన్‌లోని కొన్ని ఆయతులలో వచ్చింది. దీనిద్వారా మౌలానాగారు వాదించేదేమంటే, 'బర్‌జఖ్'లో మృతులు సంపూర్ణ ఏమరు పాటుతో, జ్ఞానహీనంతో ఉంటారని, కాలం గురించిన జ్ఞానం వారికి అసలే ఉండదని, ఎందుకంటే వారొకవేళ 'జీవనం'తో ఉంటే శిక్షనో, బహు మానమో వారికివ్వబడుతుంటే ఈ సుదీర్ఘ కాలాన్ని వారు మరువజాలరు- ఇదీ ఆయనగారి అభిప్రాయం. ప్రళయం రోజు మానవులు తమ ప్రపంచ జీవితాన్ని ఒకరోజుగా అధికాధికంగా పదిరోజులుగా అంచనావేస్తారని కూడా ఖుర్‌ఆన్‌లోనే వచ్చింది కదా! మరి దీన్ని ఆధారంగా తీసుకొని ప్రపంచ జీవి తంలో కూడా మానవుడు ఏమరుపాటుతో జ్ఞానహీనంతో, నిర్జీవంగా 'సంపూర్ణ మృతస్థితి'లో ఉన్నాడని భావించడం సమంజసమేనా? అసలు ఇలాంటి ఆలోచనలు చేసే అవసరం ఏమొచ్చిందనేది ప్రశ్న? ఏ ఫలితాన్నైతే మీరు తీసి చూపిస్తున్నారో అది ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడలేదు. ప్రళయదినాన శరీరాల్లో తిరిగి ఆత్మను పంపినప్పుడు మానవులు ప్రళయంలో సమావేశ మైనప్పుడు వారికి ఇలా, ఇలా అనిపిస్తుందని ఒక సంఘటనగా మాత్రమే ఖుర్‌ఆన్‌లో పేర్కొనటం జరిగింది. అంతకు ముందు 'బర్‌జఖ్'లో వారు నిర్జీవంగా, నిశ్చేష్టులుగా, జ్ఞానహీనులుగా 'సంపూర్ణ మృతస్థితి'లో పడి ఉండే వారని ఖుర్‌ఆన్‌లో ఎక్కడా పేర్కొనబడలేదు. ఈ స్థితి గురించి అది కేవలం ఆయన ఊహ మాత్రమే. కాని ఈ ఊహకే ఆయనగారు అత్యంత ప్రాధా న్యత నిస్తున్నారు. దీని కోసం ఖుర్‌ఆన్‌లో 'బర్‌జఖ్'వాసుల వినటం, మాట్లా

డటం, సుఖదుఃఖాలను అనుభవించటం గురించి పేర్కొనబడిన ఆయతుల స్పష్టమైన భావాన్ని సైతం తారుమారు చేసి, తమ ఈ ఊహకు అనుగుణంగా మార్చటానికి ప్రయత్నిస్తున్నారు. ఖుర్‌ఆన్‌ను, ఖుర్‌ఆన్ ద్వారా అర్థం చేసుకోవటం అంటే ఇదేనా? ఒక లోకం నుండి వేరొక లోకానికి చేరినప్పుడు మానవుడు మొదటి లోకాన్ని మరిచిపోతాడని, లేదా మొదటి లోకానికి సంబంధించి ఒక అస్పష్టమైన భావన మాత్రమే అతనికి ఉంటుందని లేదా మొదటి లోకంలోని తన పరిస్థితిని అతను తప్పుగా అంచనా వేసుకుంటాడని ఎందుకు ఊహించలేదు? మీరు ఊహించాలనే అనుకుంటే పైవిధంగా ఎందుకు ఊహించలేదు? ఇలాంటి ఊహకు ఆస్కారముంది. "కజాలిక కానూ యూఫకూన్" అనేది ఈ ఊహను సమర్థిస్తున్నది. మీ ఊహకన్నా ఈ ఊహ దివ్యఖుర్‌ఆన్ బోధనలకు అనుగుణంగా ఉంటుందని నా అభిప్రాయం.

బర్‌జఖ్‌ను పేర్కొనకుండా, కేవలం ఇహపరలోకాల్లో లభించే శిక్షా బహుమానాలను పేర్కొంటూ అవతరించిన ఆయతులపై మౌలానాగారి చివరి సిద్ధాంతం ఆధారపడి ఉంది. వాటిలో ఇహపరాలను మాత్రమే పేర్కొంటూ, పరలోకాన్ని, ప్రతిఫలం లభించే స్థానంగా సూచించటం జరిగింది. దీనిద్వారా ప్రపంచ జీవితం అనంతరం, ప్రళయం కంటే ముందు, ఈ మధ్యకాలంలో ఎలాంటి శిక్షాబహుమానాలే లేవని మౌలానా తన వాదనను సమర్థించుకున్నారు. అయితే ఈ సిద్ధాంతం అనేక కారణాల దృష్ట్యా తప్పు, పొరపాటు.

1. ఈ ఆయతులలో 'బర్‌జఖ్' ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించి శిక్షా బహుమానాల గురించి ఎక్కడా కూడా నిరాకరించబడలేదు. దానికి బదులు, వేరే కొన్ని ఆయతులలో 'బర్‌జఖ్' జీవితం, అందులోని శిక్ష బహుమానాల గురించి ఎలా సమాచారం అందించటం జరిగిందో, ఈ ఆయతులలో ఇహలోకం, పరలోకంలో లభించే శిక్షాబహుమానాలను ఒక సమాచారంగా మాత్రమే తెలుపటం జరిగింది. అలాంటప్పుడు మొదటి

రకం ఆయతులు, రెండవ రకం ఆయతులను ఖండించేవిగా ఎలా అవుతాయి? 'బర్‌జఖ్' గురించి చర్చిస్తున్నప్పుడు, ఇహపరలోకాల శిక్షాబహుమానాలకు సంబంధించి వచ్చిన ఆయతులను పేర్కొనటం సమంజసమా?

2. దారుల్ జజా, యౌముల్ ఫస్ల్ అనేవి రెండు కూడా పరలోకం కోసం వాడబడినవే అనటం సమంజసమే. కాని బర్‌జఖ్‌లో మానవునికి ఒక రకమైన ఆధ్యాత్మిక జీవనం ఉంటుందని అనేక ఆయతులతో ధృవపర చటం జరిగింది. అందులో గ్రహించే యోగ్యత ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో, తీర్పుదినం వరకు నిరీక్షించటానికి మానవాత్మలు ఏ స్థానంలోనైతే ఉంచబడతాయో అక్కడ మంచి ఆత్మలకు సుఖం చెడు ఆత్మలకు వ్యధ లభించటమనేది అనివార్యమే. వారి వారి కర్మలనను సరించి, పూర్తి ప్రతిఫలమైతే తీర్పదినం రోజే లభిస్తుంది. కాని ఈ నిరీక్షణా వ్యవధిలో రెండు రకాల ఆత్మలను ఒకే స్థితిలో ఉంచటం అనివార్యమని ఎలా అనగలం?

3. దైవమార్గంలో చంపబడినవారికి, మరణించిన వెంటనే పుణ్యఫలం దొరకటం ప్రారంభమవుతుందని మీరూ అంగీకరిస్తున్నారు. ఈ పుణ్యఫలం, తీర్పుదినం కంటే ముందా? తరువాతనా? తరువాత అనుకుంటే, మరి షహీద్‌ల (దైవమార్గంలో చంపబడినవారు) కోసం, సామాన్య ప్రజలకంటే ముందే ఒక ప్రళయం (తీర్పుదినం) సంభవిస్తుందా? అలాకాదు, ఈ పుణ్యఫలం, ప్రళయానికి పూర్వం మరణించిన వెంటనే ప్రారంభమవుతుందని మీరంటే, మీరు ఏర్పర్చుకున్న సిద్ధాంతం వీగి పోతుంది. దీనిద్వారా, నిరీక్షణాకాలంలో ఆత్మలకు జీవిక ప్రసాదింప బడుతుంది. దివ్యఖుర్‌ఆన్‌లో పేర్కొనబడిన 'అసలు శిక్ష, ప్రతిఫలం లభించేవి మాత్రం ప్రళయం రోజే' అనే బోధనలకు ఇది విరుద్ధం కాదని రుజువైపోతుంది.

3. బర్‌జఖ్- ఒక కోణం

(మౌలానా సయ్యద్ సులేమాన్ నద్వీ సమాధానం)

శ్రీయుత సంపాదక మహాశయులు

తర్జుమానుల్ ఖుర్‌ఆన్(పత్రిక)గారికి,

అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వబరకాతుహు!

క్రీ.శ. 1953, జీఖాయెదా నెలలో 'తాలీమాతె ఖుర్‌ఆన్' గ్రంథ "ప్రసిద్ధ" రచయిత గారి ఒన మనోజ్ఞమైన వ్యాసం 'బర్‌జఖ్' శీర్షికపై ప్రచురించబడింది. అందులో మా "మఆరిఫ్" పత్రికలో లేపబడిన అభ్యంతరాలకు సమాధానమిచ్చినట్లు తెలుస్తున్నది. కాని వాదనల్నే తిరిగి పునరావృతం చేయటమే ప్రత్యుత్తరమనుకుంటే అందులో వారు కృతార్థులయ్యారు. ఈ 'ప్రసిద్ధ' రచయిత, అంతకు ముందే ప్రచురింపడిన తన వ్యాసంలోని భాగాలను, పదాలను కొద్ది గొప్ప మార్పులతో, పునరావృతం చేస్తూ సమాధానంగా ప్రదర్శించారు. అంతకుముందు ఆయనగారి వాదనల పునరావృతానికి సంబంధించి, నేనేమి చెప్పదలుచు కోలేదు. వాటికి తగిన సమాధానాలు ఇంతకుముందే "మఆరిఫ్"లో వచ్చే శాయి. అయితే ఈ ప్రస్తుత వ్యాసంలో రెండు కొత్త అంశాలున్నాయి, కనుక వాటికి సమాధానమివ్వటం నా నైతిక బాధ్యత.

అగ్ని శిక్షకు గురిచేసే ఆయతు

'బర్జఖ్' శిక్ష వాస్తవాన్ని నిరూపించటానికి, ఇతర ఆయతులతో పాటు, ఈ ఆయతును కూడా నేను పేర్కొన్నాను.

"ఫిర్ఔను అనుచరులే ఒక భయంకరమైన శిక్షలో చిక్కుకున్నారు. వారు ఉదయం, సాయంత్రం నరకాగ్ని ముందు ఉంచబడుతూ ఉంటారు. మరియు ప్రళయ ఘడియ వచ్చినప్పుడు "ఫిర్ఔను ప్రజలను తీవ్రమైన శిక్షలోకి ప్రవేశింపజెయ్యండి" అని ఆజ్ఞాపించ బడుతుంది." (మోమిన్- 46)

ప్రళయ దినానికి ముందే, దైవతిరస్కారులకు, ఉదయ సాయం కాలాల్లో శిక్ష లభిస్తున్నదని, అంతకంటే కఠిన శిక్ష ఇవ్వటానికి ప్రళయం రోజు ఆదేశించబడుతుందని పై ఆయతుల ద్వారా విదితమవుతున్నది.

ఈ ఆయతుకు నేనేదైతే అనువాదం చేసి, దానిద్వారా వాదించానో, ఖుర్ఆన్ అనువాదకులు ప్రతి ఒక్కరూ బహుశా దీని ప్రామాణికతను ఒప్పుకొని తీరుతారు. అయినప్పటికీ వ్యాసరచయితగారు ఇలా అంటు న్నారు.

'అనువాదంలో' 'మరియు' అనటం తప్పు, దానికి బదులు 'అనగా' ఉండాలి. ఎలాగంటే "ఉదయసాయంకాలాల్లో వారు అగ్నిశిక్షకు గురి చేయబడతారు, 'అనగా' ప్రళయం రోజు ఫిర్ఔను అనుచరగణాన్ని కఠినాతికఠినమైన శిక్షకు గురిచేయండని ఆదేశించబడుతుంది. దానికి సమాధానంగా, 'వావ్' అనే పదానికి 'అనగా' అనే అనువాదాన్ని ఏ వ్యాకరణంతోనైనా సరే, నిరూపించండి అని నేను చాలెంజ్ చేస్తున్నాను. (మఆరిఫ్ 34, పేజి 4) అని వ్రాశాను.

ఈ చాలెంజీకి సమాధానంగా, రచయితగారు తన పుస్తకంలోని పుట లను మారుస్తూ, తమ అనువాదాన్ని, నా అనువాద క్రమంగా సరిదిద్దు

కున్నారు. ఈ కారణంగానే ప్రస్తుతం 'తర్జుమానుల్ ఖుర్ఆన్' పత్రికలో వచ్చిన ఆయనగారి వ్యాసంలో నా అనువాద క్రమంగా, తమ అనువాదం మార్చుకొని సమర్పించారు. ఇకిప్పుడు 'అనగా' అనే పదం గురించికాదు, 'యూరజూన్' అనే పదానికి వర్తమానం కాక, భవిష్య వచనంగా మార్చాలని ఆయన పట్టు. అంటే 'ప్రవేశపెట్టబడ్డారు'కు బదులు "ప్రవేశపెట్టబడతారు" అని. అయితే ఈ అభిప్రాయంపై ఈ క్రింది అభ్యంతరాలు లేస్తాయి.

1. ఆయతులో రెండు భాగాలున్నాయి.

(అ) ఉదయం, సాయంత్రం వారు అగ్నిశిక్షకు గురిచేయబడతారు.

(ఆ) ఇంకా ప్రళయం సంభవించిన రోజు, కఠినాతికఠినమైన శిక్షకు గురిచేయండని ఆదేశించబడుతుంది.

ప్రళయం రోజు వారిని కఠినాతికఠినమైన శిక్షకు గురిచేయటానికి ఆదేశింపబడుతుందంటే, అంతకు ముందు వారు ఉదయం సాయం కాలాలు అనుభవించే అగ్ని శిక్ష దేనికి సంబంధించినది? ఇది ప్రళయానికి సంబంధించిన శిక్ష కాదనేది తెలుస్తూనే ఉంది. ఎందుకంటే ఇంకా ప్రళయం సంభవించలేదు, కఠినశిక్షకు ఆదేశించబడలేదు, దానికి బదులు ఇది ప్రళయంకంటే ముందే ఇవ్వబడుతున్న శిక్ష. అందుకని ప్రళయంరోజు ఫిర్ఔను జాతి మరణానికి మధ్య గల వ్యవధి లేక కాలమే బర్జఖ్.

2. ఆయతులోని మొదటి భాగం 'అనగా' ఉదయం సాయంత్రపు శిక్ష, రెండవ భాగం అనగా ప్రళయం రోజు వారికి కఠినాతికఠినమైన శిక్షకు ఆదేశం- ఈ రెండూ కూడా ప్రళయానికి సంబంధించినవే అయి ఉంటే, ఈ రెండు భాగాల కూర్పు భిన్నంగా ఉండేది. అంటే ఇలా 'ఏ రోజైతే ప్రళయం సంభవిస్తుందో వీరిని కఠినాతికఠినమైన శిక్షకు గురిచేయండి (అని ఆదేశించబడుతుంది) కావున ఈ ఆదేశానుక్రమం వారు ఉదయం,

సాయంకాలాలు అగ్నిశిక్షకు గురిచేయబడతారు'' కాని దైవం అలా ఆదేశించలేదని తెలుసు.

4. ఆయత్ మొదటిభాగం, ఉదయం సాయంకాలం అగ్ని శిక్షకు గురిచేయటమనేది ప్రళయానికి సంబంధించిన విషయమనుకుంటే, ప్రళయంలో తిరస్కారులకు విధించే శిక్ష నిరంతరమైనదికాక, అప్పుడప్పుడు అనగా ఉదయం సాయంకాలాలు మాత్రమే విధించబడుతుందని ఒప్పుకో వలసి వస్తుంది. కాని ఈ విషయం ఖుర్ఆన్ వివరణలకు పూర్తిగా వ్యతిరేకం. వారి శిక్షకు సంబంధించి పదేపదే వివరించింది. ''లా యుఫ్ తరూ'' మరియు ''లా యుఖప్ఫఫూ'' అంటే ఒక్క సెకండు కొరకు కూడా ఆపనూబడదు, తగ్గించనూ బడదు. ఉదయం, సాయంత్రం అంటే నిరంతరమే అవుతుంది కదా అని చెప్పి, పై అభ్యంతరాన్ని త్రోసిపుచ్చటానికి వీల్లేదు. దీని సమర్థనకు ఖుర్ఆన్‌లో 'స్వర్గవాసుల' కోసం చెప్పబడిన ఈ ఆయతును కూడా ఉటంకించటానికి అవకాశం లేదు.

وَلَهُمْ رِزْقُهُمْ فِيهَا بُكْرَةً وَعَشِيًّا

"(స్వర్గంలో) వారి ఆహారం వారికి ఉదయం, సాయంత్రం నియమం తప్పకుండా లభిస్తూ ఉంటుంది."
(మర్యమ్- 62)

పై ఆయతులో స్వర్గవాసుల భోజన వసతి గురించి చెబుతూ వారికి ఉదయం, సాయంత్రం భోజనం లభిస్తుందని చెప్పటం జరిగింది. సామా న్యంగా మానవులు, ప్రత్యేకించి అరబ్బులు ఉదయం, సాయంత్రం రెండు పూటలు భుజిస్తారు. కనుక ఈ సర్వసాధారణ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, స్వర్గవాసుల గురించి అలా చెప్పటం జరిగింది. కాని అనేకచోట్ల స్వర్గవాసులు అన్నివేళల్లో ఏది కోరితే అది తినగలరని ఖుర్ఆన్ అనేకచోట్ల వివరించింది. ఈ అన్నివేళలు అనే పదానికి, స్వర్గవాసుల దవడలు నిరంతరం నడుస్తుంటా

యని, ఒక సెకండు కోసం కూడా అవి ఆగవని అర్థం కాదుగా! ఇలా నిరం తరం తింటూనే ఉండాలని కనుక ఆజ్ఞాపించబడితే స్వర్గం కూడా నరక తుల్యంగా మారుతుంది.

అయితే నరకవాసులకు సంబంధించినంతవరకు ఈ అన్నివేళలు, నిరంతరంలాంటిది కాదు. స్వర్గవాసులకయితే భోజనం, ఫలాలు ఎల్లప్పుడూ నిరంతరం వారి ఆధీనంలోనే ఉంటాయి. వారు కోరినప్పుడల్లా వాటిని తినిగలుగుతారు. కాని నరకవాసుల శిక్ష కూడా అలాంటిదేనని వారు కోరుకున్నప్పుడు రోజుకు రెండు మూడుసార్లు వెళ్ళి శిక్షకు గురయి వస్తారని చెప్పగలమా?

4. పై ఆయతులో ఒక చోట శిక్ష అని, ఇంకొక చోట కఠినశిక్ష అని వచ్చింది. శిక్ష అనే పదాన్ని అతిశయింపజేసే పదం కఠినశిక్ష. మొదటి భాగాన్ని ప్రళయ సందర్భంలో వచ్చినదని- (మౌలానాగారు భావించినట్లు)- అనుకుంటే, నరకానికి మించిన కఠినశిక్ష ఇంకెక్కడుంటుంది? వీటన్నిటి ద్వారా అర్థమయిందేమిటంటే మొదటి భాగంలో పేర్కొన్న కేవలం ఉదయం, సాయంత్రం ఇవ్వబడే శిక్ష బర్జఖ్‌కు సంబంధించినది, రెండవ భాగంలో పేర్కొన్న కఠినశిక్ష, నిరంతర శిక్ష ప్రళయదినాన లభిస్తుందనేది అన్ని విధాలా సమంజసం. ఈవిధంగా ఉంటేనే ఆయతు అన్నివిధాలా అర్థవంతంగా ఉంటుంది.

పై కారణాల దృష్ట్యా పై ఆయతుకు సరియైన అనువాదమిది:

وَحَاقَ بِآلِ فِرْعَوْنَ
سُوءُ الْعَذَابِ النَّارُ يُعْرَضُونَ
عَلَيْهَا غُدُوًّا وَعَشِيًّا وَيَوْمَ

"ఫిర్ఔన్ అనుచరగణాన్ని చెడ్డ శిక్ష చుట్టుముట్టింది. వారు ఉదయం, సాయంత్రం అగ్ని శిక్షకు గురిచేయ బడతారు, ఇక ప్రళయం సంభవించినరోజు, 'ఫిర్ఔను జాతిని ఇంత

تَقُوْمُ السَّاعَةُ اَدْخِلُوْٓا اٰلَ فِرْعَوْنَ اَشَدَّ الْعَذَابِ

కన్నా కఠినశిక్షకు గురి చేయండని' ఆదేశించబడుతుంది."
(అల్‌మోమిన్- 46)

పై ఆయతులో వివరంగా, ఎలాంటి సందేహం లేకుండా రెండు శిక్షల గురించి ప్రస్తావించటం జరిగింది. ఒకటి ప్రళయానికి ముందు, ప్రస్తుతం వారు అనుభవిస్తున్న- ఉదయం, సాయంత్రం నరకాగ్నికి గురి చేయబడటం అనే శిక్ష. రెండవది ప్రళయం రోజు, దైవాదేశాన్ని అనుసరించి, నిరంతరంగా, కఠినాతికఠినంగా మొదటి శిక్షకు మించి లభించే శిక్ష.

"ఫరదన్- ఫురాదా' (ఒక్కొక్కరుగా)

'బర్‌జఖ్'లో లభించే శిక్షకు నిరూపణ కోసం 'మఆరిఫ్' ఈ రెండవ ఆయతును పేర్కొంది.

وَلَوْ تَرٰٓى اِذِ الظّٰلِمُوْنَ فِيْ غَمَرٰتِ الْمَوْتِ وَالْمَلٰٓئِكَةُ بَاسِطُوْٓا اَيْدِيْهِمْ اَخْرِجُوْٓا اَنْفُسَكُمُ اَلْيَوْمَ تُجْزَوْنَ عَذَابَ الْهُوْنِ بِمَا كُنْتُمْ تَقُوْلُوْنَ عَلَى اللّٰهِ غَيْرَ الْحَقِّ وَكُنْتُمْ عَنْ اٰيٰتِهٖ تَسْتَكْبِرُوْنَ وَلَقَدْ جِئْتُمُوْنَا فُرَادٰى كَمَا

"ఈ దుర్మార్గాలు మరణవేదనలో మునిగితేలుతూ ఉండగా, దైవ దూతలు తమ హస్తాలను చాచి, 'ఇటుతెండి! బయటకు తియ్యండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అపనిందను మోపి అన్యాయంగా కూసిన కూతలకూ, ఆయన ఆయతులపట్ల తలబిరుసుతనం ప్రదర్శించినందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడు తుంది" అని అంటూ ఉండగా ఆ దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుంటుంది! (అప్పుడు అల్లాహ్

خَلَقْنٰكُمْ اَوَّلَ مَرَّةٍ وَّتَرَكْتُمْ
مَّا خَوَّلْنٰكُمْ وَرَاءَ ظُهُوْرِكُمْ
وَمَا نَرٰى مَعَكُمْ شُفَعَاءَكُمُ
الَّذِيْنَ زَعَمْتُمْ اَنَّهُمْ فِيْكُمْ
شُرَكٰٓؤُا

ఇలా సెలవిస్తాడు)మేము మొదటి సారిగా మిమ్మల్ని ఒంటరిగా సృష్టించినట్లే ఇప్పుడు ఇదిగో మీరు ఒంటరిగా మా ముందు హాజరయ్యారు. మేము ప్రపంచంలో మీకు ఇచ్చిందంతా, మీరు అక్కడే వదిలి పెట్టి వచ్చారు. ఇప్పుడు మీవెంట మీ పనులు నెరవేరటంలో కొంత పాత్ర ఉందని మీరు భావించిన మీ సిఫారసు దారులను కూడా మేము చూడటంలేదు."

(అల్‌అన్‌ఆమ్- 94)

పై ఆయతులోని మూడు సందర్భాలను ఉటంకిస్తూ 'మఆరిఫ్' ఇలా వాదించింది.

1. మరణ సమయం నుండే శిక్షకు సంబంధించిన సూచనలు కనబడుతుంటాయని ఇందులో వివరించటం జరిగింది.

2. నేటినుండే అనగా మరణసమయం నుండే పరాభవ శిక్ష ప్రారంభమయిందని, ఇదే 'బర్‌జఖ్' శిక్ష అని తెలుపటం జరిగింది.

3. ఇందులో 'ఫురాదా' అనే పదం, అంటే ఒక్కొక్కరుగా మీరు వచ్చారని వాడబడింది. ఈ ఒక్కొక్కరుగా రావటమనేది మరణానికి సంబంధించినదే తప్ప ప్రళయానికి సంబంధించికాదు. ప్రళయం రోజైతే ఒక్కొక్కరుగా (లేక ఒకరి తరువాత మరొకరు) రారు. గుంపులు, గుంపులుగా వస్తారు. ఈ గుంపులు గుంపులుగా రావటమనే పదం, ప్రళయ సన్నివేశాల సందర్భాల్లో అనేకసార్లు ఉపయోగించటం జరిగింది.

పై ఆయతులను రచయిత (అస్లం జేరాజ్‌పూరిగారు) ప్రళయ

దినానికి సంబంధించిన సంఘటనగా భావిస్తున్నారు. వాస్తవంగా ఇందులో ప్రళయానికి సంబంధించి ఒక్కమాట కూడా రాలేదు. ఈ సందర్భంలో 'మఆరిఫ్' వాదనకు సమాధానమిస్తూ 'మృత్యువు మరియు ప్రళయానికి మధ్య (మృతులకోసం) కాలవ్యవధి లేదు (ఆయన దృష్టిలో) కనుక 'ఈరోజు' అని దేన్నైతే పేర్కొనటం జరిగిందో, అది ప్రళయం రోజే అని ఆయన వాదిస్తారు. 'అల్‌యౌమ్' అంటే 'ఈరోజు'- ఈ రోజు అనేది సంఘటనను అనగా మరణం జరిగినరోజునే తెలుపుతుందని, అందుకని దీనిభావం, మరణంనుండి ప్రారంభమయిన కాలమేనని మా వాదన. పై ఆయతు అను వాదాన్ని నిష్పక్షపాతంగా, నిర్మల మనస్సుతో చదివి, ఈ రెండు వాదనల్లో ఏది సరియైనదో చదువరులే నిర్ణయించాలి.

ఒక్కొక్కరుగా రావటం అనేది మరణం తరువాత సన్నివేశమని, ప్రళయానికి సంబంధించిందికాదని 'ఫురాదా' (ఒక్కొక్కరుగా) అనే పదం ఆధారంగా మేము వాదించాము. దీన్ని ఖండించటానికి ప్రతివాది అయిన రచయిత గారు ఈ క్రింది రెండు ఆయతులను సూచించారు.

وَحَشَرْنَاهُمْ فَلَمْ نُغَادِرْ مِنْهُمْ أَحَدًا وَعُرِضُوا عَلَىٰ رَبِّكَ صَفًّا لَّقَدْ جِئْتُمُونَا فُرَادَىٰ كَمَا خَلَقْنَاكُمْ أَوَّلَ مَرَّةٍ

"(ఆది మానవులలో, అంత్య మానవులలో) ఒక్కరు కూడా మిగిలి పోకుండా మేము మానవులందరినీ చుట్టుముట్టి సమావేశ పరుస్తాము. వారంతా నీ ప్రభువు సాన్నిధ్యంలో వరుసలు, వరుసలుగా ప్రవేశపెట్ట బడతారు. ఇదిగో చూడండి, మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించిన స్థితిలోనే మీరు మా వద్దకు వచ్చేశారు కదా!" (అల్ కహఫ్- 48)

పై ఆయతు ద్వారా ప్రళయంరోజు ఒక్కొక్కరుగా రావటమనేది నిరూపితమయింది. కాని 'జ్ఞానవంతులు' ఒక నిమిషం ఆగి ఇక్కడ పరిశీలించమనవి. సూరా కహ్ఫ్‌లోని 48వ ఆయతుగా దీన్ని పేర్కొనటం జరిగింది. అరబ్బీ చదవవచ్చిన ప్రతి ముస్లిం ఈ ఆయతును పరిశీలించాలని మనవి. ఇందులో ఎక్కడా కూడా 'పురాదా' అనే పదం కనబడదు. ఇందులో "లఖద్- జీతుమూనా కమా ఖలఖ్‌నాకుమ్ అవ్వల మర్రతిన్"

لَقَدْ جِئْتُمُوْنَا كَمَا خَلَقْنٰكُمْ اَوَّلَ مَرَّةٍ

(మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించిన స్థితిలోనే మీరు మా వద్దకు వచ్చేశారు కదా!

(అల్ కహఫ్- 48)

అని వచ్చింది.

ప్రళయానికి సంబంధించిన ఈ ఆయతులో దైవం ముందు ఒంటరిగా, దిక్కులేని వారిగా రావటం గురించి తెలుపటం జరిగిందనుకోండి. ఈ ఆయతు ఆధారంగా దైవం ముందుకు వెళ్ళటం, ధనైశ్వర్యాలు, భార్యాపిల్లల్ని విడిచివెళ్ళటమనేది ఖుర్ఆన్‌లో వచ్చిన ప్రస్తావన, ప్రళయానికి మాత్రమే సంబంధించినదని వాదించటం సరికాదు. మరణానంతరం కూడా దైవం ముందుకు వెళ్ళటం, ధనైశ్వర్యాలు, భార్యాపిల్లల్ని విడిచివెళ్ళటమనేది ప్రస్తావించబడింది.

كَلَّآ اِذَا بَلَغَتِ التَّرَاقِيَ وَ قِيْلَ مَنْ رَاقٍ وَّ ظَنَّ اَنَّهُ الْفِرَاقُ وَالْتَفَّتِ السَّاقُ

"ఎంతమాత్రంకాదు, ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు, మంత్రించి ఊదే వారెవరైనా ఉన్నారా అని అనబడినప్పుడు, ఇది ప్రపంచం నుండి వేరైపోయే సమయమని మనిషి తెలుసుకుంటాడు. ఒక కాలుతో మరొక కాలు కలిసిపోయి

నప్పుడు, అది నీ ప్రభువువైపునకు తరలిపోయే రోజు అవుతుంది."
(అల్ ఖియామహ్: 26-30)

بِالسَّاقِ اِلٰی رَبِّکَ یَوْمَئِذِنِ الْمَسَاقُ (القیمۃ)

"అవ్వల మఱ్రతిన్" (మొదటిదఫా జననం) అనే పదం వాడబడటాన్ని బట్టి ఇది ప్రళయ సందర్భంగా వచ్చిన ఆయతు అని తెలుస్తుంది అనటం సమంజసంకాదు. ఎందుకంటే రెండవజనన పరిస్థితులనైతే (ప్రళయం తరువాత జననం) మానవుడు చూడలేదు. అందుకనే అతని మొదటి జననపు ఒంటరితనం, దీనత్వానికి సంబంధించి ఉదహరించటం సందర్భో చితంగాను, అర్థవంతంగాను ఉంటుంది. ప్రతి మనిషి, అన్ని సమయాల్లో (మరణించి ఒంటరిగా పోతున్నదాన్ని) పరిశీలిస్తూనే ఉంటాడు. మనిషి ఒంటరితనం అనేది మరణ సమయంలో నైనా, ప్రళయ సందర్భంలోనిదైనా పరిస్థితి మాత్రం ఒక్కటే.

"మఆరిఫ్" సంపాదకుని వాదనను, చివరగా ఈ విధంగా ఆయన గారు ఖండించారు.

"మఆరిఫ్" సంపాదకుల వాదనకు ఆధారం 'ఫురాదా' అనే పదం. ప్రజలు ఒంటరిగా 'బర్జఖ్'లోకైతే వెళ్తారు, గాని ప్రళయంలో ఒక్కొక్కరుగా వెళ్ళరు, దానికి బదులు గుంపులు, గుంపులుగా వెళ్తారు. అందుకని ఈ పదం ద్వారా అది 'బర్జఖ్' శిక్షే అనేది ఆయన భావన. ప్రళయదినానికి సంబం ధించి బహుశా ఇది మాత్రమే ఆయన చూసి ఉంటారు. "ఫతఅ తూన అఫ్వాజా" (అనగా మీరు గుంపులు గుంపులుగా వస్తారు). కాని దీనిపై ఆయనగారి దృష్టి పడనట్లుంది. "కుల్లుహుమ్ ఆతీహి యౌముల్ ఖియామతి ఫరదా" ప్రళయం రోజు వారిలో ప్రతి ఒక్కరూ ఒంటరిగా వస్తారు (మర్యమ్- 95).

'మఆరిఫ్' సంపాదకుడు ప్రళయానికి సంబంధించి దీన్నీ, ఇలాంటి ఇతర అనేక ఆయతులనూ చూశాడు. దానితోపాటే సాహిత్యం, వ్యాకరణాల అధ్యయనం కూడా చేశాడని విన్నవిస్తున్నాం.

'బర్‌జఖ్' నిరూపణకోసం, మఆరిఫ్ సంపాదకుడు, అల్‌అన్‌ఆమ్ సూరాలోని 94వ ఆయతులోని ఏ పదాన్ని తన వాదన కోసం వాడారో, అది 'ఫరదన్' కాదు ఫురాదా. ప్రళయానికి సంబంధించి ఖుర్‌ఆన్‌లో ఎక్కడా 'ఫురాదా' అనే పదం రాలేదు. ప్రళయానికి సంబంధించి ఆ ఒక్క ఆయతులో మాత్రం 'ఫురాదా' అనే పదం వచ్చిందని ఆయనగారు పేర్కొన్నారో, అది ఆయనగారి ద్వారా కాకతాళీయంగానో ఉద్దేశ పూర్వకంగానో జరిగిన లేఖ నా దోషము. దాన్ని అప్పుడే, అక్కడే సూచించటం జరిగింది. ఈ ఆయతులో ప్రళయానికి సంబంధించి 'ఫరదన్' అనే పదం వచ్చింది. 'ఫురాదా' అనేది 'ఫరదన్' అనే పదానికి బహువచనం, అందుకని ఇవి రెండు కూడా ఒకే అర్థాన్నిచ్చే పదాలు, కనుక ప్రళయ సందర్భంలో ఎక్కడైనా "ఫరదన్" అని వచ్చిందంటే, అది 'ఫురాదా'గా లెక్కించవచ్చని వ్యాసరచయితగారు మోసపోయారు.

ప్రాచీన వ్యాఖ్యానకర్తలు మాకూ, ఆయనకూ ఎంత వ్యతిరేకంగా ఉన్నా వారి అభిప్రాయాలు మా ఇరుపక్షాల వారెవరికీ ప్రామాణికం కాజాలవు. కాబట్టి సాహిత్యం, వ్యాకరణం ఇంకా మాట్లాడితే స్వయంగా ఖుర్‌ఆన్‌నే ఆశ్రయించాల్సి ఉంటుంది.

'ఫురాదా' అనేది నిస్సందేహంగా బహువచనమే. కాని కొందరు అది పర్దాన్‌కు బహువచనమని మరికొందరు 'ఫరీద్'కు బహువచనమంటారు. ఇంకొందరు వ్యాకరణానుసారం 'ఫర్‌దాన్' అని పేర్కొన్నారు. అంటే ఫరదన్‌కు బహువచనం 'ఫురాదా' అనేది సర్వసమ్మతం కాదని తేలిపోయింది. అత్యధికులు 'అఫ్‌రాద్' "ఫురాదా" రెండింటిని "ఫరదన్"కు బహువచనంగా పేర్కొన్నారు. అయితే ఈ రెండు పదాల అర్థం మరియు దాని ప్రయోగంలో గొప్ప తేడా వుంది. అఫ్‌రాద్ సర్వసామాన్యమైన బహువచనం. 'ఫురాదా' అనేది అనుచ్చారితమైనది, వాడుకలో లేనిది, ఆలోచనకు రానిది. ఫలానా

వ్యక్తి 'ఫరదన్' అయిపోయాడు లేక ఫలానా వ్యక్తి'ఫరదన్'గా వస్తాడు అంటే అర్థం అతను ఒంటరివాడైపోయాడు. సన్నిహితులు, శ్రేయోభిలాషులు లేనివాడు, బాగోగులు విచారించేవారు లేనివాడైపోయాడు అని. దీనికి దృష్టాంతంగా ఖుర్ఆన్‌లోని ఈక్రింది ఆయతును గమనించండి.

وَزَكَرِيَّا إِذْ نَادَىٰ رَبَّهُ رَبِّ لَا تَذَرْنِي فَرْدًا وَأَنتَ خَيْرُ الْوَارِثِينَ فَاسْتَجَبْنَا لَهُ وَوَهَبْنَا لَهُ يَحْيَىٰ

"మరియు జకరియ్యాను కూడా అనుగ్రహించాము. అప్పుడు అతను తన ప్రభువును ఇలా వేడుకున్నాడు, "ప్రభూ! నన్ను ఒంటరివాడు (సంతాన హీనుడు)గా విడిచిపెట్టకు. మేలైన వారసుడవు నీవు మాత్రమే'. మేము అతని ప్రార్థనను అంగీకరించాము మరియు అతనికి యాహ్యాను ప్రసాదించాము."

(అల్అంబియా- 89)

పై ఆయతులో కూడా 'ఫరదన్' ఒంటరిగా అంటే వారసుడుగాని, శ్రేయోభిలాషిగాని, సంతానంగాని లేకపోవటమనే అర్థంలోనే వాడబడింది.

ఇతర అనాగరిక జాతుల్లాగే అరబ్బులు కూడా సంతానం ప్రత్యేకించి మగ సంతాన ఆధిక్యతపై గర్వపడేవారు. ఇది వారి కుటుంబం యొక్క పోరాటశక్తిగా పరిగణింపబడేది. ప్రళయం రోజు ఎవరూ, ఎవరికీ సహాయ పడరని, ప్రతివాడు తనదితానే చూసుకుంటాడని, అక్కడ తండ్రీకొడుకుల మధ్య ఎలాంటి సంబంధముండదని దైవసాన్నిధ్యంలో ప్రతివాడూ ఒంటరిగా, తనకుతానే బాధ్యత వహించాల్సి ఉంటుందని దైవం ఉపదేశిస్తున్నాడు. వంశం, అనుచరులు, జాతివారు ఉన్నప్పటికి వీరెవరితోను ఆయనకు ప్రేమ సంబంధాలు లేనందువల్ల హజ్రత్ జకరియ్యా(అలై) తనకుతాను ఒంటరిగా భావించారు. ప్రళయంరోజు కూడా, గుంపులు

గుంపులుగా మానవులు వచ్చినప్పటికి అపరిచితులుగానే ఉంటారు. ఒకరికి వేరొకరితో ఎలాంటి సంబంధముండదు.

فَإِذَا نُفِخَ فِي الصُّورِ فَلَا أَنسَابَ بَيْنَهُمْ يَوْمَئِذٍ (مومنون ١٠١)

"తరువాత శంఖం ఊదబడినంతనే వారి మధ్య ఏ బంధుత్వమూ ఉండదు, వారు ఒకరినొకరు పరామర్శించుకోరు."

(మూ'మినూన్- 101)

ఈ వివరణ తరువాత, ప్రళయం రోజు ప్రతి వ్యక్తి ఏకాకిగా, ఒంటరి వాడై వస్తాడని ప్రస్తావించబడిన సందర్భాన్ని పరిశీలించండి. మేము ధనైశ్వ ర్యాలు, సంతానం కలిగిన వారమని గర్వపడే అవిశ్వాసుల గురించి పేర్కొంటూ దైవం వారికిలా సమాధానమిచ్చాడు.

أَفَرَأَيْتَ الَّذِي كَفَرَ بِآيَاتِنَا وَقَالَ لَأُوتَيَنَّ مَالًا وَوَلَدًا ۝ أَطَّلَعَ الْغَيْبَ أَمِ اتَّخَذَ عِندَ الرَّحْمَٰنِ عَهْدًا ۝ كَلَّا سَنَكْتُبُ مَا يَقُولُ وَنَمُدُّ لَهُ

"ఇంకా మా ఆయతులను తిరస్క రించి, 'నేను సంపదతోనూ, సంతానం తోనూ అనుగ్రహింపబడు తూనే ఉంటాను. అని ప్రగల్భాలు పలికే వ్యక్తిని నీవు చూశావా? అగో చర విషయమేమైనా అతనికి తెలిసి పోయిందా లేక కరుణామయుడి నుండి అతడేమైనా వాగ్దానం పొంది ఉన్నాడా? ఎంతమాత్రం కాదు, అతడు వాగే దానిని మేము వ్రాసు కుంటాము. అతడి శిక్షను మరింత పెంచుతాము, అతడు ప్రస్తావిస్తున్న టువంటి వస్తుసామగ్రి, మందీమార్బ

مِنَ الْعَذَابِ مَدًّا ○ وَنَرِثُهُ مَا يَقُولُ وَيَأْتِينَا فَرْدًا ○

లమూ, అంతా తిరిగి మా వద్దకే చేరి పోతుంది. అతడు ఒక్కడే ఒంటరిగా మా ముందు హాజరవుతాడు."

(మర్యమ్- 77- 80)

ఈ సమాధానపు చివరి భాగంలో ఇలా పేర్కొనటం జరిగింది.

وَكُلُّهُمْ آتِيهِ يَوْمَ الْقِيَامَةِ فَرْدًا ○

"ప్రళయంనాడు అందరూ ఆయన ముందు ఒక్కొక్కరే హాజరవుతారు."

(మర్యమ్- 95)

ప్రళయంరోజు ప్రతి వ్యక్తి ఏకాకియై వస్తాడని ప్రస్తావించబడిన ఆయతు సారాంశమిది. కాని 'మఆరిఫ్' తన వాదనకు సహాయకారిగా తీసుకున్న ఆయతులో 'ఫరదన్'కు బదులు 'ఫురాదా' ఉపయోగించ బడింది, ఇది అనుచ్చారితమైంది, సామాన్యంగా వాడబడని బహువచన మని ఇంతకుముందే తెలిపాము. దీన్ని 'ఒక్కొక్కరుగా' అనే అర్థంలో తీసుకోవటం జరిగింది. ఉదాహరణకు మసన్నా, సలాస, వరుబఅ- అంటే ఒక్కొక్కరుగా, ఇద్దరేసి, ముగ్గురేసి, నలుగురేసి. ఈవిధంగానే 'ఫురాదా' అనే పదాన్ని 'ఒక్కొక్కరుగా' అనే అర్థంలో వాడబడిన వేరొక సందర్భాన్ని పరిశీలించండి.

قُلْ إِنَّمَا أَعِظُكُم بِوَاحِدَةٍ أَن تَقُومُوا لِلَّهِ مَثْنَىٰ وَفُرَادَىٰ ثُمَّ تَتَفَكَّرُوا مَا بِصَاحِبِكُم مِّن جِنَّةٍ

"ప్రవక్తా! వారితో ఇలా అను. "నేను మీకు ఒక విషయాన్ని బోధిస్తు న్నాను. అల్లాహ్ కోసం, మీరు ఒక్కొ క్కరూ, ఇద్దరిద్దరూ కలిసి మీ మేధను ఉపయోగించి ఆలోచిం చండి, అసలు మీ సహచరుని మాట లలో పిచ్చితనం ఏముందో అని?"

(సబా- 46)

ఇందులో ధనైశ్వర్యాలు, సంతానం, బంధుమిత్రుల్ని విడిచి 'ఒంటరి'గా వెళ్ళే ప్రస్తావనే లేదు. 'ఫురాదా' అనేది ఒక్కొక్కరుగా అనే అర్థంలోనే ఉపయోగించటం జరిగింది.

ఈ క్రింది ఆయతును తిలకించండి.

لَقَدْ جِئْتُمُونَا فُرَادَىٰ كَمَا خَلَقْنَاكُمْ أَوَّلَ مَرَّةٍ

"మేము మొదటిసారి మిమ్మల్ని ఒంటరిగా సృష్టించినట్లే ఇప్పుడు ఇదిగో మీరు ఒంటరిగా (లేక ఒకరి తరువాత ఇంకొకరుగా) మా ముందు హాజరయ్యారు."

(అల్అన్ఆమ్- 94)

మీలోనుండి ప్రతి ఒక్కరు ఒక్కొక్కరుగా, ఒంటరిగా, ఒకరి తరువాత మరొకరు ఎలా వెళ్ళారో అదేవిధంగా తిరిగి ఒక్కొక్కరుగా, ఒంటరిగా, ఏకాకియై ఒకరి తరువాత మరొకరు మా వద్దకు వచ్చారు. ఇది మృత్యు సమయపు పరిస్థితిని మాత్రమే సూచిస్తుంది తప్ప ప్రళయానికి కాదు. ప్రళయంలో జనులు ఒక్కొక్కరుగా, ఒంటరిగా, ఒకరి తరువాత మరొకరు వెళ్ళరు. దానికి బదులు గుంపులు గుంపులుగా వెళతారు. కాని అందులోని ప్రతి వ్యక్తి ఏకాకిగా ఉంటాడు, ఒంటరివాడై ఉంటాడు, ఎవరూ సన్నిహితుడూ శ్రేయోభిలాషిలేనివాడై ఉంటాడు.

ప్రాచీన నిఘంటుకర్తలైన ఇబ్నెదరీద్, సహాయె జౌహరి, లిసానుల్ అరబ్ ఇబ్నుల్ మంజూర్లాంటి వారందరూ "ఫురాదా" అంటే ఒక్కొక్కరుగా, ఒకరి తరువాత ఒకరు అనే అర్థమే చెప్పారు.

ఇక ఒక్కొక్కరుగా రావటం, ఒకరి తరువాత మరొకరు రావటం అనే సన్నివేశం మరణానంతరం 'బర్జఖ్'ను సూచిస్తున్నదా లేక ప్రళయదినాన్ని సూచిస్తున్నదా? నిస్సందేహంగా ఈ సన్నివేశం మరణం, మరణానంతరం 'బర్జఖ్'ను సూచించేది మాత్రమే, ప్రళయం ఎంతమాత్రం కాదు, అంతే కాదు, ఈ ఆయతు ప్రారంభంలోనే స్పష్టంగాను, వివరంగాను 'మరణపు' సన్నివేశాన్ని చూపించటం జరిగింది. ఇక్కడ ప్రళయానికి సంబంధించిన

చూచాయలు కూడా లేవు. ఒకసారి పాఠకులు ఈ ఆయతును గమనించ మనవి.

"ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగి తేలుతూ ఉండగా, దైవదూతలు తమ హస్తాలను చాచి 'ఇటుతెండి! బయటకు తియ్యండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అపనిందను మోపి అన్యాయంగా కూసిన కూతలకూ, ఆయన ఆయతులపట్ల తలబిరుసుతనం ప్రదర్శించినందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతున్నది' అని అంటూ ఉండగా, ఆ దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుంటుంది! (అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు)' మేము మొదటిసారి మిమ్మల్ని ఒంటరిగా సృష్టించినట్లే ఇప్పుడు ఇదిగో మీరు ఒంటరిగా మాముందు హాజరయ్యారు. మేము ప్రపంచంలో మీకు ఇచ్చినదంతా, మీరు అక్కడనే వదిలిపెట్టి వచ్చారు. ఇప్పుడు మీ వెంట మీ పనులు నెరవేరటంలో కొంత పాత్ర ఉందని మీరు భావించిన మీ సిఫారసుదారులను కూడా మేము చూడటం లేదు." (అల్ అన్ఆమ్- 94)

పై ఆయతులో వివరించబడిన విషయాలన్నీ కేవలం మరణ సమయపు సన్నివేశాన్ని, బర్జఖ్‌ను మాత్రమే పేర్కొంటున్నాయి. ఈ ఆయతులోని ఒక్కొక్క వాక్యం దీనికి నిదర్శనం.

దైవం ఉపదేశించిన "వలఖద్ జీతుమూనా ఫురాదా" అనే దాన్ని కాస్సేపటికోసం ప్రళయ సంఘటనగాను, ఫురాదాకు అర్థం ఒంటరిగాను అని ఊహించుకున్నా, పైనుదహరించిన ఆయతులో 'బర్జఖ్'కు సంబంధించి ఖచ్చితమైన సాక్ష్యం లభించినప్పుడు, 'అల్‌యౌమ్'లాంటి సంబంధంలేని విషయం ద్వారా 'బర్జఖ్'ను ఖండించలేము. అదీగాక ఈ 'అల్‌యౌమ్'లోని మాటలు ఏమాత్రం కాలజ్ఞానంలేని, బర్జఖ్‌లో ఉన్న పాపిష్టి మానవులవి కావు, దైవదూతలు చెప్పినవి.

- సయ్యద్ సులైమాన్ నద్వీ

5 జిల్‌హజ్జ హి.శ. 1353

4. బర్జఖ్- ఇంకో కోణం

(మౌలానా అస్లం జిరాజ్‌పూరి)

ముహర్రం మాసపు "తర్జుమానుల్ ఖుర్ఆన్"లో మౌలానా సయ్యద్ సులేమాన్ నద్వీగారు బర్జఖ్‌కు సంబంధించిన నా వ్యాసంపై అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఇది 'మఆరిఫ్'కు ప్రత్యుత్తరం అనుకోవటం ఆయన చేసిన మొదటి పొరపాటు. బర్జఖ్‌కు సంబంధించి రెండవసారి కాస్త వివరంగా వ్రాస్తున్న ఈ వ్యాసం 'మఆరిఫ్'కు జవాబు కాదని, దాని శైలి హర్షించ దగినదిగా లేనందువల్ల, దానికి జవాబు ఇవ్వటానికి నేను ఇష్టపడటం లేదని వ్యాసం ప్రారంభంలోనే పేర్కొన్నాను.

కాని 'తర్జుమానుల్ ఖుర్ఆన్'లో సయ్యద్ సాహబ్‌గారి శైలి 'మఆరిఫ్'కు భిన్నంగా ఉన్నందున, ఆయనగారి వ్యాసానికి ప్రత్యుత్తర మిస్తున్నాను. ఆయనగారు ఈ వాదానికి కేవలం మూడు ఆయతుల వరకు పరిమితంచేసి మంచిపనే చేశారు. అందుకని ఈ మూడు ఆయతులలోని ప్రతి ఆయత్‌ను ఖుర్ఆన్‌ద్వారానే వివరిస్తాను. దివ్యఖుర్ఆన్ వాస్తవాలను నిర్మల మనస్సుతో పరిశీలించాలని, అవి ఏ విధంగా ఉన్నా, ఏ రూపంలో ఉన్నా, వాటిని స్వీకరించాలనే సూత్రం గురించి ప్రథమంగా పేర్కొనటం ముఖ్యమనుకుంటున్నాను. ఈ సందర్భంలో సయ్యద్ సాహబ్ ఇంకా

ఆయనలాంటి పూర్వీకులను అనుకరించేవారితో నాకు వ్యతిరేకత ఉంది. ముందే ఒక విషయాన్ని నిర్ణయించుకొని, ఖుర్‌ఆన్ అధ్యయనం చేయటం దాని ఆయతులను విరిచి తమ ఇష్టానుసారం మలుచుకోవటమనేది నిషేధితమేకాదు, నాస్తికత్వంగా భావిస్తాను. ఈ విషయంలో ఖుర్‌ఆన్‌కు సంబంధించిన గట్టి సాక్ష్యాధారం నా వద్ద ఉంది.

మొదటి ఆయతు

"మేము మొదటిసారి మిమ్మల్ని ఒంటరిగా సృష్టించినట్లే ఇప్పుడు ఇదిగో మీరు ఒంటరిగా మా ముందు హాజరయ్యారు. మేము ప్రపంచంలో మీకు ఇచ్చినదంతా మీరు అక్కడే వదిలిపెట్టి వచ్చారు. ఇప్పుడు మీవెంట మీ పనులు నెరవేరటంలో కొంతపాత్ర ఉందని మీరు భావించిన మీ సిఫారసుదారులను కూడా మేము చూడటంలేదు." (అల్‌అన్‌ఆమ్- 94)

ఈ ఆయతు మొత్తంలో అల్లాహ్ సంబోధిస్తున్నాడు. ఇందులోని ఒక్కొక్క పదం ప్రళయానికి సంబంధించిందే. బర్‌జఖ్‌తో దీనికి ఎలాంటి సంబంధంలేదు. దీని భాగాల్ని విడదీసి, ఆయతుల ద్వారా దీన్ని నిరూపిస్తాను. దీంట్లో మూడు విషయాలు చెప్పబడ్డాయి.

1. మొదటిసారి మిమ్మల్ని మేమెలా పుట్టించామో, అదేవిధంగా మీరు ఏకాకియై మా వద్దకు వచ్చారు. ఇంకా మేము మీకు ప్రసాదించిందంతా మీ వెనుకనే విడిచివచ్చారు.
2. సిఫారసు చేస్తారని మీరు ఊహించుకున్నవారిని మీ వెంట చూడటంలేదు.
3. మీకు సిఫారసు చేస్తారనుకున్నవారికిని, మీకునూ మధ్యగల ఊహాజనిత సంబంధాలు తెగిపోయాయి.

మొదటిసారి మిమ్మల్ని మేమెలా పుట్టించామో, అదేవిధంగా మీరు

ఏకాకియై మా వద్దకు వచ్చారు అనే మొదటిభాగాన్ని తీసుకుందాం. ప్రళయంరోజు నేరస్థుల్ని ఉద్దేశించి దైవం అలా చెబుతాడు. ఇంకో ఆయతులో దీన్నిలాగే వివరించటం జరిగింది.

وَحَشَرْنَاهُمْ فَلَمْ نُغَادِرْ
مِنْهُمْ أَحَدًا وَعُرِضُوا عَلَىٰ
رَبِّكَ صَفًّا ۔ لَقَدْ جِئْتُمُونَا
كَمَا خَلَقْنَاكُمْ أَوَّلَ مَرَّةٍ

(ప్రళయం రోజు) ఒక్కరూ కూడా మిగిలిపోకుండా మేము మానవులందరినీ చుట్టుముట్టి సమావేశపరుస్తాము. వారంతా నీ ప్రభువు సాన్నిధ్యంలో వరుసలు, వరుసలుగా ప్రవేశపెట్టబడతారు. ఇదిగో చూడండి, మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించిన స్థితిలోనే మీరు మా వద్దకు వచ్చేశారు కదా!"

(అల్ కహఫ్- 48)

ఈ ఆయతులో 'ఫురాదా' అనే పదం నిస్సందేహంగా నా పొరపాటు వల్ల దొర్లిపోయింది. కాని నా వాదనకు ఆ పదం ఆధారంకాదు. సూరా అల్‌అన్‌ఆమ్ లోని 95వ ఆయతులో ఈ నేరస్థులరాక గురించి పేర్కొనటం జరిగిందో, ఇది ప్రళయంరోజే సంభవించేదని వివరించటానికి మాత్రమే ఆ ఆయతును పేర్కొనటం జరిగింది. ఇంకా ప్రళయం రోజు ఈ నేరస్థులు దైవంముందు ప్రవేశపెట్టబడినప్పుడు, మొదటిసారి మిమ్మల్ని మేమెలా పుట్టించామో అదేవిధంగా మీరు మా వద్దకు వచ్చారని దైవం వారితో అంటాడు.

సూరా అల్‌అన్‌ఆమ్‌లోని 95వ ఆయతులో ప్రళయానికి సంబంధించిన వివరాలు లేవు. కాని అందులో మొదటిసారి పుట్టుకను దృష్టాంతంగా పేర్కొనటం జరిగింది. మీరు ఒంటరిగా వచ్చారని, మేము మీకు ప్రసాదించిందంతా మీ వెనుక ప్రపంచంలో విడిచి వచ్చారనే సంభాషణ తిరిగి పుట్టిం పబడిన తరువాత అనగా పునరుజ్జీవనంలో జరుగుతుందనేది

మాత్రం నష్టమైపోయింది. మీకు సిఫారసు చేస్తారని నమ్ముకొని, మాకు సహవర్తులుగా మీరు నిలబెట్టినవారు మీతో కనబడటంలేదు అనేది ఈ ఆయతులోని రెండవ భాగం.

నేరస్థులకు ఈ ప్రశ్న కూడా ప్రళయంరోజే వేయబడుతుంది. ఖుర్‌ఆన్‌లో దీనికి సంబంధించి అనేక దృష్టాంతాలున్నాయి. ఉదాహరణకు సూరా అల్‌అన్‌ఆమ్‌లో ఇలా వచ్చింది.

وَيَوْمَ نَحْشُرُهُمْ جَمِيعًا
ثُمَّ نَقُولُ لِلَّذِينَ أَشْرَكُوا أَيْنَ
شُرَكَاؤُكُمُ الَّذِينَ كُنتُمْ
تَزْعُمُونَ

"మేము వారందరినీ సమావేశపరిచే రోజున ముష్రిక్కులను ఇలా అడుగుతాము. "మీరు మీ దైవాలుగా భావించి నిలబెట్టిన ఆ భాగస్వాములంతా ఇప్పుడెక్కడున్నారు?"
(అల్‌అన్‌ఆమ్- 22)

మీకునూ, మీకు సిఫారసు చేస్తారని మీరు ఊహించుకున్న వారి మధ్యనున్న సంబంధాలు తెగిపోయాయి అనేది ఈ ఆయతులోని మూడవ అంశం. ఇది కూడా ప్రళయం రోజే దైవం వారితో అంటాడు.

وَيَوْمَ نَحْشُرُهُمْ جَمِيعًا
ثُمَّ نَقُولُ لِلَّذِينَ أَشْرَكُوا
مَكَانَكُمْ أَنتُمْ وَشُرَكَاؤُكُمْ
فَزَيَّلْنَا بَيْنَهُمْ

మేము వారందరినీ ఒకేసారి మా (న్యాయస్థానంలో) సమావేశపరిచే రోజున షిర్క్ చేసిన వారితో ఇలా అంటాము: "ఆగండి మీరూ, మాకు మీరు భాగస్వాములు కల్పించిన వారూ!" ఆ తరువాత మేము వారి మధ్య ఉన్నటువంటి అపరిచయపు తెరను తొలగిస్తాము."

(యూనుస్- 28)

إِذْ تَبَرَّأَ الَّذِينَ اتُّبِعُوا مِنَ الَّذِينَ اتَّبَعُوا وَرَأَوُا الْعَذَابَ وَتَقَطَّعَتْ بِهِمُ الْأَسْبَابُ

వారు ప్రపంచంలో ఏ నాయకుల, ఏ మార్గదర్శకుల అడుగుజాడలలో నడిచేవారో ఆ నాయకులు, ఆ మార్గదర్శకులు తమ అనుచరులతో ఏమాత్రం సంబంధంలేని విధంగా ప్రవర్తిస్తారు. కాని వారికి శిక్ష మాత్రం తప్పదు. ఇంకా వారి సకల సాధనా సంపత్తుల పరంపర తెగిపోతుంది.

(అల్‌బఖర- 166)

కనుక సూరా అల్‌అన్‌ఆమ్‌లోని 95వ ఆయతులోని ఒక్కొక్క పదం ప్రళయానికి సంబంధించిందే. దీనిలోని ఏ ఒక్కపదం కూడా 'బర్జఖ్'ను సూచించటంలేదు. కాని మన సయ్యద్ సాహబ్ (సయ్యద్ సులేమాన్ నద్వి)గారికి 'ఫురాదా' అనే పదంలో 'బర్జఖ్' శిక్ష కనబడుతున్నది. 'ఫురదన్' అనే పదానికి "ఫురాదా" అనేది బహువచనంగా అంగీకరిస్తూనే వాటి ఉపయోగంలో తేడా తీస్తున్నారు. ప్రళయంరోజు ప్రతి వ్యక్తి ధనైశ్వర్యాలు గాని, సంతానంగాని, బంధుజనంగాని లేకుండా వస్తాడనేది 'ఫరదన్' అనే పదం సూచిస్తున్నదని ఆయన అభిప్రాయం. ఒక 'ఫురాదా' అనే పదానికి అర్థం ఒంటరిగా, ఒక్కొక్కరుగా రావటం అని అంటారు. ఇంకా ఈ పరిస్థితి కేవలం బర్జఖ్‌లోనే సంభవిస్తుందని, ఎందుకంటే ప్రళయంలోనైతే ప్రజలు గుంపులు గుంపులుగా వస్తారని ఆయన వాదన. ఈ సాహిత్య, వ్యాకరణ పరమైన పరిశోధన కోసం ఆయన మూడుపుటలు కేటాయించారు. కాని 'ఫురాదా' అనే పదభావాన్ని వివరిస్తున్న ఈ ఆయతులోనే ఆయన పరిశీల నాత్మక దృష్టితో చూడలేకపోయారు. అంటే 'లఖద్ జీతుమూనా ఫురాదా' తరువాత వచ్చిన 'వ-తరక్‌తుమ్-మా ఖవ్వల్‌నాకుమ్ వరాఅ జుహూరికుమ్"

(మేము మీకు ప్రసాదించిన దాన్ని ధనైశ్వర్యాలు, సంతానం, బంధుజనం, అనుచరవర్గం మీ వెనుక విడిచి వచ్చారు) అనగా మీరు ఒక్కొక్కరుగా రావటం అంటే అర్థం వీటన్నిటిని మీరు ప్రపంచంలోనే విడిచివచ్చారు) దీన్ని ఒప్పుకోవటానికే సయ్యద్ సాహబ్ గారు భయపడుతున్నారు. "కుల్లుహుమ్ ఆతీహి యౌమల్ ఖియామతి ఫరదన్'లో (ఫరదన్) ఒక్కొక్కరుగా రావటం అనే భావమే 'ఫురాదా' అనే పదానికి నిజమైన భావమని ఖుర్ఆన్ వివరిస్తున్నది.

'ఫురాదా'కు సంబంధించి సయ్యద్ సాహబ్ ఒక విచిత్రమైన పరిశోధన జరిపి, ఆయతు భావాన్ని 'బర్జఖ్' కోసం ఉపయోగించటానికి ప్రయత్నించారు. ఇది ఖుర్ఆన్‌కు సంబంధించి సరియైన అవగాహన అనిపించుకోదు.

చివరిలో తాను జరిపిన ఈ పరిశోధనపట్ల తానే కాస్త తటపటాయిస్తూ ఇలా రాస్తున్నారు.

"వలఖద్ జీతుమూనా ఫురాదా" అనే పదాలు దైవం ఉప యోగించినవని, ఇది ప్రళయ సందర్భం గురించి వచ్చినవని, ఇంకా 'ఫురాదా' పదానికి అర్థం ఒంటరిగా అని కాస్సేపటి కోసం ఒప్పుకున్నా పై ఆయతులో 'బర్జఖ్'కు సంబంధించిన ఖచ్చితమైన సాక్ష్యం లభించి నప్పుడు 'అల్‌యౌమ్'లాంటి అసందర్భమైన పదం ద్వారా 'బర్జఖ్'ను ఖండించలేము.

కనుక సయ్యద్ సాహబ్‌గారి ఊహాజనిత 'బర్జఖ్ శిక్ష'కు ఖచ్చితమైన సాక్ష్యంగా ఏ ఆయతునైతే ప్రతిపాదిస్తున్నారో, దాని భావాన్ని ఖుర్ఆన్ ద్వారానే చూపిస్తాము.

రెండవ ఆయతు

"ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగితేలుతూ ఉండగా, దైవ దూతలు తమ హస్తాలను చాచి 'ఇటుతెండి! బయటికి తియ్యండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అపనిందలు మోపి అన్యాయంగా కూసిన కూతలకు, ఆయన ఆయతులపట్ల తలబిరుసు తనం ప్రదర్శించినందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది."

(అల్ అన్ఆమ్- 94)

وَلَوْ تَرَىٰ إِذِ الظَّالِمُونَ
فِي غَمَرَاتِ الْمَوْتِ
وَالْمَلَائِكَةُ بَاسِطُوا أَيْدِيهِمْ
أَخْرِجُوا أَنفُسَكُمُ الْيَوْمَ تُجْزَوْنَ
عَذَابَ الْهُونِ بِمَا كُنتُمْ
تَقُولُونَ عَلَى اللَّهِ غَيْرَ الْحَقِّ
وَكُنتُمْ عَنْ آيَاتِهِ تَسْتَكْبِرُونَ

పాపాలు చేస్తూ, అదే స్థితిలో చనిపోయిన పాపులకు లభించే శిక్ష గురించి ఇందులో పేర్కొనటం జరిగింది. వారి పాపాలేమిటి? ఏకేశ్వరుణ్ణి విడిచి, బహుదైవాలను ఆరాధించేవారు, దైవంపై అసత్యాలను ఆపాదించేవారు, ఆయన అవతరింపజేసిన ఆయతులను విశ్వసించక, వాటికి తమను అతీతంగా భావించుకునేవారు, వారికి నీచమైన శిక్ష లభిస్తుందని శిక్ష గురించి కూడా తెలుపటం జరిగింది.

ఈ పాపులకు లభించే శిక్షే ఇలాంటి శిక్షే, ఇదే నేరం, ఖుర్ఆన్‌లోని అనేక ఇతర ఆయతులలో వివరించటం జరిగింది. దాంతోపాటే సయ్యద్ సాహబ్ పేర్కొంటున్న 'అల్‌యౌమ్' (ఈ దినం) కూడా రాయబడి ఉంది.

తరువాత ఈ అవిశ్వాసులను అగ్ని ముందుకు తీసుకువచ్చి నిలబెట్టినప్పుడు వారితో ఇలా అనటం జరుగుతుంది. "మీరు మీ వంతు వరాలను

وَيَوْمَ يُعْرَضُ الَّذِينَ
كَفَرُوا عَلَى النَّارِ أَذْهَبْتُمْ
طَيِّبَاتِكُمْ فِي حَيَاتِكُمُ الدُّنْيَا

وَاسْتَمْتَعْتُمْ بِهَا فَالْيَوْمَ تُجْزَوْنَ عَذَابَ الْهُوْنِ بِمَا كُنْتُمْ تَسْتَكْبِرُوْنَ فِى الْاَرْضِ بِغَيْرِ الْحَقِّ وَبِمَا كُنْتُمْ تَفْسُقُوْنَ

మీ ప్రాపంచిక జీవితంలో పొందారు. వాటి ద్వారా ఆనందాన్ని మీరు అక్కడే అనుభవించారు. ఇక ఏ హక్కు అర్హత లేకుండా మీరు భూమిపై ప్రదర్శిస్తూ ఉండిన దురహంకారానికి, మీ అవిధేయతా చేష్టలకు పర్యవసానంగా ఈరోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది. (అల్ అహ్ఖాఫ్- 20)

మీరు కోరిన రుచుల్ని ప్రపంచ జీవితంలోనే అనుభవించారు అనే వాక్యం ద్వారానే ఇది పరలోక శిక్షకు సంబంధించినదని తెలుస్తూనే ఉంది. (పరలోకంలోనే) వారు అగ్నికి ఆహుతి కావించబడుతారు, అదే నీచమైన శిక్ష, అదే వారి యొక్క నేరం అని పేర్కొనటం జరిగింది. 'అల్‌యౌమ్' అంటే కూడా అదే రోజు. ఇంకో ఆయతులో ఇంకా వివరంగా ఉంది.

ثُمَّ يَوْمَ الْقِيٰمَةِ يُخْزِيْهِمْ وَيَقُوْلُ اَيْنَ شُرَكَآءِ يَ الَّذِيْنَ كُنْتُمْ تُشَآقُّوْنَ فِيْهِمْ قَالَ الَّذِيْنَ اُوْتُوا الْعِلْمَ اِنَّ الْخِزْيَ الْيَوْمَ وَالسُّوْٓءَ عَلَى الْكٰفِرِيْنَ تَتَوَفّٰهُمُ الْمَلٰٓئِكَةُ ظَالِمِيْٓ اَنْفُسِهِمْ

"తరువాత ప్రళయదినంనాడు అల్లాహ్ వారిని అవమానపరుస్తాడు, హీనపరుస్తాడు, వారితో ఇలా అంటాడు: "మీరు (సత్యదూతలతో) నా భాగస్వాముల తరఫున పోట్లాడుతూ ఉండేవారు కదా! ఇప్పుడు ఆ నా భాగస్వాములు ఎక్కడ ఉన్నారో చెప్పండి- ప్రపంచంలో జ్ఞానం లభించిన వారు "అవిశ్వాసులకు ఈ రోజు (లభించేది) అవమానమూ, దౌర్భాగ్యమూనూ" అంటారు. అవును, తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉన్నప్పుడు దైవ దూతలు ప్రాణాలు తీసే అవిశ్వాసులకు" (అన్‌నహ్ల్- 27)

పై ఆయతులో కూడా ఈ దౌర్జన్యపరుల గురించే చర్చించబడింది. అదే బహుదైవారాధన, దైవతిరస్కారమే వారి నేరం. అదే నీచమైన, అవమాన కరమైనదే వారి శిక్ష. అదే 'అల్‌యౌమ్' (ఈరోజు) అంటే ప్రళయం రోజు, వివరణ ఉంది. దీనిద్వారా ఖుర్ఆన్ వివరణ ప్రకారం అల్‌అన్‌ఆమ్‌లోని 94వ ఆయతులో మరణదినం కోసం 'అల్‌యౌమ్' (ఈరోజు) అని దేన్నైతే పేర్కొనటం జరిగిందో, అదే రోజు వారి కోసం ప్రళయం రోజు. ఎందుకంటే మృతులకు కాలజ్ఞానం లేని కారణంగా, వారి మరణం మరియు ప్రళయం సరిహద్దులు కలిసే ఉన్నాయి.

ప్రాణంపోయే సమయంలో నిస్సందేహంగా అవిశ్వాసులు కాఠిన్యాన్ని ఎదుర్కొవలసి వస్తుంది. ఖుర్ఆన్‌లోని అనేక ఆయతుల ద్వారా దీనికి సాక్ష్యం లభిస్తుంది. కాని ప్రాణాపాయ సమయంలో లభించే శిక్షను బర్జఖ్ శిక్షగా భావించలేము. బర్జఖ్ అనేది మరణం తరువాతనే ప్రారంభమవు తుంది. అందుకనే "సుమ్మ యౌమల్ ఖియామహ్' అనటం జరిగింది. అంటే ప్రాణాపాయ సమయంలో లభించిన శిక్ష ఇక ఆ తరువాత ప్రళయంరోజే లభిస్తుంది.

సయ్యద్ సాహబ్‌గారు ఒకే ఒక ఆయతు భావాన్ని తీసుకొని, దాని ద్వారా 'బర్జఖ్'శిక్షను రుజువుపరచటానికి ప్రయత్నిస్తున్నారు. ఏ ఆయతు కానివ్వండి, దాని పూర్తి భావాన్ని సరియైన భావాన్ని అర్థం చేసుకోవాలంటే ఖుర్ఆన్‌లో ఆ విషయానికి సంబంధించి వచ్చిన అన్ని ఆయతుల వివరా లను అధ్యయనం చేస్తేగాని, దాని నిజమైన భావాన్ని అర్థం చేసుకోలేము. ఖుర్ఆన్ బోధనలు అనేక మరియు వివిధ ఆయతులలో ఉన్నాయి. వాటిలో వ్యత్యాసం, వైరుధ్యం కాకుండా ఉండాలంటే వాటన్నిటిని ఒకేచోట కలిపి చూడాల్సి ఉంటుంది.

మూడవ ఆయతు:

"ఫిర్ఔను అనుచరులే ఒక భయంకరమైన శిక్షలో చిక్కుకున్నారు. వారు ఉదయం సాయంత్రం నరకాగ్ని ముందు ఉంచబడుతూ ఉంటారు. ప్రళయ గడియ వచ్చినప్పుడు, "ఫిర్ఔను ప్రజలను తీవ్రమైన శిక్షలోకి ప్రవేశింపజెయ్యండి" అని ఆజ్ఞాపించబడుతుంది." (అల్‌మోమిన్-46)

وَحَاقَ بِآلِ فِرْعَوْنَ
سُوءُ الْعَذَابِ
النَّارُ يُعْرَضُونَ عَلَيْهَا غُدُوًّا
وَعَشِيًّا وَيَوْمَ تَقُومُ السَّاعَةُ
أَدْخِلُوا آلَ فِرْعَوْنَ أَشَدَّ
الْعَذَابِ

పై ఆయతులో వాడబడిన 'యూరజూన్' అనే పదాన్ని వర్తమానంగా తీసుకొని, దీన్ని 'బర్జఖ్' శిక్షకు సాక్ష్యంగా చూపిస్తారు. వారు బర్జఖ్‌లో ఉదయం, సాయంత్రం అగ్ని శిక్షకు గురిచేయబడతారని, ఇక ప్రళయం రోజు ఇంతకన్నా కఠినాతి కఠినశిక్షకు గురిచేయబడతారని వాదన. ఖుర్ఆన్‌లోని ఇతర ఆయతుల భావానికి ఇది వ్యతిరేకంగా పోతున్నా ఇక్కడ కూడా ప్రత్యేకంగా ఒకే ఆయతు భావాన్ని స్వీకరించటం జరిగింది. ఖుర్ఆన్ బర్జఖ్ వాసుల శిక్షను నిష్కర్షగా నిరాకరిస్తుంది. అంతేకాదు, వారికి కాలజ్ఞానం, శిక్షా బహుమతుల, సుఖదుఃఖాలను అనుభవించే యోగ్యతను కూడా అది ఒప్పుకోదు. హి.శ.1353 జీఖాయెదా నెల తర్జుమానుల్ ఖుర్ఆన్ పత్రికలో దీన్ని పూర్తి సాక్ష్యాధారాలతో మేము నిరూపించాము. అందుకని పై ఆయతులో వచ్చిన 'యూరజూన్' అనే పదాన్ని వర్తమానంగా తీసుకోవటం జరగదు, అలాచేస్తే ఖుర్ఆన్ బోధనల్లో వైరుధ్యం వస్తుంది. ఇది అసంభవం. దీనికి బదులుగా భవిష్యకాలంగా తీసుకోవటం జరుగుతుంది. ఆ విధంగా మొత్తం ఆయతుల భావంలో సమన్వయం ఏర్పడుతుంది. అంతేకాక ఖుర్ఆన్‌లోని వేరే ఆయతులలో వచ్చినట్లు తిరస్కారులు భవిష్యత్తులో (ప్రళయంలో) అగ్నికి ఆహుతి చేయబడతారనే భావంతో ఇది రుజువై పోతుంది.

وَيَوْمَ يُعْرَضُ الَّذِينَ كَفَرُوا عَلَى النَّارِ أَذْهَبْتُمْ طَيِّبَاتِكُمْ فِي حَيَاتِكُمُ الدُّنْيَا وَاسْتَمْتَعْتُمْ بِهَا

"ఈ అవిశ్వాసులను అగ్నిముందుకు తీసుకువచ్చి నిలబెట్టినప్పుడు, వారితో ఇలా అనటం జరుగుతుంది. మీరు మీవంతు వరాలను మీ ప్రాపంచిక జీవితంలో పొందారు, వాటి ద్వారా ఆనందాన్ని మీరు అక్కడే అనుభవించారు."

(అల్ అహ్ఖాఫ్- 20)

మిగిలిన తిరస్కారులకు శిక్ష, ప్రళయం రోజున ఫిర్‌ఔను వర్గీయులకు శిక్ష నేడు లభించటానికి మిగిలిన తిరస్కారులకన్నా ఫిర్‌ఔను జాతివారు భిన్నంగా కాదుగా. అవియునుగాక హూద్ సూరాలో ఫిర్‌ఔను వర్గీయులు ప్రళయంరోజే అగ్ని శిక్షకు గురిచేయబడతారని వివరించటం జరిగింది.

يَقْدُمُ قَوْمَهُ يَوْمَ الْقِيَامَةِ فَأَوْرَدَهُمُ النَّارَ

"ప్రళయంనాడు అతడు (ఫిర్‌ఔను) తన జాతివారికి ముందు, ముందు ఉంటాడు. తన నాయకత్వంలో వారిని నరకంవైపుకు తీసుకుపోతాడు." (హూద్- 98)

ఫిర్‌ఔను అతని సంతానం అనుచరగణానికి రెండు శిక్షలు పడతాయని సయ్యద్ సాహబ్‌గారు పొరపడ్డారు. ఇంకా 'అఫ్‌అలుల్- తఫ్‌జీల్" అనే పదం ద్వారా ఏ అర్థాన్ని గ్రహించారో, దానిద్వారా భ్రమింప జేయటానికి ప్రయత్నించారు. మిగిలిన దైవతిరస్కారుల్లాగే, ఫిర్‌ఔన్ అనుచరగణం కూడా ప్రళయం రోజు సమర్పించబడతారు. కాని వారి ప్రత్యేకత ఏమిటంటే వారు నరకవాసుల నాయకులుగా గుర్తించబడతారు.

وَجَعَلْنَاهُمْ أَئِمَّةً يَدْعُونَ إِلَى النَّارِ

"మేము వారిని నరకంవైపునకు ప్రజలను ఆహ్వానించే నాయకులుగా చేశాము." (అల్‌ఖసస్- 41)

వారి తీవ్ర నేరానికి అనుకూలంగా మిగిలిన నరకవాసుల కన్నా అధిక కఠినశిక్షకు గురిచేయబడతారు. 'అషిద్దా ఉల్ అజాబ్' అంటే బర్‌జఖ్‌లో వారికి లభించే తేలికపాటి శిక్షకు భిన్నంగా ప్రళయంలో అంతకన్నా కఠినశిక్ష లభిస్తుందనే అర్థం ఏంతమాత్రం కాదు.

"అర్జ్" అనే పదానికి కూడా కేవలం సమర్పించబడడమేకాదు, దానికి బదులు వారు అగ్నిలో పడవేయబడతారు. "గుదువ్వన్ వ అషియ్యా" అనే పదానికి 'నిరంతరం' 'శాశ్వితం' అని నిఘంటుకర్తలు చేసిన అనువాదం సరియైనది, ఖుర్‌ఆన్‌తో పూర్తిగా ఏకీభవించేది. పశుకాపరులు ఉదయం సాయంత్రం రెండు పూటలా పశువుల్ని నీటికోసం తోలుకొనిపోయి, తిరిగి తోలుకొచ్చినట్లు ఫిర్‌ఔను అనుచరగణం కూడా బర్‌జఖ్‌లో ఉదయం, సాయంత్రం రెండుపూటలు అగ్నిశిక్షకు గురిచేయబడి తిరిగి తమ తమ స్థానాలకు తీసుకురాబడతారని భావించటం సమంజసం కాదు. ఇది ఖుర్‌ఆన్ అవగాహన అనిపించుకోదు. ఇక ఖుర్‌ఆన్ సముచ్ఛయ వ్యాఖ్యానానికి (అనగా ఒక మాటను మరోరకమైన మాటలో చెప్పటం) సంబంధించిన సమస్య. దీన్ని నేనూ సమర్థిస్తాను. ఖుర్‌ఆన్ ఆయతులలో ఇలాంటి సామెతలు (అనగా 'వావ్'ను అదనంగా వాడే సందర్భాలు) మనకు కనబడతాయి. ఉదాహరణకు 'వ ఇజ్ ఖాలల్లాహు యా ఈసా ఇన్నీ ముతవఫ్ఫీక వరాఫిఉక ఇలయ్యా" (అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు.

"ఈసా నేను నిన్ను తిరిగి నా దగ్గరకు రప్పించుకుంటాను, నా వైపునకు లేపుకుంటాను." (ఆలిఇమ్రాన్- 55)

وَإِذْ قَالَ اللّٰهُ يٰعِيسٰٓى
إِنِّيْ مُتَوَفِّيْكَ وَرَافِعُكَ إِلَيَّ

పైన 'ముతవఫ్ఫీ' అనే పదంలో వాడబడిన 'వావ్'(మరియు) అనేది వివరణ, వ్యాఖ్యానం కోసం వాడబడింది మాత్రమే. ఇక హజ్రత్ ఈసా(అ) మరణానికి అర్థం దైవం ఆయన్ను తనవైపుకు లేపుకోవటం. ఆయన మరణానికి సంబంధించి తెలుపవలసి వచ్చిన ఆయతులో 'తూఫీ' అనే పదం వాడకుండా దాని వివరణ మాత్రం ఇవ్వబడింది.

"వారు అతనిని నిశ్చయంగా చంప లేదు, కాని అల్లాహ్ ఆయనను తన వైపునకు లేపుకున్నాడు."
(అన్‌నిసా- 158)

وَمَا قَتَلُوهُ يَقِينًا بَل رَّفَعَهُ اللَّهُ إِلَيْهِ

ఖుర్‌ఆన్ ఆయతులలో ఇలాంటి అనేక సామెతలున్నాయి. ఇలాంటి సామెతలు, పద్ధతులు ప్రపంచంలోని ప్రతిభాషలో ఉన్నాయి. ఉదాహరణకు:

అతను నిరాకరించాడు, మరియు నేను రానని చెప్పాడు.

అతను నిరాకరించాడు, అంటే నేను రానని చెప్పాడు.

నాతో ఖుర్‌ఆన్‌కు సంబంధించిన ఆధారాలు అడగండి. కాని ఖత్‌రబ్, అఖ్‌ఫష్, ఫర్రా లేక ఫసాని లాంటి వారి అభూతకల్పనలకు, ఊహలకు తలవంచటానికి నేనేమి వారి బానిసను కాదు.

"మీరూ, మీ తాతముత్తాతలూ పెట్టుకున్న పేర్ల విషయంలో మీరు నాతో ఘర్షణ పడుతున్నారా?"
(అల్ ఆరాఫ్- 71)

أَتُجَادِلُونَنِي فِي أَسْمَاءٍ سَمَّيْتُمُوهَا أَنتُمْ وَآبَاؤُكُم

ఈ రకమైన సముచ్ఛయ వ్యాఖ్యానంపై మీ ఆక్షేపణ కారణంగా నేను గ్రంథపుటలను మార్చాననటం కూడా మీ పొరపాటే. అందులో ఇప్పటికి కూడా 'వావ్' అదే అర్థంలో అనేక చోట్ల వాడబడింది. నా పద్ధతి ప్రకారం, కొన్ని వాక్యాలు ఫుట్‌నోట్‌లో రావటానికి బదులు గ్రంథంలో రావటం కారణంగానే పుటలు మార్చటం జరిగింది.

చివరిలో విన్నవించేదేమంటే బర్‌జఖ్‌కు సంబంధించిన ఈ శిక్షా బహుమానాల విశ్వాసం, ఖుర్‌ఆన్ ద్వారా జన్మించింది కాదు, జన్మించదు కూడా. ఈ క్రింది హదీసు మాత్రమే దానికి మూలాధారం.

"హజ్రత్ ఆయెషా(రజి) ఉల్లేఖనం ప్రకారం ఒకరోజు ఒక యూదు

స్త్రీ ఆమెగారి వద్దకు వచ్చి బర్‌జఖ్ శిక్షను గురించి ప్రస్తావిస్తూ దైవం మిమ్మల్ని సమాధి శిక్షనుండి కాపాడుగాక! అని చెప్పింది. హజ్రత్ ఆయెషా(రజి), సమాధి శిక్ష గురించి మహాప్రవక్త(స)ను అడిగారు. దానిపై ఆయన(స) అవును, సమాధి శిక్ష సత్యమైనదని పలికారు. హజ్రత్ ఆయెషా(రజి) అనుసరించి, ఇక అప్పటినుండి ప్రతి నమాజు తరువాత, మహాప్రవక్త(స) సమాధి శిక్ష నుండి దైవశరణ్యం కోరకుండా ఉండలేదు. (సహీ బుకారీ, కితాబుల్ జనాయిజ్, అజాబుల్ ఖబర్ అధ్యాయం)

ఎవరికైతే అగోచర విషయాలు, జ్ఞానం పరిపూర్ణంగా ప్రసాదించ బడ్డాయో ఈ యూదు స్త్రీ వచ్చి, సమాధిశిక్షగురించి ప్రస్తావించేవరకు ప్రవక్తాగ్రేసరుడు, అంతిమ దైవప్రవక్త(స)కు దీని గురించి తెలియదని ఈ హదీసు ద్వారా విదితమవుతుంది. అంతేకాక ఈ విషయం తన కుటుంబీ కులకు కూడా తెలుపలేకపోయారు. ఆ తరువాత ప్రతి నమాజు పిదప, సమాధి శిక్ష నుండి దైవశరణ్యం వేడుకోసాగారు. ఈ విశ్వాసాన్నే పునాదిగా చేసుకొని, ఇస్లామీయ ధార్మికవేత్తలు మృతుల్లో ఆధ్యాత్మిక జీవనం ఉందని నిరూపించటానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. మృతుల్లో జీవనానికి సంబంధించిన ఏ చిన్న అవకాశాన్ని కూడా ఖుర్‌ఆన్ మిగిలి ఉండనివ్వలేదు. అయినా నిరాధారమైన ఈ విశ్వాసం కారణంగా మృతుల్ని సజీవులనుకొని ప్రజలు వారిని అర్థించసాగారు. భూమ్యాకాశాల్లో వ్యాపించి ఉన్న సజీవ దైవాన్ని విడిచి, భూమిలో పాతబడిన, సిఫారసు చేస్తారను కుంటున్న అసం ఖ్యాక వ్యక్తిత్వాలను జనులు ఆరాధిస్తున్నారు. ఆకాశం నుండి వారి యోగో క్షమాలు తెలుసుకోవటం జరుగుతుందని, దైవం తరఫున వారిని గౌరవించటం జరుగుతుందనే అంధవిశ్వాసం- బహుదైవారాధన- ముస్లిం లలో వ్యాపించిపోయింది. ఇది ఆసియా, ఆఫ్రికాలాంటి ఖండాంతరాల వరకూ వ్యాపించిపోయింది. బహుదైవారాధకులు విగ్రహాలను పూజిస్తే ఈ ముస్లింలు మట్టితో చేయబడిన సమాధులను ఆరాధిస్తున్నారు.

5. బర్‌జఖ్‌పై వాదన

(మౌలానా అస్లం జేరాజ్‌పూరి)

'బర్‌జఖ్'కు సంబంధించిన నా వ్యాసంపై 'మఆరిఫ్' వాళ్ళు చేసిన వ్యాఖ్యలనే మీరు హి.శ. 1353 జిల్‌హజ్జ మాసపు తర్జుమానుల్ ఖుర్‌ఆన్‌లో తిరిగిలేవదీశారు. మీరు వ్రాసిన వ్యాసంలోని తప్పులన్నిటిని ఎత్తిచూపటం సుదీర్ఘమైపోతుంది. కనుక దానిలోని కొన్ని మౌలిక విషయాల్ని ఎన్నుకొని ఖుర్‌ఆన్ బోధనలకు ప్రతికూలమైనట్లు రుజువుచేస్తాను. తద్వారా మీ పూర్తి వ్యాసానికి సమాధానం లభిస్తుంది. ఈ సందర్భంలోనే 'మఆరిఫ్'లో వివిధ వ్యక్తులు, తమ తమ వ్యాసాల్లో చేసిన పొరపాట్లు కూడా దృష్టికి వస్తాయి. ఫలితంగా అనుకరణ స్వభావంతో లేవదీసిన దుమ్ముధూళి కొట్టుకు పోతాయి. దైవచిత్తమైతే స్పష్టమైన ఖుర్‌ఆన్ బోధనల్ని అవగాహన చేసుకో వటంలో అవరోధం ఉండదు.[1]

---

1. *సమాధానానికి అర్హమైన, మౌలానాగారి వాదలన్నిటిని ఒక నంబరు ద్వారా సూచించాము. చివరలో ఆ నంబరువారీగా వాటికి సమాధా నమిచ్చాము. అందుకని పాఠకులు మౌలానా గారి వాదన చదివిన తరువాత వాటితోపాటు మౌలానా మౌదూదీ గారిచ్చిన సమాధానాలు నంబరు వారీగా 'వాదనకు సమాధానం' అనే శీర్షికలో పరిశీలించ గలరని కోరుచున్నాం.*

1. బర్‌జఖ్ భావాన్ని వివరిస్తూ మీరిలా వ్రాశారు.

"బర్‌జఖ్ లేక అడ్డు లేక చాటు అనేది మృతునికి మరియు ప్రపంచానికి మధ్యనే. లేదా మృతునికి మరియు ప్రళయానికి మధ్యనే.

దైవం మరియు అతని దాసుని (మానవుని) మధ్య ఎంతమాత్రం కాదు, బర్‌జఖ్ స్థితిలో మృతులు, దైవసన్నిధి నుండి చాటుగా ఉంచబడతారనే అర్థం వచ్చే ఏ చిన్న దృష్టాంతము (సూచన) కూడా ఖుర్‌ఆన్‌లో మనకు లభించదు. ఇది కేవలం నిరాధారమైన ఆలోచన మాత్రమే"

పై పంక్తుల్లో చాటు అనేది మృతునికి మరియు ప్రపంచానికి మధ్య అని మీరు పేర్కొన్న పదం ఖుర్‌ఆన్‌కు పూర్తిగా భిన్నమైనది. "మిన్ వ్వరాయిహిం బర్‌జఖున్ ఇలా యౌమి ముబ్‌అసూన్ (తిరిగి లేపబడే రోజు వరకు వారి ముందు బర్‌జఖ్ ఉంది) బర్‌జఖ్‌కు సంబంధించిన రెండు సరిహద్దులను ఇందులో పేర్కొనటం జరిగింది. అవేమిటంటే మృతునికి, ప్రపంచానికి మధ్యకాక; మృతునికి మరణం మొదలుకొని ప్రళయం రోజువరకు.1

1. మృతునికి ప్రళయానికి మధ్య అడ్డు అని మీరు వ్రాసిన పదం సరియైనదే. ఈ ప్రళయదినాన్నే నేను దైవసమక్షంలో హాజరవటంగా పేర్కొన్నాను. అంతేకాక ఖుర్‌ఆన్ ద్వారా దీనికి ఆధారం కూడా చూపించాను.

"అది భయంకరమైన ఒక ధ్వని మాత్రమే. దానితో అందరూ మా ముందు హాజరుపరచబడతారు."

(యాసీన్- 53)

إِنْ كَانَتْ إِلَّا صَيْحَةً وَاحِدَةً فَإِذَا هُمْ جَمِيعٌ لَدَيْنَا مُحْضَرُونَ

పై ఆయతులో ప్రళయ సందర్భాన్నే వివరించటం జరిగింది. ప్రళయ దినాన దైవం కాక ఇంకెవరి ముందు హాజరుపరచబడతారని మీరనుకుం

టున్నారు? దీనికి సంబంధించి ఖుర్‌ఆన్‌లో వచ్చిన వివరణలు లెక్కించటం కష్టం. అందుకని మీరు ఊహించినట్లు ఇది నిరాధారమైన ఊహకాదు, ఖుర్‌ఆన్ బోధనల ప్రకారం సత్యం, యదార్థం[2] దైవమార్గంలో చంపబడిన వారు (షహీద్), ప్రాణాలు వీడిన వెంటనే తమ ప్రభువు సన్నిధికి చేరు కుంటారు[3]. ఇక మిగిలినవారు మాత్రం చాటుగా ఉంచబడతారు. ప్రళయం రోజు ప్రభువు సన్నిధికి హాజరుపరచబడతారు.

2. ప్రపంచ జీవితానికి పూర్వం, మానవులు జీవించి ఉన్నారనే దానికి సాక్ష్యంగా మీరు 'అహెద్ అలస్త' అనబడే ఆయతును పేర్కొని దాని వివరణలో ఇలా వ్రాశారు.

"దీనిద్వారా అర్థమయ్యేదేమంటే ఆత్మలు శరీరాల్లో ప్రవేశించక ముందే, వారు మృతస్థితిలో ఉన్నప్పుడు కూడా వాటికి వినగలిగే, చెప్పగలిగే, గ్రహించగలిగే యోగ్యత ఉన్న మృత్యువు అది అని అర్థంకావటంలేదా? దైవం వాటిని ప్రశ్నించాడు, అవి దాన్ని విన్నాయి. దానికి సమాధానా మిచ్చాయి, ప్రశ్నను గ్రహించే, అర్థంచేసుకొనే సమాధాన మిచ్చాయి."

వారిలో ఆత్మలు కూడా ప్రవేశింపజేయబడలేదు, అయినప్పటికీ వారిలో మాట్లాడే, వినే, గ్రహించే యోగ్యత ఉన్నదనే మీ విచిత్ర వాదనను ఎవరు ఒప్పుకోగలుగతారు[4]. ఈ ఆయతులోనైతే మానవుని నైజం, స్వభావం గురించి వివరించటం జరిగింది. ఈ విషయాన్నే దైవం, వేరొక చోట ఇలా తెలిపాడు[5].

فِطْرَتَ اللّٰهِ الَّتِىْ فَطَرَ النَّاسَ عَلَيْهَا ۗ لَا تَبْدِيْلَ لِخَلْقِ اللّٰهِ ۗ ذٰلِكَ الدِّيْنُ الْقَيِّمُ

అల్లాహ్ మానవులను ఏ స్వభావం ఆధారంగా సృష్టించాడో, దానిపై స్థిరంగా ఉండండి. అల్లాహ్ సృజించిన స్వరూప, స్వభావాలు మార్చటానికి శక్యంకానివి, ఇదే సవ్యమైన,

తిన్నని ధర్మమార్గం"

(అర్రూమ్- 30)

వినే, మాట్లాడే, గ్రహించే యోగ్యతకు ఇదే ఆధారమనుకుంటే మరి ఈ క్రింది ఆయతు.

إِنَّا عَرَضْنَا الْأَمَانَةَ عَلَى السَّمَاوَاتِ وَالْأَرْضِ وَالْجِبَالِ فَأَبَيْنَ أَنْ يَحْمِلْنَهَا وَأَشْفَقْنَ مِنْهَا وَحَمَلَهَا الْإِنْسَانُ

"మేము ఈ అమానతును, ఆకాశాల ముందూ, భూమి ముందూ పర్వతాల ముందూ పెట్టాము. అవి దానిని మోయటానికి సిద్ధపడలేదు, దానికి భయపడ్డాయి. కాని మానవుడు దాన్ని తనపై మోపుకున్నాడు."

(అల్ అహ్జాబ్- 72)

ద్వారా, జడపదార్థాలైన వీటిలో కూడా వినటం, మాట్లాడటం, గ్రహించటం లాంటి యోగ్యతలు ఉండేవని మీరు అంగీకరించవలసి వస్తుంది. ఎందుకంటే దైవం వారితో ఏదైతే అడిగాడో, అవి దాన్ని విన్నాయి, సమాధానామిచ్చాయి, గ్రహించిన తరువాతనే సమాధానమిచ్చాయి[6].

3. మరణం తరువాత, మృతుల్లో జీవనానికి సంబంధించిన సాక్ష్యం మీరు ఈ ఆయతు ద్వారా ఇవ్వటానికి ప్రయత్నించారు.

حَتَّىٰ إِذَا جَاءَ أَحَدَهُمُ الْمَوْتُ قَالَ رَبِّ ارْجِعُونِ لَعَلِّي أَعْمَلُ صَالِحًا فِيمَا تَرَكْتُ كَلَّا إِنَّهَا كَلِمَةٌ هُوَ

"చివరకు వారిలో ఎవడికైనా మరణం వస్తే వాడు ఇలా అనటం ప్రారంభిస్తాడు: "ఓ నా ప్రభూ! నేను వదిలిపెట్టి వచ్చిన లోకానికే నన్ను తిరిగి పంపెయ్యి; ఇక నేను మంచి పనులు చేస్తానని ఆశిస్తున్నాను. ఇది ఎంతమాత్రం జరిగేది కాదు, అతడు

قَائِلُهَا وَمِنْ وَّرَائِهِمْ بَرْزَخٌ
اِلٰى يَوْمِ يُبْعَثُوْنَ ٥

పలికేది కేవలం ఒక మాట మాత్రమే. ఇప్పుడు ఈ (మరణించేవారి) అందరి వెనుక ఒక గోడ అడ్డంగా ఉన్నది. అది మరొక జీవితం వచ్చేరోజు వరకు ఉంటుంది."

(అల్ మోమినూన్- 100)

దీనిపై మీరిలా వ్రాస్తున్నారు.

"ఇది ప్రపంచం విడిచిపెట్టిన తరువాత పరిస్థితి అని, అతనికి ప్రపంచానికి మధ్య తెరపడింది."

ఇది నిజంకాదు. 'బర్జఖ్' ప్రపంచం మరియు మృతునికి మధ్య అడ్డుకాదు, దానికి బదులు మృతునికి మరియు ప్రళయానికి మధ్య అడ్డంకి అని ఇంతకుముందే నేను నిరూపించి వచ్చాను. మీరు లేపిన ఈ పునాదే పడిపోయినప్పుడు దానిపై మీరు లేపిన వరుసల గురించి చర్చించటం అనవసరం[7].

వాస్తవంలో ఈ మాటలు, మృతుడు చనిపోయే సమయంలో మాట్లాడినవి, చనిపోయిన తరువాత కాదు[8]. ఆ తరువాత మీరు పేర్కొన్న ఈ ఆయతు ఈ విషయానికి సంబంధించినదే.

وَاَنْفِقُوْا مِمَّا رَزَقْنٰكُمْ
مِنْ قَبْلِ اَنْ يَّاْتِيَ اَحَدَكُمُ
الْمَوْتُ فَيَقُوْلَ رَبِّ لَوْلَا
اَخَّرْتَنِيْٓ اِلٰٓى اَجَلٍ قَرِيْبٍ
فَاَصَّدَّقَ وَاَكُنْ مِّنَ
الصّٰلِحِيْنَ

"మీలో ఎవరికైనా మరణ సమయం సమీపించి, అతను "ఓ నా ప్రభూ! నీవు నాకు మరికొంత వ్యవధి ఎందుకివ్వలేదు; నేను దానధర్మాలు చేసి సజ్జనులలో కలిసిపొయ్యేవాణ్ణి కదా?" అని వాపోయే పరిస్థితి రాకముందే మేము మీకు ఇచ్చిన ఉపాధి నుండి ఖర్చుపెట్టండి."

(అల్ మునాఫిఖూన్- 10)

ఆ తరువాత మీరు పేర్కొన్న ఆయతులు కూడా, ఖచ్చితంగా మరణ సమయానికి సంబంధించినవే; మరణం తరువాతవి కావు[9].

4. బర్జఖ్‌లో లభించే పుణ్యఫలానికి సాక్ష్యంగా మీరు ఈ ఆయతును పేర్కొన్నారు.

ٱلَّذِينَ تَتَوَفَّىٰهُمُ ٱلْمَلَٰٓئِكَةُ طَيِّبِينَ يَقُولُونَ سَلَٰمٌ عَلَيْكُمُ ٱدْخُلُوا۟ ٱلْجَنَّةَ بِمَا كُنتُمْ تَعْمَلُونَ ۝

"వారు పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ "మీకు శాంతికలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి" అని అంటారు.

(అన్ నహ్ల్- 32)

నా వ్యాసంపై మౌల్వీ అబుల్ వఫా సనావుల్లాగారు లేపిన అభ్యంతరాలలో కూడా ఇదే ఆయతును పేర్కొన్నారు. ఇది పరలోక జీవితానికి సంబంధించే తప్ప, బర్జఖ్‌కు సంబంధించింది కాదని, నా వ్యాసంలో సుదీర్ఘంగా వివరిస్తూ రుజువుపర్చాను. పూర్తి ఆయతు ఇలా ఉంది.

وَلَدَارُ ٱلْءَاخِرَةِ خَيْرٌ ۚ وَلَنِعْمَ دَارُ ٱلْمُتَّقِينَ ۝ جَنَّٰتُ عَدْنٍ يَدْخُلُونَهَا تَجْرِى مِن تَحْتِهَا ٱلْأَنْهَٰرُ ۖ لَهُمْ فِيهَا مَا يَشَآءُونَ ۚ كَذَٰلِكَ يَجْزِى ٱللَّهُ ٱلْمُتَّقِينَ ٱلَّذِينَ تَتَوَفَّىٰهُمُ

"ఇక పరలోక గృహం కూడా తప్పనిసరిగా వారికి ఎంతోమేలైనదిగా ఉంటుంది. భయభక్తులు కలవారి ఇల్లు ఎంతో మంచి ఇల్లు. శాశ్వత నివాసంగా ఉండే ఉద్యానవనాలు- వాటిలో వారు ప్రవేశిస్తారు. క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ అంతా వారి అభిమతానికి అనుగుణంగానే జరుగుతుంది. భయభక్తులు కలవారికి అల్లాహ్

ఇటువంటి ప్రతిఫలాన్ని ఇస్తాడు. వారు పరిశుద్ధావస్థలో ఉన్నప్పుడు దైవదూతలు వారి ప్రాణాలు తీస్తూ "మీకు శాంతి కలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి" అని అంటారు."[10]

(అన్‌నహ్ల్- 31, 32)

الْمَلٰٓئِكَةُ طَيِّبِيْنَ يَقُوْلُوْنَ سَلٰمٌ عَلَيْكُمُ ادْخُلُوا الْجَنَّةَ بِمَا كُنْتُمْ تَعْمَلُوْنَ ○

దైవభక్తిగలవారు స్వర్గంలోకి, పాపులు నరకంలోకి మరణించిన వెంటనే ప్రవేశిస్తారనటం ముమ్మాటికి నిజంకాదు. దానికి బదులు ప్రళయం జరిగిన తరువాత, (పాపపుణ్యాల) లెక్కలు చూసిన తరువాత మరీ పంపబడతారు. ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల దీని వివరణ వచ్చింది. సూరా జుమర్‌లో ఇలా ఉంది.

"తరువాత రెండోసారి శంఖం పూరించబడుతుంది. అప్పుడు ఒక్కసారిగా అందరూ లేచి చూడటం ప్రారంభిస్తారు. భూమి తన ప్రభువు యొక్క తేజస్సుతో వెలిగిపోతుంది. కర్మల చిట్టా తీసుకురాబడుతుంది. దైవప్రవక్తలూ, సాక్షులూ అందరూ హాజరు పరచబడతారు. ప్రజలకు సరిగ్గా, న్యాయంగా తీర్పు చేయబడుతుంది. వారికి ఎలాంటి అన్యాయమూ జరగదు. ప్రతి ఆత్మకు అది చేసుకున్న కర్మల ప్రకారం పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ప్రజలు చేస్తున్న

ثُمَّ نُفِخَ فِيْهِ اُخْرٰى فَاِذَا هُمْ قِيَامٌ يَّنْظُرُوْنَ ○ وَاَشْرَقَتِ الْاَرْضُ بِنُوْرِ رَبِّهَا وَوُضِعَ الْكِتٰبُ وَجِايْٓءَ بِالنَّبِيّٖنَ وَالشُّهَدَآءِ وَقُضِيَ بَيْنَهُمْ بِالْحَقِّ وَهُمْ لَا يُظْلَمُوْنَ ○ وَوُفِّيَتْ كُلُّ نَفْسٍ مَّا عَمِلَتْ

وَهُوَ اَعْلَمُ بِمَا يَفْعَلُوْنَ ۝ وَسِيْقَ الَّذِيْنَ كَفَرُوْا اِلٰى جَهَنَّمَ زُمَرًا ؕ

దంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. (ఈ తీర్పు తరువాత) సత్యాన్ని తిరస్క రించినవారు నరకం వైపునకు గుంపులు, గుంపులుగా తోలబడ తారు." (అజ్‌జుమర్- 68-71)

وَسِيْقَ الَّذِيْنَ اتَّقَوْا رَبَّهُمْ اِلَى الْجَنَّةِ زُمَرًا ؕ حَتّٰۤى اِذَا جَآءُوْهَا وَفُتِحَتْ اَبْوَابُهَا وَقَالَ لَهُمْ خَزَنَتُهَا سَلٰمٌ عَلَيْكُمْ طِبْتُمْ فَادْخُلُوْهَا خٰلِدِيْنَ

"తమ ప్రభువుపట్ల అవిధేయతకు దూరంగా ఉన్నవారిని బృందాలు, బృందాలుగా స్వర్గంవైపునకు తీసుకు పోవటం జరుగుతుంది. చివరకు వారు అక్కడకు చేరినప్పుడు దాని తలుపులు ముందుగానే తెరువబడి ఉంటాయి. దాని నిర్వహణాధికారులు వారితో ఇలా అంటారు: "మీకు శాంతి కలుగుగాక! మీరు చక్కగా ప్రవర్తిం చారు, ప్రవేశించండి ఇందులోకి, శాశ్వితంగా ఉండేందుకు."

(అజ్ జుమర్- 73)

పై ఆయతులలో దైవభక్తి పరాయణులకు స్వర్గప్రవేశం, దైవ తిరస్కా రులకు నరక ప్రవేశం, ప్రళయానంతరం లెక్కలు చూసిన తరువాతనే జరుగుతుందనేది విధితమవుతుంది. ఖుర్‌ఆన్‌లో ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు ఈ అంశానికి సంబంధించి పేర్కొనబడుతుందో, దానికి ఇదే భావమని గుర్తించబడుతుంది. ఇదే ఖుర్‌ఆన్ పద్ధతి. ఈ కారణంగానే అది మరణం గురించి పేర్కొన్న వెంటనే శిక్షాబహుమానాలను కూడా పేర్కొంటుంది. ఎవరయితే ఖుర్‌ఆన్ బోధనాపద్ధతిని బాగా అవగాహన చేసుకున్నారో, వారు ఇది ప్రళయదినానికి సంబంధించిన విషయమని స్పష్టంగా తెలుసుకోగలు

గుతారు. ఖుర్‌అన్ బోధనాశైలిని ఎవరైతే సరిగా అర్థం చేసుకోలేదో వారు ఇది ప్రస్తుత పరిస్థితే అని భావిస్తారు. ఆ విధంగా పప్పులో కాలేస్తారు.[11]

5: నేరస్థులు మరణించిన వెంటనే నరకంలోకి తోసేయబడతారనే దానికి మీరు ఈ ఆయతును సాక్ష్యంగా ప్రతిపాదించారు.

ٱلَّذِينَ تَتَوَفَّىٰهُمُ ٱلْمَلَٰٓئِكَةُ ظَالِمِىٓ أَنفُسِهِمْ فَأَلْقَوُا۟ ٱلسَّلَمَ مَا كُنَّا نَعْمَلُ مِن سُوٓءٍۭ بَلَىٰٓ إِنَّ ٱللَّهَ عَلِيمٌۢ بِمَا كُنتُمْ تَعْمَلُونَ ۝ فَٱدْخُلُوٓا۟ أَبْوَٰبَ جَهَنَّمَ خَٰلِدِينَ فِيهَا

"అప్పుడు వారు (తలబిరుసుతనాన్ని విడిచిపెట్టి) వెంటనే పూర్తిగా లొంగిపోయి, "మేము ఏ తప్పూ చేసి ఉండలేదు" అని అంటారు. దానికి దైవదూతలు ఇలా అంటారు: "ఎందుకు చేసి ఉండలేదు! అల్లాహ్ మీ చేష్టలను బాగా ఎరుగును, ఇక పొండి, నరక ద్వారాలలో దూరిపొండి. అక్కడనే మీరు శాశ్వతంగా ఉంటారు."

(అన్‌నహ్ల్- 27)

పై ఆయతులోనైతే స్పష్టంగా ప్రళయదినం గురించిన వివరణ ఉంది. అయినా మీరు గమనించలేదంటే ఆశ్చర్యం వేస్తుంది.

ثُمَّ يَوْمَ ٱلْقِيَٰمَةِ يُخْزِيهِمْ وَيَقُولُ أَيْنَ شُرَكَآءِىَ ٱلَّذِينَ كُنتُمْ تُشَٰٓقُّونَ فِيهِمْ ۚ قَالَ ٱلَّذِينَ أُوتُوا۟ ٱلْعِلْمَ إِنَّ ٱلْخِزْىَ ٱلْيَوْمَ وَٱلسُّوٓءَ عَلَى ٱلْكَٰفِرِينَ ٱلَّذِينَ تَتَوَفَّىٰهُمُ ٱلْمَلَٰٓئِكَةُ

"ప్రళయంనాడు అల్లాహ్ వారిని అవమానపరుస్తాడు, హీనపరుస్తాడు, వారితో ఇలా అంటాడు: "మీరు (సత్యవాదులతో) నా భాగస్వాముల తరఫున పోట్లాడుతూ ఉండేవారు కదా! ఇప్పుడు ఆ నా భాగస్వాములు ఎక్కడ ఉన్నారో చెప్పండి. ప్రపంచంలో జ్ఞానం లభించినవారు 'అవిశ్వాసులకు ఈ రోజు (లభిం

ظَالِمِيْٓ اَنْفُسِهِمْ فَاَلْقَوُا السَّلَمَ
مَا كُنَّا نَعْمَلُ مِنْ سُوْٓءٍ بَلٰٓى
اِنَّ اللّٰهَ عَلِيْمٌ بِمَا كُنْتُمْ
تَعْمَلُوْنَ ○ فَادْخُلُوْٓا اَبْوَابَ
جَهَنَّمَ خٰلِدِيْنَ فِيْهَا

చేది) అవమానమూ, దౌర్భాగ్యమూనూ' అని అంటారు. అవును, తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ వున్నప్పుడు దైవదూతలు ప్రాణాలు తీసే అవిశ్వాసులకు, అప్పుడు వారు (తలబిరుసుతనాన్ని విడిచిపెట్టి) వెంటనే పూర్తిగా లొంగిపోయి, 'మేము ఏ తప్పూ చేసి ఉండలేదు' అని అంటారు. దానికి దైవదూతలు ఇలా అంటారు. ఎందుకు చేసి ఉండలేదు! అల్లాహ్ మీ చేష్టలను బాగా ఎరుగును. ఇకపొండి. నరక ద్వారాలలో దూరిపొండి, అక్కడనే మీరు శాశ్వితంగా ఉంటారు."

(అన్‌నహ్ల్: 27,28)

మీరు సమర్పించిన ఈ సాక్ష్యం, మీ వాదనకు పూర్తిగా భిన్నంగానూ, నా వాదనను సమర్థించేదిగా ఉంది.[12]

6. మృతుల ఆధ్యాత్మిక జీవనానికి సంబంధించి మీరొక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు, ఇంకా దైవమార్గంలో చంపబడినవారి, మిగిలినవారి మరణాన్ని ఒకేస్థాయిలో ఉంచారు. నా వ్యాసానికి సమాధానంగా, 'మఆరిఫ్'లో దివంగత మౌలానా సూరతిగారు కూడా ఇదే సిద్ధాంతాన్ని ఆవిష్కరించారు. మౌలానా సూరతిగారి జ్ఞానయోగ్యత ఏపాటిదో నాకు తెలియనిదికాదు. అయితే మీరు ఆయనకన్నా రెండడుగులు ముందే ఉన్నారు. అందుకే ఇలా వ్రాస్తున్నారు.

'మరణించేవారందరిలోను, సామాన్య మరణం తరువాత కూడా

జ్ఞానం, అవగాహన, మాట్లాడటం మొదలుగు శక్తులు యధాతథంగా మిగిలి ఉంటాయి."

ఇది వాస్తవంలో కేవలం ఊహాగానం. దివ్యఖుర్‌ఆన్‌కు పూర్తిగా వ్యతిరేకం. దైవమార్గంలో చంపబడినవారి (షహీద్‌ల) సందర్భంలో ఖుర్‌ఆన్ ఇలా వివరిస్తున్నది.

"అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని 'మృతులు' అనకండి. వాస్తవానికి వారు సజీవులు" (అల్ బఖర- 154)

وَلَا تَقُولُوا لِمَن يُقْتَلُ فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتٌ بَلْ أَحْيَاءٌ

ఇక ఇతరుల గురించి, బహుదైవారాధకులు ఆరాధించే వారి పుణ్య పురుషులతో సహా ఇలా చెప్పటం జరిగింది.

"నిర్జీవులే కాని సజీవులు కారు. వారు ఎప్పుడు (మళ్ళీ బ్రతికించబడి) లేపబడనున్నారో, వారికెంత మాత్రం తెలియదు." (అన్‌నహ్లా- 21)

أَمْوَاتٌ غَيْرُ أَحْيَاءٍ وَمَا يَشْعُرُونَ أَيَّانَ يُبْعَثُونَ

అనగా వారిని కేవలం మరణించి ఉన్నారు అనలేదు, ప్రాణంతో లేరు అని పేర్కొంటూ, జీవనానికి సంబంధించిన ఏ అవశేషము, లక్షణం జ్ఞానంతో సహా లేదని స్పష్టం చేయటం జరిగింది.[13]

ఈ క్రింది ఆయతులో వారి ఏమరుపాటు అనగా జ్ఞానహీనత, వినలేరనే విషయాన్ని కూడా వివరించటం జరిగింది.

"అల్లాహ్‌ను కాదని, ప్రళయం వచ్చే వరకు అతనికి సమాధానమైనా ఇవ్వలేనివారిని, మొరపెట్టుకునేవారు తమకు మొరపెట్టు కుంటున్నారనే

وَمَنْ أَضَلُّ مِمَّن يَدْعُو مِن دُونِ اللَّهِ مَن لَّا يَسْتَجِيبُ

لَهٗۤ اِلٰى يَوْمِ الْقِيٰمَةِ وَهُمْ عَنْ
دُعَآىِٕهِمْ غٰفِلُوْنَ ۝

విషయం కూడా ఎరుగనివారిని వేడుకునేవాడికంటే పరమభ్రష్టుడైన మానవుడు ఎవడుంటాడు?"

(అల్ అహ్ఖాఫ్- 5)

وَالَّذِيْنَ
تَدْعُوْنَ مِنْ دُوْنِهٖ مَا يَمْلِكُوْنَ
مِنْ قِطْمِيْرٍ اِنْ تَدْعُوْهُمْ
لَا يَسْمَعُوْا دُعَآءَكُمْ

"ఆయననుకాదని మీరు పిలిచే ఇతరులు కనీసం గడ్డిపోచకు కూడా యజమానులు కారు, వారిని వేడుకుంటే మీ ప్రార్థనలను వినలేరు, ఒకవేళ విన్నా, వాటికి ఏ సమాధానమూ మీకు ఇవ్వలేరు."

(ఫాతిర్- 14)

ఖుర్‌ఆన్‌లో ఇలాంటి స్పష్టమైన వివరణలు ఉన్న తరువాత కూడా సామాన్య మృతుల్లో (దైవమార్గంలో చంపబడినవారు కాక మిగిలినవారు) జీవనం, జ్ఞానం, వినే, మాట్లాడే యోగ్యతలున్నాయని ఒప్పుకోవటం, దైవ మార్గంలో చంపబడినవారి, మిగిలినవారి పరిస్థితిని ఒకేరకంగా భావించటం-ఖుర్‌ఆన్‌ను తిరస్కరించటం అనబడుతుంది. ప్రతి ముస్లిం దీనికి కంపించిపోవాలి.[14]

7. ఇక ఈ ఆయతులను గమనించండి.

وَالَّذِيْنَ هَاجَرُوْا فِيْ
سَبِيْلِ اللّٰهِ ثُمَّ قُتِلُوْٓا اَوْ
مَاتُوْا لَيَرْزُقَنَّهُمُ اللّٰهُ رِزْقًا
حَسَنًا

"ఎవరు అల్లాహ్ మార్గంలో వలస పోయారో, తరువాత చంపబడ్డారో, లేక మరణించారో వారికి అల్లాహ్ మంచి ఉపాధిని ప్రసాదిస్తాడు."

(అల్‌హజ్- 58)

"మీరు చనిపోయినా లేక చంప బడినా ఏ స్థితిలో అయినాసరే, మీరంతా అల్లాహ్ సమక్షంలో సమీక రించబడతారు." (ఆలిమ్రాన్- 158)

وَلَئِن مُّتُّمْ أَوْ قُتِلْتُمْ لَإِلَى اللَّهِ تُحْشَرُونَ ۝

ఈ ఆయతులకు సంబంధించిన పాదసూచికలో మీరు 'దైవభీతి పరాయణులందరితోనూ ఒకే విధమైన వ్యవహారం ఉంటుందని, ఇందులో షహీద్, షహీద్‌కాని వారిలో ఎలాటి బేధం ఉండదని తెలుస్తున్నది" అని వ్రాశారు. "మఆరిఫ్"వాళ్ళు కూడా తమ వాదనను సమర్థించుకోవటానికి ఇదే ఆయతును సూచించారు. సజ్జనులకు, దైవభక్తిగలవారికి శ్రేష్టమైన జీవిక లభించే విషయంలోనూ, వారిని దైవం ముందు ప్రవేశపెట్టే విషయంలోనూ వివాదం లేదే? వివాదమంతా 'బర్‌జఖ్'కు సంబంధించినదే. దానికి భిన్నంగా వాటిలో ఏ ఫలితం బయటపడింది? మొదటి ఆయతులో షహీద్‌లు, షహీద్‌కాని వారి కేవలం (జీవిత) ఫలితాలను వివరించటం జరిగింది. వారి సమయాలు, కాలాలు సూచించబడలేదు. అంటే వారికి శ్రేష్టమైన జీవిక ఎప్పుడు లభిస్తుందో స్పష్టపరచబడలేదు. దీని వివరణ రెండవ ఆయతులో వచ్చింది. షహీద్‌లకు మరణించిన వెంటనే, జీవితం శ్రేష్టమైన జీవిక లభిస్తుందని, షహీద్‌కాని దైవభక్తులకు ప్రళయంరోజు లభిస్తుందని వివరించడం జరిగింది.[15] ఇదే పరిస్థితిని, ఇదే విషయాన్ని రెండవ ఆయతులో వర్ణించటం జరిగింది. ఇందులో షహీద్‌లు, షహీద్‌కానివారి పరిస్థితి ప్రళయంరోజు ఎలా ఉంటుందో తెలుపటం జరిగింది. దీన్ని ప్రతి ముస్లిం విశ్వసిస్తాడు. దీన్ని తిరస్కరించ ఊహించనైనా లేడు. ఖుర్‌ఆన్ విభిన్న విషయాలను అనేక చోట్లలో వివిధ ఆయతుల ద్వారా పరిష్క రిస్తుంది. ఒకే ఆయతులో అన్ని విషయాలు పరిష్కరించదు. నా విమర్శ కులు, ఈ ఖుర్‌ఆన్ సూత్రాన్ని ఎరుగరు, కనుకనే నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు.

8. ఒక విశ్వాసికి సంబంధించిన సంఘటన సూరా యాసీన్‌లో వివరించబడింది. అతను తన 'విశ్వాస' ప్రకటనచేసి, 'వినండి నేను మీ ప్రభువును విశ్వసించాను' (యాసీన్- 35) అని అనగానే, అవిశ్వాసులైన అతని జాతివారు వెంటనే అతన్ని హతమార్చారు. అతని గురించి ఖుర్‌ఆన్‌లో ఇలా వచ్చింది.

"ఆ వ్యక్తితో 'స్వర్గంలో ప్రవేశించు' అని అనబడింది. అతను ఇలా అన్నాడు: 'నా ప్రభువు ఏ విషయాన్ని బట్టి నన్ను క్షమించి, గౌరవనీయుల లోకి ప్రవేశింపజేశాడో, నా జాతివారికి తెలిస్తే ఎంత బాగుండును" (యాసీన్- 27)

قِيْلَ ادْخُلِ الْجَنَّةَ
قَالَ يَا لَيْتَ قَوْمِيْ يَعْلَمُوْنَ
بِمَا غَفَرَ لِيْ رَبِّيْ وَجَعَلَنِيْ مِنَ
الْمُكْرَمِيْنَ

ఈ వ్యక్తిని నేను షహీద్‌గా పేర్కొన్నాను. దీనిగురించి పాదసూచికలో మీరిలా వ్రాశారు.

"ఆ వ్యక్తి చంపబడినట్లు ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడలేదు. అతను చంపివేయబడినట్లు ఉల్లేఖనాల ద్వారా తెలిసింది. ఈ ఉల్లేఖనాన్ని మనః కల్పితం, నమ్మశక్యం కానిదని ఎవరయితే అనుకుంటారో, మరణించిన తరువాతనే, ఆ వ్యక్తి స్వర్గంలో ప్రవేశించటానికి ఆదేశింపబడ్డాడని వారు ఒప్పుకోవలసి ఉంటుంది.

ఖుర్‌ఆన్ ద్వారా ఆ వ్యక్తిని 'షహీద్'గా నిరూపించమని 'మఆరిఫ్' సంపాదకులు కూడా నన్ను నిలదీసారు.

ఆ వ్యక్తిని నేను 'షహీద్'గా పేర్కొన్నానంటే, ఖుర్‌ఆన్ ఆధారంగానే పేర్కొన్నాను తప్ప, ఉల్లేఖనాల ఆధారంగా కాదు, అతను షహీద్ అనే సాక్ష్యం ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా కనబడుతున్నది. ఎలాగంటే ఖుర్‌ఆన్‌లో 'షహీద్'లకు సంబంధించిన రెండు ప్రత్యేకతలు పేర్కొనబడ్డాయి.

ఒకటి దైవం వద్దవారికి శ్రేష్టమైన జీవిక ఉంది. రెండవది దైవం తన కృపతో ప్రసాదించిన దానితో వారు ఆనందభరితులవుతారు. యాసీన్ సూరాలో వచ్చిన 'ఆదర్శ విశ్వాసి' కోసం, 'స్వర్గంలో ప్రవేశించు'అనేది 'దైవం వద్ద వారికి శ్రేష్టమైన జీవిక ఉంది అనేదానికి మారురూపం, అందుకనే అతను ఆనందభరితుడై 'అల్లాహ్ నన్ను క్షమించాడు, నన్ను గౌరవనీయుల్లో చేర్చాడు, ఈ విషయం నా జాతివారు తెలుసుకుంటే ఎంత బాగుండేది' అని పలికాడు. ఇది షహీద్‌లకు లభించిన రెండవ ప్రత్యేకత యొక్క భావం. షహీద్‌లకు లభించే ఈ రెండు ప్రత్యేకతలు అతనికి లభించాయి కనుక ఖుర్‌ఆన్ ద్వారానే అతను 'షహీద్' అనేది నిర్ధారణ అయింది.[16]

పాదసూచికలో మీరు 'హదీసును ఎవరయితే నమ్మశక్యం కానిదనుకుంటారో' అని వ్రాశారు. నా మట్టుకు మాత్రం అది నిజంకాదు, దాని సత్యతను రుజువుచేసే ఆధారాలే కనుక ఉంటే, హదీసుల్ని చరిత్ర పరంగా విశ్వసనీయమైనవని నేనంగీకరిస్తాను.

ఇక్కడ ఇంకో విషయాన్ని బహిర్గతం చేయటం అవసరమను కుంటాను. ధార్మికపరంగా హదీసులనే నిరసింపదగినవిగా భావించే వ్యక్తిపై, వాటిని ప్రమాణంగా మోపుతూ, దాన్ని అతడు స్వీకరించకుండా నిరాకరించే హక్కు లేదనటం ఎంతవరకు సమంజసం? మీరు అవలంబించిన ఈ పద్ధతి సరియైనదికాదు.

9. ఇంకా మీరిలా వ్రాశారు:

''సజ్జనులు, దైవభీతిపరాయణుల పేర్లు ''ఇల్లియ్యీన్''కు ప్రత్యేకించిన దప్తరాల్లో వ్రాయబడతాయి, దుర్మార్గులు, నేరస్థుల పేర్లు 'సిజ్జీన్'కు ప్రత్యేకించిన దప్తరాల్లో నమోదు చేయబడతాయి. దీని అర్థం ఆత్మలు నశించిపోయి, కేవలం వారి పేర్లు మాత్రమే సంబంధిత రిజిష్టర్లలో నమోదై ఉంటాయని కాదు. దానికి బదులు వారి ఆత్మలు ఇల్లియ్యీన్,

సిజ్జీన్‌లలో ప్రవేశిస్తాయి. పాఠశాలలో బాలునిపేరు నమోదు చేయబడిం దంటే, బాలుడు మాయమై, అతని పేరు మాత్రమే రిజష్టర్‌లో మిగిలి పోయిందని అర్థం కాదు.

"ఇన్న కితాబల్ అబ్‌రారి లఫీ ఇల్లియ్యీన్"కు అనువాదం 'సజ్జనుల పేర్లు ఇల్లియ్యీన్ కోసం ప్రత్యేకించబడిన దప్తరాల్లో వ్రాయబడతాయి" అని వ్రాశారు. ఇది అరబ్బి సాహిత్యపరంగా ఎంత విచిత్రంగా ఉంది! ఆ తరువాత, వారి ఆత్మలుకూడా ఇల్లియ్యీన్ మరియు సిజ్జీన్‌లో ప్రవేశిస్తాయని దాని భావంగా పేర్కొనటం ఇంకా విచిత్రంగా ఉంది. ఏ ఆధారంగా మీరలా అంటున్నారు? ఏదైనా ఆయతు ఉంటే చూపించండి. ఖుర్‌ఆన్‌లో కేవలం ఇలా వచ్చింది.

قَالَ فَمَا بَالُ الْقُرُونِ الْأُولَىٰ قَالَ عِلْمُهَا عِندَ رَبِّي فِي كِتَابٍ

"పూర్వం గతించిన తరాలవారి పరిస్థితి ఎలా ఉందని ఫిర్‌ఔను ప్రశ్నించాడు. దానికి మూసా ఇలా అన్నాడు: "దానికి సంబంధించిన జ్ఞానం నా ప్రభువు వద్ద ఒక గ్రంథంలో సురక్షితంగా ఉంది." (తాహా- 52)

పూర్వీకుల గురించిన జ్ఞానం ప్రభువువద్ద గ్రంథంలో లిఖితంగా ఉందని ఖుర్‌ఆన్ స్పష్టంగా పేర్కొంటున్నది. అంతకంటే ముందుకెళ్ళి, జ్ఞానమేకాదు, ఆత్మలు కూడా అందులో ప్రవేశించాయి అనే హక్కు మీకెక్కడిది? కేవలం ఖుర్‌ఆన్‌ద్వారానే, ఖుర్‌ఆన్ ఆధారంగానే జరుగుతున్న ఈ వాదనలో మీరు ఖుర్‌ఆన్ ఆయతులకు ఎదురుగా దృష్టాంతాలను, అవి కూడా తార్కికంగా ఎలాంటి విలువలేని ఉపమానాలను ప్రదర్శిస్తున్నారు. మరణించిన వారి దృష్టాంతాలను బ్రతికున్నవారిపై మోపుతున్నారు.[17]

10. ఫిర్‌ఔన్ అనుచరవర్గానికి సంబంధించిన అగ్నిశిక్ష విషయంలో 'యూరిజూన్' అర్థం వర్తమానంకాదు, భవిష్యత్కాలమని ఖుర్‌ఆన్

ఆయతుల ద్వారా రుజువు చేశాము. అల్ అహ్ఖాఫ్ సూరాలో వచ్చినట్లు:

"ఈ అవిశ్వాసులను అగ్నిముందుకు తీసుకువచ్చి నిలబెట్టినప్పుడు, వారితో ఇలా అనటం జరుగుతుంది. "మీరు మీవంతు వరాలను మీ ప్రాపంచిక జీవితంలో పొందారు. వాటి ద్వారా ఆనందాన్ని మీరు అక్కడే అనుభవించారు."

وَيَوْمَ يُعْرَضُ الَّذِيْنَ
كَفَرُوْا عَلَى النَّارِ اَذْهَبْتُمْ
طَيِّبٰتِكُمْ فِيْ حَيٰوتِكُمُ الدُّنْيَا

(అల్ అహ్ఖాఫ్- 20)

ఇది పరలోక జీవితానికి సంబంధించిన స్థితి. అందులో ఫిర్ఔను అనుచర వర్గంతో సహా, దైవతిరస్కారులందరూ అగ్నికి ఆహుతి చేయబడతారు. ఇంకా ఫిర్ఔను అనుచర వర్గం గురించిన ప్రత్యేకత, ఇంకొకచోట ఇలా వివరించబడింది.

"ప్రళయంనాడు అతడు తన జాతి వారికి ముందుముందు ఉంటాడు. తన నాయకత్వంలో వారిని నరకం వైపుకు తీసుకపోతాడు."

يَقْدُمُ قَوْمَهُ يَوْمَ الْقِيٰمَةِ
فَاَوْرَدَهُمُ النَّارَ

(హూద్- 98)

11. మీ దృష్టిలో నా తప్పు సిద్ధాంతాలు పేజి 449లో ఇలా పేర్కొనడం జరిగింది: బర్జఖ్ సంపూర్ణమైన, మృత్యులోకం- మృతుల్లో జ్ఞానం, అనుభూతి లేదు. వారికేమియు తెలియదు- ఖుర్ఆన్ ప్రకారం మానవునికి రెండే మరణాలు, రెండే జీవితాలు- బర్జఖ్లో మృతులకు కాలజ్ఞానముండదు- కాని ఇవి నా సిద్ధాంతాలు కావు. ఖుర్ఆన్ స్పష్టంగా వివరించిన విషయాలు ఒక్కొక్కటిగా వాటిని నా వ్యాసంలో వివరించాను. అంతేకాక ఈ వ్యాసంలో కూడా వాటిని తిరిగి పేర్కొన్నాను. ఇంత జరిగిన తరువాత కూడా,

ఇక ఈ ఆయతు చదవటం తప్ప, నేనింకేమి చేయగలను?

"కాని వారు తిరస్కరించేది నిన్ను కాదు, ఈ దుర్మార్గులు తిరస్కరిస్తున్నది అల్లాహ్ ఆయతులనే."[19]

فَإِنَّهُمْ لَا يُكَذِّبُونَكَ وَلَٰكِنَّ الظَّٰلِمِينَ بِـَٔايَٰتِ اللَّهِ يَجْحَدُونَ

(అల్అన్ఆమ్- 33)

12. ఖుర్ఆన్లో ఇహలోకం, పరలోకంలో లభించే శిక్షా బహుమానాలే తప్ప బర్జఖ్కు సంబంధించిన ఎలాంటి శిక్షా బహుమానాల పేరు కూడా ఉచ్చరించబడలేదని రుజువుపరచటానికి అనేక ఆయతులను ప్రదర్శిస్తే దానిపై మీరిలా వ్రాస్తున్నారు:

'బర్జఖ్ ఆధ్యాత్మిక జీవనం, అందులో శిక్షాబహుమానాల గురించి ఈ ఆయతులలో ఖండించటం జరుగలేదు."

లేదని పేర్కొనలేదు, కాబట్టి అది ఉన్నదని ఎవరైనా వాదించవచ్చా? బర్జఖ్ ఆధ్యాత్మిక జీవనం, అందులో శిక్షా, పుణ్యాల అవకాశమే లేదని అనేక ఖుర్ఆన్ ఆయతుల ద్వారా నేను రుజువు చేశాను. ఇక అదున్నదనే ప్రశ్నే ఉత్పన్నం కాదుగా![20]

చివరలో మీరు షహీద్లకు లభించే పుణ్యఫలం ద్వారా బర్జఖ్ పుణ్యఫలాన్ని రుజువు చేయటానికి ప్రయత్నించారు. ఇది అసందర్భమైనది. మనం వాదించుకునేది బర్జఖ్ గురించి. షహీద్లు బర్జఖ్లో, లేక చాటుగా ఉంచబడరు, దానికి బదులు తమ ప్రభువు సమక్షంలో ఉన్నారని అనేక ఆయతుల ద్వారా మేము రుజువుపర్చాము.[21]

13. 'మఆరిఫ్' సంపాదకులుగారు, బర్జఖ్ శిక్షకు సాక్ష్యంగా గొప్ప ఆడంబరంతో ఏ ఆయతునైతే సూచించారో మీరూ దాన్నే ప్రదర్శిస్తున్నారు.

سَنُعَذِّبُهُم مَّرَّتَيْنِ ثُمَّ يُرَدُّونَ إِلَىٰ عَذَابٍ عَظِيمٍ

"మేము వారికి రెట్టింపు శిక్షను విధించే సమయం సమీపంలోనే ఉంది. తరువాత వారు మరింత పెద్ద శిక్ష కొరకు తిరిగి తీసుకురాబడ తారు." (అత్‌తౌబా- 101)

పైన పేర్కొన్న ఈ రెండు శిక్షల్లో ఒకటి ప్రపంచంలో లభించే శిక్షగా రెండవది బర్‌జఖ్‌లో లభించే శిక్షగా మీరు పేర్కొంటున్నారు. కాని దీనికోసం మీ దగ్గరున్న ఆధారమేమిటి? బర్‌జఖ్ పదాన్నైతే ఖుర్‌ఆన్ పేర్కొనలేదు. బర్‌జఖ్ శిక్ష వాస్తవమని ముందుగా రూఢీ అయినప్పుడే మీ వాదన నిజమని పిస్తుంది.

أَوَلَا يَرَوْنَ أَنَّهُمْ يُفْتَنُونَ فِي كُلِّ عَامٍ مَّرَّةً أَوْ مَرَّتَيْنِ ثُمَّ لَا يَتُوبُونَ

"తాము ప్రతి సంవత్సరం ఒకటి రెండు సార్లు పరీక్షకు గురి చెయ్యబడటాన్ని వారు చూడటంలేదా? కాని దీని తరువాత కూడా వారు పశ్చాత్తాపం పడటంలేదు." (అత్‌తౌబా- 126)

ప్రతి సంవత్సరం ఒకటిరెండుసార్లు దైవం వారిని శిక్షకు గురిచేస్తున్నాడు, జీవితంలో తిరిగి వారిని శిక్షకు గురిచేయలేడా? అందుకని ఈ రెండవ శిక్ష బర్‌జఖ్ శిక్షేనని ఎలా రుజువవుతుంది? ఇలాంటి దృష్టాంతాల వలన తమ వాదనను రుజువుచేసుకోలేమని, ఒక మనిషి తన మదిలో ఆలోచించుకుంటేనే తెలిసిపోతుంది. ఇది పనికిరాని దృష్టాంతాల సంఖ్య పెంచుకోవటం తప్ప ఇంకేమి కాదు.[22]

6. వాదనకు సమాధానం
(మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూదీ)

1. మృతుడు తిరిగి భూలోకానికి రాగలడనా దీని అర్థం? ఆయతు పూర్వపరాల్ని పరిశీలించండి. చనిపోయినవాడు తిరిగి ప్రపంచానికి రాదలిచాడు. దానికిలా ప్రత్యుత్తరం ఇవ్వటం జరిగింది. "ముమ్మాటికి కాదు, ఇక తిరిగి పోవటమనేది జరుగదు, ఇకముందు బర్జఖ్ ఉంది. మృతులందరూ తిరిగి లేపబడే రోజువరకు." మృతునికి ప్రళయానికి మధ్య బర్జఖ్ ఎలా అడ్డుగావుందో, మృతునికి ప్రపంచానికి మధ్యకూడా అడ్డుగా ఉందని దీనితో రుజువుకావటం లేదా? మీరు ఆయతు పదాలపైనే కాదు, ఖుద్దుగా మీ పదాలపై కూడా ఆలోచించకపోవటం విచిత్రంగా ఉంది. బర్జఖ్కు సంబంధించి రెండు హద్దులు నిర్ణయింపబడ్డాయని, అవి మరణించినవాని మరణం మొదలుకొని ప్రళయం వరకు అని మీరే అంటున్నారు. దీనితో బర్జఖ్ ప్రారంభ హద్దు మానవుని ప్రాపంచిక మరణం, చివరి హద్దు పరలోక జీవనం అని స్పష్టంగానే అర్థమవుతున్నది. ఈ చివరిహద్దు, మృతునికి మరియు పరలోక జీవనానికి మధ్యఅడ్డు అయినప్పుడు, ప్రారంభహద్దు, మృతునికి మరియు ప్రపంచ జీవనానికి మధ్య అడ్డు ఎలా కాదు?

2. ప్రళయం రోజు అందరూ సామూహికంగా హాజరవుతారని, తద్వారా వారి కర్మల లెక్కలు చూసి, తీర్పు ఇవ్వబడుతుందని మేమూ

విశ్వసిస్తాము. కాని ఈ సామూహిక హాజరీ అనగానే,వివిధ సమయాల్లో ఒక్కొక్కరుగా మరణించిన వ్యక్తులు దైవసమక్షంలో హాజరుపరచ పడకుండా చాటుగా ఉంచబడతారని, మీరెలా అనుకున్నారు? మీరేవిధంగా, ఏ ఆధారంగా ఈ సిద్ధాంతాన్ని రూపొందించుకున్నారు? అంతేకాదు, నిరాధారమైన ఈ సిద్ధాంతం పునాదిపై మీరు ఒక మహాసౌధాన్నే నిర్మించేశారు. కాని ఖుర్ఆన్ ఈ సిద్ధాంతాన్ని బలపరచటం లేదు. ప్రతి జీవి తనకివ్వబడిన పరిమిత జీవితాన్ని గడిపి, దైవం వైపుకే మరలుతుంది. ఆ దైవం తప్ప వేరేక్కడా శరణ్యం లేదు, అని ఖుర్ఆన్ ప్రబోధిస్తుంది. "కుల్లు నఫ్సిన్ జాయిఖతుల్ మౌత్ సుమ్మఇలైనా తుర్జఊన్"

كُلُّ نَفْسٍ ذَآئِقَةُ الْمَوْتِ
ثُمَّ إِلَيْنَا تُرْجَعُونَ

"ప్రతి ప్రాణీ మరణాన్ని రుచిచూడ వలసి ఉన్నది, తరువాత మీరందరూ మా వైపుకే మరలింపబడతారు"
(అన్కబూత్- 57)

هُوَ يُحْيِي وَيُمِيتُ
وَإِلَيْهِ تُرْجَعُونَ

"ఆయన వైపునకే మీరంతా మరలి పోవాలి." (యూనుస్- 56)

చనిపోయిన ప్రతి వ్యక్తి దైవం వద్దకే పోతాడు, వేరెక్కడికీ పోడు, దైవం ఏ ఆత్మను, శరీరంలో ప్రవేశపెట్టాడో దాన్ని తిరిగి తీసేసుకోవటమే మరణం అనబడుతుంది.

اَللّٰهُ الَّذِي يَتَوَفَّى الْأَنْفُسَ
حِينَ مَوْتِهَا وَالَّتِي لَمْ تَمُتْ
فِي مَنَامِهَا فَيُمْسِكُ الَّتِي قَضٰى عَلَيْهَا
الْمَوْتَ وَيُرْسِلُ الْأُخْرٰى-

"మరణ సమయంలో ఆత్మలను వశపరుచు కొనేవాడు అల్లాహ్యే; ఇంకా మరణించినవాడి ఆత్మను అతను నిద్రావస్థలో ఉన్నప్పుడు వశ పరుచుకుంటాడు, ఆయన ఎవడి విషయంలో మరణ నిర్ణయం అమలు

చేస్తాడో దానిని (అతడి ఆత్మను)
ఆపి ఉంచుతాడు."

(అజ్జుమర్- 42).

ఈ ఆత్మ శరీరం నుండి వేరుపడగానే దైవం వద్దకే పోతుంది. వారితో ఇలా అను.

قُلْ يَتَوَفّٰىكُمْ مَلَكُ الْمَوْتِ الَّذِيْ وُكِّلَ بِكُمْ ثُمَّ اِلٰى رَبِّكُمْ تُرْجَعُوْنَ

"మీపై నియమింపబడిన మృత్యు దూత మిమ్మల్ని పూర్తిగా కైవసం చేసుకుంటాడు, తరువాత మీరు మీ ప్రభువు వైపునకు మరలింపబడి తీసుకుపోబడతారు."

(అస్సజ్దహ్- 11)

అందుకని ప్రాణాలుపోయిన తరువాత, ఆత్మలు తమ ప్రభువు సమక్షంలోకాక చాటుగా ఉంచబడతాయనే భావన వాస్తవం కాదు.

3. ఒకే పంక్తిముందు, మీరింతకు ముందు చెప్పిన దానికి ఇది భిన్నమైనది. అందరూ సాముహికంగా హాజరుపరచబడతారు. ఇంకా దీనికి సమానార్థంగల ఆయతుల అర్థాన్ని మీరుచెప్పిన భావంలోనే తీసుకుంటే, ప్రళయానికి ముందు ఎవరు కూడా హాజరుకావద్దనే సూత్రం దానంతటదే బయటపడుతుంది. ఈ ఆయతులలో సర్వుల కోసమని చెప్పబడింది. అందరికోసం ఇవ్వబడిన ఈ ఆదేశంలో ఎలాంటి మినహాయింపు లేదు. ఎవరూ మినహాయించబడలేదు. ప్రభువు ముందు హాజరయ్యేరోజు ప్రళయదినమని, అంతకుముందు ఎవరూ హాజరుకాలేరని మీరొక విశ్వాసం ఏర్పర్చుకున్నప్పుడు, షహీద్లు వెంటనే దైవసమక్షంలో హాజరవటం మీ విశ్వాసానికి వ్యతిరేకంగా పోతుంది. దైవం చెప్పాడని దేన్నైతే మీరు ఆరోపించారో అదే కనుక వాస్తవంలో దైవాదేశమే అయిఉంటే, అందరికోసం ఎక్కడెక్కడైతే ఈ ఆదేశం ఇవ్వటం జరిగిందో అక్కడ దైవమార్గంలో

చంపబడినవారు తప్ప, లేక ఇలాంటిదే వేరేదైనా మాటచెప్పి షహీద్‌లకు తప్పకుండా మినహాయింపు ఇవ్వబడేది.

4. వాటిలో ఆత్మలు కూడా నింపబడలేదు. ఈ పదాలు పరిశీల నార్హం. మీరు స్వయంగా నఖలుచేసిన నా వాక్యాన్ని, మరోసారి శ్రద్ధగా చదవండి, ఇక చెప్పండి. మీరు చెప్తున్నదేనా దాని భావం? ఆత్మలు ఇంకా శరీరాల్లో నింపబడక ముందు కూడా, వినటం, మాట్లాడటం, జ్ఞానం, అనుభూతి లాంటి లక్షణాలు లేని మరణం కాదది, ఆత్మ మానవుని శరీరం నుండి వేరుబడి ఉన్న స్థితి కాబట్టి దానికోసం, ఆ స్థితిని తెలుపటం కోసం మరణం అనే పదాన్ని ఉపయోగించటం జరిగింది. ఇదే వాస్తవంలో నేను చెప్పింది, చెప్పదలిచింది కూడా. ఆత్మ స్వయంగా సజీవమైనది. అందులో వేరేదో ఆత్మను నింపవలసిన అవసరం లేదు. ఆత్మప్రవేశం వల్లనే శరీరంలో జీవనం మొదలవుతుంది. వినటం, చూడటం, మాట్లాడటం, జ్ఞానం, అనుభూతి ఇవన్నీ వాస్తవంలో ఆత్మలక్షణాలే తప్ప శరీరానివి కావు. శరీర అవయవాలు ఆత్మకోసం పరికరాల్లాంటివి. వాటి ద్వారా ఈ ఆత్మ లక్షణాలు ఒక ప్రత్యేక రూపంలో బయల్పడతాయి. ఈ పరికరాలు (శరీర అవయవాలు) లేకపోయినప్పటికి, ఆత్మ వేరే రకంగా చూడ, వినగలుగుతుంది, మాట్లాడగలుగుతుంది, గ్రహించగలుగుతుంది. చూడటం, వినటం, మాట్లాడటం, గ్రహించటం అనేవి కేవలం మానవ అవయవాలైన చెవులు, నోరు, మేథస్సు ద్వారానే సంభవమని, ఇవి లేకుండా పై లక్షణాలు వేరెవ్వరితోనూ స్థాపితమవటం అసాధ్యమను కుంటున్నారా? అలాగైతే దైవం గురించి మీ అభిప్రాయమేమిటి? ఆయనకు మానవ శరీర అవయవాలున్నాయా? ఈ అవయవాలు (పరికరాలు) లేనంత మాత్రాన పై లక్షణాలు ఆయనలో లేవంటారా?

5. ఆదం సంతతి వీపుల్నుండి (ప్రళయం వరకు) రాబోయే వారి తరాలను అణువుల రూపంలో తీయటం జరిగిందని, వారినే ఖుద్దుగా వారిపై

సాక్ష్యంగా నిలుపుతూ, 'నేను నీ ప్రభువును కానా?' అని దైవం వారితో ప్రశ్నించగా, వారు అవును, దీనికి మేము సాక్ష్యం ఇస్తున్నామని సమాధానమిచ్చారని ఖుర్ఆన్ స్పష్టమైన పదాల్లో పేర్కొన్నది.

ఈ తరాలను తీయటమేమిటి, దైవంవారితో జరిపిన ప్రశ్నోత్తరాల పరిస్థితి ఏమిటి అనేది వేరే ప్రశ్న. ఏదోరకంగా వారి తరాలను తీసి, వారితో ప్రశ్నోత్తరాలు జరిగాయనేది మాత్రం దైవం స్పష్టంగా తెలుపుతున్నాడు. దైవ ఉనికిని గుర్తించే జ్ఞానం మానవుని నైజంలోనే పొందుపరచబడిందని తెలపటమే దైవ ఉద్దేశమైఉంటే, ఆ భావాన్ని తెలియపరచటానికి ఈ పదాలు వాడబడేవి కావు. ఈ పదాలూ భావాన్ని స్పష్టం చేయటం లేదు. తన భావాన్ని, ఉద్దేశాన్ని సంపూర్ణంగా, స్పష్టంగా తెలియపరచగలిగేంత పదజాలం-ఖుద్దుగా మీవద్ద ఉన్నంతగా కూడా దైవం వద్ద లేదనుకుంటున్నారా? లేకపోతే నిజప్రభువుకు (దైవం క్షమించుగాక) సామాన్యంగా అర్థంకాని భాషలో మాట్లాడటమే అలవాటని మీరు భావిస్తున్నారా?

6. భూమ్యాకాశాల్లో పర్వతాల్లో కూడా మనకింకా తెలిసిరాని ఒక రకమైన జీవితం ఉండే అవకాశం లేకపోలేదు. దైవం వాటితో మాట్లాడుతునూ ఉండవచ్చు. ఆ పరిస్థితిని మనం అర్థం చేసుకోవటంలో అశక్తులమై ఉన్నాము. మన జ్ఞానం, దాని వనరులు పరిమితమైనవి, కాని దైవజ్ఞానం, ఆయన శక్తిసామర్థ్యాలు అపరిమితమైనవి. వేటినైతే మనం చలనం లేనివి, మాట్లాడే యోగ్యత లేనివని భావిస్తున్నామో, వాస్తవంలో కూడా అవి అలాగే ఉన్నాయని చెప్పటానికి వీల్లేదు. ఒకవేళ అవి అలాగే ఉన్నాయనుకున్నా, ఏ క్షణంలోనైనా దైవం వాటికి వినే, మాట్లాడే శక్తిని ప్రసాదించగలడు. ప్రస్తుతం మానవునికున్న ఈ చెవులు, కళ్ళు, చర్మంలో మాట్లాడే యోగ్యత లేదు. ఇవే, ఈ అవయవాలే ఒకానొక సమయంలో మానవునికి వ్యతిరేకంగా సాక్ష్యం పలుకుతాయి. దీనిపై మానవుడు ఆశ్చర్యచకితుడైతే అవి అతనికిలా సమాధానిమిస్తాయి.

أَنْطَقَنَا اللّٰهُ الَّذِيْنَ أَنْطَقَ كُلَّ شَيْءٍ

"ప్రతి వస్తువుకూ మాట్లాడే శక్తిని ఇచ్చిన దేవుడే, మాకూ మాట్లాడే శక్తిని ఇచ్చాడు"
(హామీమ్ అస్సజ్‌దహ్- 21)

భూమ్యాకాశాల్లోని అనేక వస్తువులు, వేటిలోనైతే జీవనానికి సంబంధించిన ఏ ఛాయలు కూడా లేవని మీరు భావిస్తున్నారో అవన్నీ దైవ స్తోత్రం చేస్తున్నాయి. కాని అవిచేసే స్తోత్రాలు, విని గ్రహించగలిగే సాధనాలు మీవద్ద లేవు.

وَإِنْ مِّنْ شَيْءٍ إِلَّا يُسَبِّحُ بِحَمْدِهٖ وَلٰكِنْ لَّا تَفْقَهُوْنَ تَسْبِيْحَهُمْ

"దైవస్తోత్రంతోపాటు ఆయన పరిశుద్ధతను కొనియాడనటువంటిది ఏదీ లేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు." (బనీఇస్రాయీల్- 44)

నిర్జీవమైన ఈ భూమి, ప్రాణంలేని ఆకాశం దైవంతో మాట్లాడి ఉన్నాయని ఊహించటానికి కూడా మీరు నిరాకరిస్తున్నారే! అయితే దైవం వారితో మాట్లాడాడు, అవి ఆయనకు సమాధానమిచ్చాయి.

ثُمَّ اسْتَوٰى إِلَى السَّمَاءِ وَهِيَ دُخَانٌ فَقَالَ لَهَا وَلِلْأَرْضِ ائْتِيَا طَوْعًا أَوْ كَرْهًا قَالَتَا أَتَيْنَا طَائِعِيْنَ

"తరువాత కేవలం పొగగా ఉన్న ఆకాశం వైపునకు ఆయన తన ధ్యానాన్ని మరల్చాడు. ఆయన ఆకాశాన్నీ, భూమినీ ఉద్దేశించి ఇలా అన్నాడు, "ఉనికిలోకి రండి, మీకు ఇష్టమయినా, ఇష్టంకాకపోయినా, అవి రెండూ మేము వచ్చేశాము విధేయుల మాదిరిగా అని అన్నాయి.

(హామిమ్ అస్సజ్‌దహ్- 11)

వీటన్నిటిని కూడా మీరు పెడదారి పట్టించవచ్చు. కాని దైవం తనకున్న అపార, అపరిమిత, సంపూర్ణ సత్యజ్ఞానం ద్వారా మాట్లాడుతాడు, అంతటి విస్తారమైన, బహుముఖమైన జ్ఞానం మనకు లేదు. మనకున్న అల్ప, అసంపూర్ణ, లోపభూయిష్టమైన జ్ఞానం ఆధారంగా ఆయన చెప్పిన విషయాల్ని అంగీకరించటానికి వెనుకాడతాము. కాని వాస్తవంలో మన ఈ చర్య, చీకట్లో బాణం వదిలినట్లుంటుంది.

7. ఇంతకు క్రితం నెం.1లో ఇవ్వబడిన సమాధానంలో దీన్ని మూలాన్ని పటిష్టపరచటం జరిగింది. కనుక నేను లేపిన అభ్యంతరాలు యధాతథంగానే ఉన్నాయి.

8. మృతుడిలా అంటున్నాడు.

"ప్రభూ! నన్ను తిరిగి పంపించండి. నేను విడిచివచ్చిన (చోటికి వెళ్ళి) పుణ్యకార్యాలు చేస్తాననే ఆశ ఉంది." దానిపై దైవం **"ముమ్మాటికి ఇది జరగదు, అదో మాట మాత్రం నీవంటున్నావు. మృతులందరూ లేపబడే రోజు వరకు; నీ ముందు ఒక అడ్డు ఉంది"** అని సమాధానమిచ్చాడు. కాని మీరనేదేమిటి? లేదు, మృతుడు ఇంకా అక్కడే ఉన్నాడు. ఎక్కడున్నాడో, తిరిగి అక్కడికి రావటానికి విన్నవించుకుంటు న్నాడు. ఎక్కడైతే పుణ్య కార్యాలు చేస్తానని ఆశిస్తున్నాడో దాన్ని (ఆ స్థలాన్ని) ఇంకా అతను వదల్లేదు. దైవం అతన్ని ప్రపంచానికి తిరిగి పంపించ నిరాకరించటానికి కారణమైన ఆ 'అడ్డు' ఇంకా ఏర్పడలేదు. ఇక మీరే చెప్పండి. మేము మీ మాటను నమ్మాలా లేక దైవం చెప్పే మాటను విశ్వసించాలా? లేక ఎవరైతే ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారో ఆ వ్యక్తిమాటను నమ్మాలా?

9. నిస్సందేహంగా కొన్ని ఆయతులను మీరు ఈవిధంగా కూడా అర్థంచేసుకోవచ్చు. కాని

"తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి ప్రాణాలను తీసి, దైవదూతలు వారిని 'ఇదేమిటీ మీ పరిస్థితి ఇలా ఉందీ?"

اِنَّ الَّذِيْنَ تَوَفّٰىهُمُ الْمَلٰٓئِكَةُ ظَالِمِيْٓ اَنْفُسِهِمْ قَالُوْا فِيْمَ كُنْتُمْ

(అన్‌నిసా- 97)

అనే ఈ ఆయతులోని ఈ మాటలు ప్రాణం తీసే చర్యకు పూర్వం జరిగినవి అనటం ఘోరం. ఇది మరోవిధంగా అర్థం చేసుకుంటున్నారనటానికి బదులు, అర్థాన్ని మార్చేస్తున్నారనాల్సి వస్తుంది. "తవఫ్ఫాహుమ్" అనే పదమే, ప్రాణం తీసే చర్య పూర్తి అయినట్లు, మృతునితో, దైవదూతల ఈ సంభాషణ ఆ తరువాత జరిగినట్లు స్పష్టపరుస్తున్నది.

10. దైవభీతి పరాయణుల అంతాన్ని తెలుపుతూ, పరలోకంలో వారికి లభించే బహుమానాలు, ప్రతిఫలాలను ఏకరువు పెడుతూ, ఇంకా ఇలాంటి వ్యక్తుల ప్రాణాలు తీసినప్పటినుండే వారికి దైవానుగ్రహాలు లభించటం ప్రారంభమవుతాయని అదే సమయంలో దైవం తరపున దైవదూతలు వారికి శుభాన్ని, స్వర్గంలో ప్రవేశిస్తారనే శుభవార్తను కూడా అందజేస్తారని ఈ ఆయత్‌లో దైవం ఉపదేశించాడు. 'తతవఫ్ఫాహుమ్'కు వెనువెంటనే "యఖూలూనా" అనే పదాల ద్వారా ప్రాణాలు తీసిన వెంటనే దైవదూతలు ఈ మాటలు సజ్జనులతో అంటారని స్పష్టమైపోతున్నది. ప్రాణాలు తీసే చర్య ఇప్పుడు దైవదూతల సంభాషణ ప్రళయం రోజు జరిగి ఉండేదయితే ఈ విషయాన్ని తెలియజేయటానికి ఖుర్‌ఆన్ ఈ విధంగా వర్ణించి ఉండక పోయేది. ఇక్కడ తిరిగి మీరు మీ సిద్ధాంతాల్ని పునరావృతం చేస్తారేమో అంటే మరణం మరియు ప్రళయం మధ్య (మృతునికి) కాలజ్ఞానం లేదని, మృతుని ప్రాణం తీయబడే ఈ చర్య, దైవదూతలు ప్రళయం రోజు మాట్లాడే ఈ మాటలు రెండూ ఒకే సమయంలో జరుగుతాయంటారేమో! కాని మీ సిద్ధాంతంపై నేను లేవదీసిన అభ్యంతరాలను దూరపరచనంతవరకు మీ

ఈ సిద్ధాంతాన్ని నా ముందుంచలేరు. ఏ సిద్ధాంతాన్నైతే, నేనసలే ఒప్పుకోవటం లేదో దాన్నే దృష్టాంతంగా నాముందు మీరెలా ప్రతిపాదించగలరు?

11. ఖుర్‌ఆన్ అవగాహన పద్ధతులనెరిగినవారు, ప్రళయస్థితి ఎప్పుడు, బర్‌జఖ్ స్థితి ఎప్పుడు అనే విషయాన్ని గుర్తెరుగుతారు. ఖుర్‌ఆన్ స్పష్టంగా, విశదరూపంలో పేర్కొంటున్న బర్‌జఖ్ స్థితిని ప్రళయస్థితిగా భావించటం ఖుర్‌ఆన్ అవగాహన అనిపించుకోదు.

12. ఈ ఆయత్ భావాన్ని కూడా పదవనెంబర్‌లో వివరించినట్లుగానే భావించాలి. ఇందులో పాపులకు, నేరస్థులకు పరలోకంలో లభించే శిక్షను వివరిస్తూ ఈ శిక్ష, ప్రాణం తీసిన వెంటనే ప్రారంభమవుతుందని తెలుపటం జరిగింది.

"దైవదూతలు, హతులైన అవిశ్వాసుల ప్రాణాలను తీస్తున్నప్పటి స్థితిని నీవుగనక చూడగలిగితే ఎంత బాగుండేది! వారు వారి ముఖాలపైని, పిరుదులపైని కొట్టేవారు, ఇంకా ఇలా అనేవారు. "ఇదో, కాల్చే శిక్షను అనుభవించండి" (అన్‌ఫాల్- 50)

وَلَوْ تَرَىٰ إِذْ يَتَوَفَّى الَّذِينَ كَفَرُوا الْمَلَائِكَةُ يَضْرِبُونَ وُجُوهَهُمْ وَأَدْبَارَهُمْ وَذُوقُوا عَذَابَ الْحَرِيقِ

"ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగితేలుతూ ఉండగా, దైవదూతలు తమ హస్తాలనుచాచి, 'ఇటు తెండి! బయటకు తియ్యండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అపనిందను మోపి అన్యాయంగా కూసిన కూతలకూ, ఆయన ఆయతులపట్ల తలబిరుసుతనం ప్రదర్శించి

اور وَلَوْ تَرَىٰ إِذِ الظَّالِمُونَ فِي غَمَرَاتِ الْمَوْتِ وَالْمَلَائِكَةُ بَاسِطُوا أَيْدِيهِمْ أَخْرِجُوا أَنفُسَكُمُ

నందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించ బడుతుంది." (అల్ అన్ఆమ్-93)

పై ఆయతుల ద్వారా, దౌర్జన్యకారులపై ప్రాణం తీసిన వెంటనే కాఠిన్యాలు ప్రారంభమవుతాయనే భావానికి బలం చేకూరుతుంది.

13. దైవమార్గంలో చంపబడినవారి మరణాన్ని ఖండించటం, వారికి జీవితం ఉందనటానికి గల అసలు కారణాన్ని నేనింతవరకు ముందే వివరించాను. బహుదైవారాధకుల ఆరాధ్యుల జీవితాన్ని ఖండించటం, వారి మరణాన్ని బలపరచటానికి గల కారణం కూడా తెలిసే ఉంది. మీరు నిత్యసజీవమైన నిజదైవాన్ని విడిచి, ఏ చిన్న వస్తువును కూడా సృష్టించే యోగ్యత లేని ఆ దీనుల్ని ఎందుకు వేడుకుంటున్నారు. తామెప్పుడు తిరిగి లేపబడతామో అనేది కూడా తెలియని పూర్తి మృతవ్యవస్థలో ఉన్నారు పాపం. వారిని ఏమాత్రం జ్ఞానంలేని సంపూర్ణ మృతులు అని పేర్కొని వారి దీనత్వాన్ని, శక్తిహీనతను, దిక్కుమాలినతనాన్ని ఎత్తిచూపటం జరిగింది. ఈ ఉద్దేశం కోసమే 'ఏమాత్రం జ్ఞానంలేని సంపూర్ణ మృతులు' అనే పదం ఉపయోగించబడింది. వారు బ్రతికి ఉన్నా కూడా, ఏ చిన్న వస్తువును సృష్టించే యోగ్యతగాని, శక్తిగాని, ప్రళయం ఎప్పుడొస్తుందో తెలుసుకునే జ్ఞానంగాని వారికి లేదనే విషయం తెలియనిదా? ఇలాంటి ఆయతులను చూపించి, షహీద్‌లు, షహీదేతరుల జీవన, మరణాల మధ్య మీరెలాంటి మౌలికమైన వ్యత్యాసాన్ని రుజువు చేయలేరు. షహీద్‌లను (దైవమార్గంలో చంపబడినవారిని) సజీవులన్నారని, సామాన్య భాషలో వాడబడే మరణం వారిని వరించదనే అర్థమే గనుక మీరు తీసుకుంటే, వారిని ఖననం చేయటం, వారి ఆస్తిని పంచుకోవటం, వారి వితంతువులు పునర్వివాహాలు చేసుకోవటం ఇలాంటివన్నీ నిషేధితమవుతాయి. దానికి భిన్నంగా శారీరక మరణం వారికి సంభవిస్తుందని, ఏ జీవితమైతే వారికి లభించిందని తెలుపటం జరిగిందో, అది ఆధ్యాత్మిక జీవితమని మీరు అంగీకరించి

నట్లయితే (ఎలాంటి కాలజ్ఞానం లేని) సంపూర్ణ మృత్యువు అని దేన్నైతే మీరు అంటున్నారో ఖుర్ఆన్‌లో దీని పర్యాయపదం మృత్యువు కాదని మీరు ఒప్పుకున్నట్లే. సంపూర్ణ మరణం ఎలాంటి కాలజ్ఞానం లేనటువంటి మృత్యువు అని దేనికయితే మీరు పేరుపెట్టారో ఆ అర్థంలో ఖుర్ఆన్ మరణాన్ని పేర్కొనటం లేదు. అంతేకాదు, శారీరక జీవనం కాకపోయినప్పటికీ అది వేరేరకమైన ఏ జీవనమైనా సరే. ఖుర్ఆన్ దానికి "జీవితం" అనే పదాన్నే వాడుతుంది. బర్జఖ్‌లో మృతులందరికి లభించేది ఈ రకమైన జీవితమేనని మేము రుజువు చేస్తున్నాము. బర్జఖ్‌వాసులకు ఈ రకమైన ఎలాంటి జీవితం లేదని రుజువు చేసే ఏ ఒక్క ఆయతు కూడా మీరు ఖుర్ఆన్ నుండి చూపించలేరు.

14. ఖుర్ఆన్‌ను తిరస్కరించటానికైతే నిస్సందేహంగా మేము కంపించిపోతాము. కాని ఒక మానవమాత్రుని అభూతకల్పనలను తిరస్కరించి, కంపించిపోయే అవసరంలేదు. ఇప్పుడు మీరు ప్రదర్శిస్తున్న ఆయతులు, లేక ఇంతకుముందు ప్రతిపాదించిన ఆయతుల వల్ల ఎక్కువలో ఎక్కువ బయల్పడే విషయమేమిటంటే, బర్జఖ్‌వాసులు ప్రపంచవాసుల మాటల్ని వినలేరు, వారికి సమాధానమివ్వలేరు. ప్రపంచ వాసుల స్థితిగతులను తెలుసుకోలేరు, అంతే. బర్జఖ్‌వాసులు, ఇహలోక వాసులను వినలేరు, వారి స్థితిగతులను తెలుసుకోలేరు, కనుక వారిలో వినే, మాట్లాడే శక్తి కూడా లేదని, జ్ఞానం కూడా లేదనే విషయాన్ని మీరు మీ తరఫున పెంచుకున్నారు. తమరు పెంచిన ఈ విషయాలను విశ్వసించండని మమ్మల్ని కోరే ముందు బర్జఖ్‌వాసులకు వినే, మాట్లాడే శక్తిగాని, జ్ఞానంగాని వారి నైజంలోనే లేదని ఖుర్ఆన్ ద్వారా రుజువు చేయాల్సి ఉంటుంది. లేకపోతే మీ వాదనా పద్ధతి ఎంత విచిత్రంగా ఉందంటే, రేపు హైదరాబాద్ వాసులంతా సంపూర్ణ మృత వ్యవస్థలో ఉన్నారని, ఎందుకంటే వారు ఢిల్లీ వాసుల మాటలు వినలేరని, వారికి జవాబు ఇవ్వలేరని. వారి స్థితిగతుల నెరుగరనే కారణం చూపించవచ్చు.

15. తమ ప్రభువు వద్ద వారికి శ్రేష్టమైన జీవిక ఉన్నదనే విషయాన్ని మీరు షహీద్‌ల కోసం ప్రత్యేకించారు. వాస్తవంలో దైవమార్గంలో వలస వెళ్ళేవారికి, దైవధర్మానికి సేవచేస్తూ మరణించినవారికి ఇలాంటి వారందరికీ పై ఆయతులు వర్తిస్తాయనే విషయం మీరు గమనించినట్లు లేదు. దైవ మార్గంలో చంపబడినవారు, వారి ఉన్నత స్థానాలను గురించి చర్చించిన ఆయతులలోనైతే ఈ గౌరవోన్నతులు కేవలం వారికోసం ప్రత్యేకించబడినట్లు వేరెవరికీ ఇవి లభించవని ఎక్కడా పేర్కొనబడలేదు. కనుక అలా పేర్కొన బడనప్పుడు, ఇంకా దైవమార్గంలో చంపబడినవారు చంపబడనివారు-ఇద్దరి స్థానాలను ఒకేసారి పేర్కొన్నప్పుడు దైవసమక్షంలో హాజరవటంలోను, ఉన్నత స్థానాలు పొందటంలోనూ శ్రేష్టమైన జీవిక పొందటంలోనూ, వీరిద్దరిలో వెనుకాముందు అనే తారతమ్యం చూపించబడలేదనే విషయం స్పష్టమవుతున్నది. ముందు, వెనుక అనే ఆదేశం మీరు స్వయంగా కల్పించుకున్నారు. ఒక వర్గానికి చనిపోయినవారిని, వేరొక వర్గానికి బ్రతికున్న వారనటమే మీ ఈ స్వయం కల్పనకు కారణం. కాని శారీరక మరణం దృష్ట్యా, ఇద్దరూ మరణించిన వారేనని ఇంతకుముందే మేము చర్చించి రుజువు చేశాము. ఇక ఆధ్యాత్మికంగా చూస్తే రెండు వర్గాలూ జీవించే ఉన్నాయి. కాని కొన్ని అనివార్య కారణాల వల్ల ఒక గొప్ప ఔచిత్యం దృష్ట్యా దైవమార్గంలో చనిపోయిన వారిని 'మృతులు' అనకూడదని ఆదేశిస్తూ వారి ఆధ్యాత్మిక జీవితాన్ని ఎత్తిచూపటం జరిగింది. కాని దీనిద్వారా ఆధ్యాత్మిక జీవనమనేది కేవలం దైవమార్గంలో చంపబడినవారికి మాత్రమే ప్రత్యేకమని, వారుకాక మిగిలిన ప్రవక్తలు, సత్యవంతులు, నీతిమంతులు, దైవభీతికలవారెవరికీ కూడా ఇది లభించదనటం వాస్తవంకాదు.

16. ప్రళయంరోజే అతన్ని ఈవిధంగా సంబోధించటం జరుగుతుం దని, ఆరోజే అతను ఆనందభరితుడవుతాడని మీరెందుకు భావించలేదు? బర్‌జఖ్‌ను శూన్యకాలం (లెక్కగాని, జ్ఞానంగాని, అనుభూతిగాని లేని కాలం)గా మీరు (మీ అంతట మీరు) రుజువు చేసుకున్నారుగా! ఇక 'హాఖ

బిఅలి ఫిర్‌ఔన సూఅల్ అజాబి" మరియు "ఉగ్‌రిఖూ ఫఉద్‌ఖిలూ నారా" అనే ఆయతులలో భూతకాలాన్ని, భవిష్య కాలపు అర్థంలో వినియోగించుకున్నారు. ఇక మిగిలిందేమిటి? ఇన్ని ఘట్టాలను అధిగమించిన తరువాత ఇక ఆ సజ్జన పురుషున్ని 'షహీద్'గా నిర్ధారించటానికి తటపటాయించే అవసరమే లేదు.

17. "ఇల్లియ్యీన్" అనే పదానికి అరబ్బి భాషాపరంగా రెండర్థాలు తీసుకోవచ్చు. ఒకటి ఉన్నత అంతస్థులు లేక స్థానాలు, ఇక రెండవ అర్థం ఆ స్థానాల్లో, ఆ అంతస్థుల్లో ఉండేవారు. అయితే రెండవ అర్థమే సరియైనదనిపిస్తుంది. దీనికి కారణం ఏమిటంటే ఇది మాట్లాడగలిగే వీరందరికోసం ప్రత్యేకించబడింది. "యిల్లియ్యీన్"ను దైవం వ్రాయబడిన గ్రంథంగా వర్ణించాడు. దీని అర్థం ఏమిటంటే పుణ్యాత్ముల అందరిపేర్లు అందులో వ్రాయబడతాయి. ఇదేవిధంగా నిఘంటువు క్రమం సిజ్జీన్‌కు కూడా రెండర్థాలున్నాయి. చెరసాల లేక ఖైదీ(నేరస్థుడు). ఇందులో నేరస్థుల (ఖైదీల) పేర్లు వ్రాయబడుతున్నందున దీన్ని సిజ్జీన్ అనటం జరిగింది. అరబ్బి భాషాపరంగా ఇది మీకు ఎందుకు విచిత్రంగా కనబడిందో నాకు అర్థం కాలేదు. ఇక పేర్లు నమోదుకాగానే పుణ్యాత్ముల, పాపాత్ముల ఆత్మలు కూడా వీటిలో ప్రవేశిస్తాయా అనే ప్రశ్న జనించవచ్చు. దీనికి సాక్ష్యం ఖుర్‌ఆన్‌లో ఉంది. హజ్రత్ ఇద్రీస్(అలై) గురించి ఇలా చెప్పటం జరిగింది.

وَرَفَعۡنَاهُ مَكَانًا عَلِيًّا

"మేము అతనిని ఉన్నతస్థాయికి లేపాము. (మర్యమ్- 57)

దీనిద్వారా అర్థమయిందేమిటంటే, హజ్రత్ ఇద్రీస్(అలై) కేవలం పేరు మాత్రమే ఇల్లియ్యీన్‌లో నమోదుకాలేదు. అందులో ఆయనకు ఒక ఉన్నతస్థానం కూడా కేటాయించబడింది. ఇదేవిధంగా పాపాత్ములు, దౌర్జన్యపరుల గురించి కూడా వారందులో ప్రవేశించారని, వారక్కడ యాతనలను అనుభవిస్తున్నారని రుజువు చేసే ఎన్నో ఆయతులు

ప్రదర్శించబడ్డాయి. ఈ విషయాన్ని వివరించటానికి ఇవ్వబడిన దృష్టాంతం కేవలం అర్థం చేయించటానికే తప్ప వాదన కోసం కాదు.

18. ఈ విషయంలో మౌలానా సయ్యద్ సులేమాన్ నద్వీగారు తన వ్యాసం "బర్‌జఖ్- ఒక కోణం"లో ఏవిధంగానైతే సమాధానమిచ్చారో, అదిచూసిన తరువాత మీకు తృప్తి కలగొచ్చని నేను భావించాను. కాని ఆ వ్యాసానికి జవాబుగా "బర్‌జఖ్-మరో కోణం"లో మీరు వాదించిన తీరును చూసిన తరువాత "మనిషి ఒక ప్రత్యేక ఆలోచనతో ఖుర్‌ఆన్‌లో జొరపడితే, అతను ఆయతులలో ఎలాంటి మార్పులు, అపహరణలు చేస్తాడో అర్థమై పోయింది. ఈ ఆయతులో మొదట శిక్ష గురించి, ఆ తరువాత కఠినశిక్ష గురించి స్పష్టంగా పేర్కొనటం జరిగింది. మామూలు శిక్ష తరువాత, రాబోయే నిర్ణీత దినపు కఠినశిక్షను గురించి చెప్పటం జరిగింది. ఒకవేళ ఇదంతా ప్రళయదినానికి సంబంధించేందనని, ఇదంతా కలిపి ఒకేశిక్ష అనుకుందామనుకుంటే ఆయతులో వాడబడిన పదాలు సంఘటనకు, పరిస్థితికి వ్యతిరేకంగా పోతున్నాయి. కాని కష్టమేమిటంటే మీరు కొన్ని సిద్ధాంతాలను ఏర్పర్చుకున్నారు. బర్‌జఖ్‌వాసులకు జీవనం లేదని, వారికి కాల జ్ఞానం లేదని, వారు శిక్ష లేక అనుగ్రహానికి అనుభూతి పొందే యోగ్యతనే కలిగి లేరని మీరు ముందే నిశ్చయించుకున్నారు. అందుకని మీ ఈ సిద్ధాంతాలను రద్దుపరచగలిగే ఏ ఆయతును మీ ముందుంచినా, మీ సిద్ధాంతాల్లోనైతే మీరు మార్పుచేసుకోరు, దానికి బదులు ఈ ఆయతులలోని స్పష్టమైన భావాల్ని మీ సిద్ధాంతాల కనుగుణంగా మలుచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

19. దృష్టాంతాలకు మీరిచ్చే సమాధానం సముచితమైన జవాబు కాదు. మీరు ఏర్పర్చుకున్న సిద్ధాంతాలను బలపరచటానికి ఖుర్‌ఆన్ నుండి నిదర్శనాలను చూపించలేదనేదే నా అసలు అభ్యంతరం. ఇక ఖుర్‌ఆన్‌లోని ఏ ఆయతులోనైతే మీరు పేర్కొన్నారో, అవి మీ సిద్ధాంతాలను ధృవీకరిం

చటంలేదు. దీనికి భిన్నంగా నేను ఖుర్‌ఆన్ ఆయతులనే చూపించి, మీ సిద్ధాంతాలు తప్పని నిరూపించాను. ఆ తరువాత కూడా మీరు, నాకు సమాధానంగా ఆ ఆయతునే గనక పఠిస్తే ఇక నేను కూడా ఈ ఆయతును చదవాల్సివస్తుంది.

فَوَيْلٌ لِّلَّذِيْنَ يَكْتُبُوْنَ الْكِتٰبَ بِاَيْدِيْهِمْ ثُمَّ يَقُوْلُوْنَ هٰذَا مِنْ عِنْدِ اللّٰهِ

"షరీయత్తు గ్రంథాన్ని స్వహస్తాలతో రచించి, తద్వారా తుచ్ఛప్రయోజనం పొందే నిమిత్తం 'ఇది అల్లాహ్ వద్ద నుండి వచ్చింది' అని ప్రజలకు చెప్పేవారికి వినాశం తప్పదు."
(అల్ బఖర- 79)

20. మీరు నా పూర్తి వాక్యాన్ని వ్రాయలేదు. ఆ వాక్యం తరువాత నేనిలా వ్రాశాను. "కొన్ని ఇతర ఆయతులలో బర్‌జఖ్ జీవితం, అందులోని పుణ్యాపాప ఫలాలను ఒక సంఘటనగా, ఒక వాస్తవంగా ఎలా పేర్కొనటం జరిగిందో అదేవిధంగా ఈ ఆయతులలో ఇహపరలోకాల్లో లభించే పుణ్య పాప ఫలాలను ఒక సంఘటనగా, ఒక వాస్తవంగా పేర్కొనటం జరిగింది. ఏ ఆయతులలోనైతే కేవలం ఇహపరాల పుణ్యాపాప ఫలాలను పేర్కొనటం జరిగిందో ఆ ఆయతులను ఆధారంచేసుకొని, ఇహపరాల్లో తప్ప ఇంకెక్కడ కూడా పుణ్యాపాపఫలాలు లేవని నిర్ధారణకు రావటం సమంజసంకాదు, అని రుజువుచేయటానికే ఈ ఆయతులను చూపించాల్సి వచ్చింది. కారణం ఏమిటంటే పుణ్యాపాపఫలాలు కేవలం ఇహలోకం, పరలోకంలోనే ఉన్నాయని ఈ రెండింటి మధ్య ఏమీ లేదనే వివరణ ఈ ఆయతులలో లేదు. ఇక బర్‌జఖ్ ఆధ్యాత్మిక జీవనం లేదని అందులో పుణ్యాపాప ఫలాలే లేవని నిరూపించటానికి "ఖుర్‌ఆన్ దృష్టాంతాలు"గా వేటినైతే మీరు పేర్కొన్నారో, అవి ఖుర్‌ఆన్ దృష్టాంతాలేనా? అనే విషయం లోనే మీరూ, మేమూ వాదించుకుంటున్నాము. అలాంటప్పుడు నిస్సందేహంగా ఇవి ఖుర్‌ఆన్

దృష్టాంతాలే అని నిరూపించటానికి బదులు మీరు మీ వాదననే తిరిగి దృష్టాంతాలుగా, ప్రమాణాలుగా చూపిస్తున్నారు. తర్కశాస్త్ర పరిభాషలో ఇలాంటి వాదనాశైలి ఏమని పిలుస్తారో మీకు తెలుసనుకుంటాను.

21. షహీద్‌లకు సంబంధించిన విషయంలో మీ పరిస్థితి మీ ధోరణి సందిగ్ధంగా ఉంది. కాని మీరు దీన్ని అసందర్భమైనదని దాటవేస్తున్నారు. ఇది సందర్భోచితమైనదే కాదు, మీకు వ్యతిరేకంగా ఒక బలమైన అభ్యంతరం కూడాను. మృతులందరూ ప్రళయదినం రోజు లేపబడతారని, ఆ రోజే వారి కర్మల ప్రకారం తీర్పు జరుగుతుందని ఒకచోట అంటుంది ఖుర్ఆన్. వేరొక చోట, మృతులందరి గురించి వారు తిరిగి పుట్టింపబడే రోజు (ప్రళయదినం) వరకు బర్జఖ్‌లో ఉంటారని పేర్కొంటుంది. ఎక్కడెక్కడైతే ఈ రెండు విషయాలు పేర్కొనటం జరిగిందో, అక్కడ ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఛాయ కూడా లేదు. చనిపోయేవారందరిలాగే, షహీద్‌లు కూడా ప్రళయం వరకు బర్జఖ్‌లో ఉంటారని, ప్రళయంకంటే ముందు వీరికెలాంటి ప్రత్యేక పుట్టుక (పునరుత్తానం) ఉండదని, దీని ద్వారా తెలిసిపోయింది. ఇక వారు దైవసమక్షంలో ఉన్నారని, వారికి జీవిక లభిస్తున్నదని ఏ విషయాన్నైతే ఖుర్ఆన్ పేర్కొంటున్నదో అదెక్కడ? నిస్సంశయంగా ఈ బర్జఖ్‌లోనే. కనుక ఈ విధంగా మీరు రూపొందించు కున్న సిద్ధాంతాలన్నీ 'మిథ్య' అని తేలిపోయింది. అంటే బర్జఖ్‌వాసులు సంపూర్ణ మృత స్థితిలో లేరు, దైవసమక్షం నుండి చాటుగా ఉంచబడలేదు, పుణ్యపాప ఫలాలనుండి దూరంగా ఉంచబడలేదు.

22. ఒక దృష్టాంతాన్ని సమర్పిస్తున్నప్పుడు, మనిషి స్వయంగా తన మనసులో ఆలోచించుకోవటం ఎంత అవసరమో, అదేవిధంగా ఒక దృష్టాం తాన్ని రద్దుపరిచే ముందు కూడా మనిషి తన మదిలో ఆలోచించుకోవటం అంతే అవసరం. జవాబిచ్చే సందర్భంలో మీరొక ఆయతును ప్రతిపాదిం చారు. అందులో వచ్చిన విషయాన్ని మీరోసారి నిశిత దృష్టితో చూస్తే అది

మీ వాదనను సమర్థించదనే విషయం తెలిసిపోయేది. వారు సంవత్సరాని కోసారో, రెండుసార్లో సంక్షోభానికి గురిచేయబడతారని ఈ ఆయతులో పేర్కొనటం జరిగింది. "మేము రెండుసార్లు వారిని యాతనకు (శిక్షకు) గురి చేస్తాము" అనే దాంట్లో, యాతనకు అర్థం ఈ సంక్షోభమే అయిఉంటే కేవలం రెండుసార్లు అని నియంత్రించటానికి అర్థం ఏమటి? దీనివల్ల ఎవరి గురించైతే సంవత్సరానికి రెండుసార్లు శిక్షింపబడతారు అని వచ్చిందో, వారు అత్యధికంగా ఒక సంవత్సరం మాత్రమే జీవిస్తారనే అపోహ ఏర్పడే అవకాశముంది. కాని ఇది వాస్తవం కాదు. (అంటే ఒకే సంవత్సరం బ్రతుకు తారనేది వాస్తవంకాదు). దీనిద్వారా ఆయతు మొదటి భాగంలో దేన్నైతే శిక్ష అనటం జరిగిందో, అదే ఆయతు లోని మరొక భాగంలో సంక్షోభంగా పేర్కొన్నదానికి ఇది భిన్నమైనదని రుజువవుతుంది. వాస్తవానికి జీవితంలోని సర్వసంక్షోభాల కూడికయే మొదటిసారి శిక్ష, దాన్నంటుకునే పేర్కొన్న మరొక శిక్ష బర్‌జఖ్ శిక్ష. ఆ తరువాత మహోన్నత శిక్షగా పేర్కొన్నది ప్రళయం తరువాత లభించే శిక్ష. (అంటే ఈ ఆయతులో మూడు శిక్షల గురించి పేర్కొనటం జరిగింది. చివరలో పేర్కొన్న మహోన్నత శిక్ష మాత్రం నిస్సం దేహంగా ప్రళయం తరువాత లభించే శిక్షే. ఇక మిగిలిన రెండు శిక్షలు, ఒకటి ప్రపంచంలో చేసిన పాపాలకు, విద్రోహాలకు ఒకసారి గట్టిగా శిక్షించటం జరుగుతుంది, ఆ తరువాత మరణించిన పిదప రెండవసారి బర్‌జఖ్‌లో శిక్షింపబడతారని అర్థం)

- : సమాప్తం :-